ఆదివారం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ fb.com/vaartha

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-2-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 9 పేజీలు: 10+4 వెల: 6.50

ఇంకా తేలని ఢిల్లీ ముఖ్యమంత్రి 5లో

నమీబియా జాతిపిత నుజోమా కన్నుమూత



## మళ్లీ దద్దరిల్లిన దండకారణ్యం

### భారీ ఎన్‌కౌంటర్

# 31మంది మావోయిస్టులు హతం

ఇద్దరు జవాన్లు మృతి, మరికొందరికి గాయాలు

మృతుల్లో పలువురు అగ్రనేతలు

చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర జాయింట్ ఆపరేషన్

40 రోజుల్లో 80 మంది నక్సల్స్ మృత్యువాత



**చర్ల, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** వరస ఎన్‌కౌంటర్లతో ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో రక్తమోడుతుంది.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించిన విధంగా మాటలు నిజం అయ్యేలా కనిపిస్తుంది. తాజా సంఘటనలు చూస్తుంటే ..గడిచిన 40 రోజుల వ్యవధిలో వివిధ ఎన్ కౌంటర్లలో సుమారు 80 మందికి పైగా మావోయిస్టులు మృత్యువాత పడ్డారు..తాజాగా చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఇంద్రావతి నేషనల్ ఏరియా పార్క్ అటవి ప్రాంతంలో ఆదివారం మావోయిస్టులకు భద్రతా బలగాల మధ్య భారీ ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పుల్లో 31 మంది మావోయిస్టులు మృతిచెందగా ఇద్దరు జవాన్లు మృతిచెందారు.మరో ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి.నేషనల్ పార్క్ అటవి ప్రాంతంలో ఇంద్రావతి ఏరియా కమిటీతో పాటు మరికొందరు మావోయిస్టు అగ్రనేతలు సమావేశం అయ్యారన్న ఇంటిలిజెన్సీ (నిఘా వర్గాల ) సమాచారం మేరకు బీజాపూర్ దంతెవాడ జిల్లాలకు చెందిన డిఆర్జీ ఎస్టీఎఫ్ సిఆర్పీఎఫ్ బలగాలతో పాటు మహరాష్ట్రకు చెందిన సి60 బలగాలు ఉమ్మడి ఆపరేషన్ చేపట్టాయి. మావోయిస్టులే లక్ష్యంగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టిమ భద్రతా బలగాలకు మావోయిస్టులు తారసపడటంతో >>2

## ఒకే వ్యక్తి.. ఒకే పార్టీ అదే..

# మోడీ రహస్య అజెండా



ఆదివారం తిరువనంతపురంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

హక్కుల కోసం దక్షిణాది రాష్ట్రాలు ఏకం కావాలి

తెలంగాణను ప్రపంచంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలనుకుంటున్నాం

దేశానికి డేటా సెంటర్ హబ్‌గా రాష్ట్రం

మాతృభూమి 'ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్' సదస్సులో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి9:** మెరుగైన కుటుంబ నియంత్రణ విధానాలను అవలభిస్తున్నందుకు దక్షిణాధి రాష్ట్రాలను శిక్షిస్తారా అని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని ప్రశ్నించారు. ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఒకే దేశం - ఒకే ఎన్నిక అంటూ మాట్లాడుతున్న మోడీ.. ఒకే వ్యక్తి - ఒకేపార్టీ అనే రహస్య అజెండాతో పని చేస్తున్నారని విమర్శించారు. ఆదివారం మలయాళీ దినపత్రిక మాతృభూమి ఆధ్వర్యంలో కేరళ రాజధాని తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ సదస్సులో సిఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు.రాజ్యాంగం ప్రసాదించిన గ్యారంటీలను, మన హక్కులను రక్షించుకునేందుకు దక్షిణాది రాష్ట్రాలు చేతులు కలపాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ అనేది నినాదంమాత్రమే కాదని, అది 4కోట్ల తెలంగాణ ప్రజల స్వప్నమన్నారు. రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అత్యుత్తమంగా నిలిపేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని, 60 ఏళ్ల కలను నెరవేర్చినందున తెలంగాణ ప్రజలు సోనియాగాంధీని ఎంతగానో ప్రేమిస్తున్నారన్నారు. తెలంగాణను >>2



మణిపూర్ సిఎం బీరేన్‌సింగ్

## మణిపూర్ సిఎం రాజీనామా

గవర్నర్‌కు రాజీనామా లేఖ సమర్పించిన బీరేన్ సింగ్

తెగల సంక్షోభంలో కునారిల్లుతున్న రాష్ట్రం

ప్రభుత్వానికి వ్యతిరేకంగా త్వరలో కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు సిద్ధం అవుతున్న నేపథ్యంలో ఆయన రాజీనామాచేయడం గమనార్హం. ఆరుగురు ఎమ్మెల్యేలున్న నేషనల్ పీపుల్స్ పార్టీ నేతలతో కాంగ్రెస్ పార్టీ నేతలు సంప్రదిస్తున్నారు. మెయిటీ కుకీ జాతులమధ్య సమస్య పరిష్కారంలో బీరేన్‌సింగ్ విఫలం అయ్యారని మేఘాలయ సిఎం కోన్రాడ్ సంగ్మా ఆరోపించారు. మేఘాలయ సీఎంను మార్చాల్సిందేనని డిమాండ్‌చేస్తున్నరు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించే అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా కొందరు బిజెపి ఎమ్మెల్యేలు అసెంబ్లీకి గైర్హాజరుకావాలని నిర్ణయంచుకున్నారు. దీనితో ఇక పదవీగండం >>2

## కామన్ ఎంట్రన్స్‌లకు

# కొత్త నిబంధన!

ఇక 15 నిమిషాల ముందుగానే గేట్లు మూసివేత!

న్యాయపరమైన చిక్కులపై ఆలోచిస్తున్న ఉన్నత విద్యా మండలి

నోటిఫికేషన్ల కంటే ముందుగానే నిర్ణయించే అవకాశం

ఇప్పటికే నీట్, జెఇఇ, టిజిపిఎస్సీ సైతం అమలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న వివిధ కామన్ ఎంట్రెన్స్ పరీక్షలకు ఇకపై కొత్త నిబంధనను అమలు చేయబోతున్నారు. అయితే ఆ నిబంధనను అమలు చేస్తే న్యాయపరమైన చిక్కులు ఏమైనా వస్తాయా? అనే అంశంపై తెలంగాణ ఉన్నత విద్యా మండలి సమాలోచనలు చేస్తున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో ఉన్నత విద్యలో ప్రవేశాల కోసం ఎప్‌సెట్, ఎడ్‌సెట్, ఐసెట్, లాసెట్, పీజీలాసెట్, ఇసెట్, పిజిఇసెట్, పిఇ సెట్ వంటి కామన్ ఎంట్రన్స్ పరీక్షలను తెలంగాణ ఉన్నత విద్యా మండలి నిర్వహిస్తున్న విషయం తెలిసందే. ఇప్పటి వరకు కామన్ ఎంట్రన్స్‌లకు ఒక్క నిమిషం నిబంధన అమలులో ఉంది. అయితే 2025-26 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించనున్న కామన్ ఎంట్రన్స్ పరీక్షలకు నిమిషం నిబంధన కాకుండా.. 15 నిమిషాల ముందుగానే పరీక్షా కేంద్రంలోనికి రావల్సి ఉంటుందనే నిబంధనను ప్రారంభించాలని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది. ఇప్పటికే నీట్, జెఇఇ, సివిల్స్ వంటి జాతీయస్థాయి పరీక్షలకు సంబంధించి పరీక్షకు అరగంట(30నిమిషాలు)ముందుగానే పరీక్షా కేంద్రం లోనికి రావల్సి ఉంటుంది. అదే నిబంధనను రాష్ట్రంలోని పోటీ పరీక్షలను నిర్వహించే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్సీ) కూడా అమలు చేస్తుంది. ఇదే నిబంధనను >>2

పారిశ్రామికవేత్త జనార్ధనరావు హత్య

86 ఏళ్ల తాతను 73 సార్లు కత్తితో పొడిచిన మనుమడు 3లో

మృతదేహానికి వైద్యం ఘటనపై విచారణకు ఆదేశించిన సర్కార్ 2లో

# రీసర్వే చేయించండి

ఈసారి కులగణనలో మేమంతా పాల్గొంటాం

## బిసిలకు ఏవీ కార్పొరేషన్లు?

## బిసి నేతలతో సమావేశమైన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి9:** బిసిల జనాభాను ఐదున్నర పర్సెంట్ తక్కువగా చూపించి కాంగ్రెస్ ప్రభుత్వం వారిని మోసం చేసిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు.ఆదివారం బీసీ సంఘాల నేతలతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 42 రిజర్వేషన్ల వాగ్దానాన్ని రేవంత్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని. దీనిపై శాసన సభ, శాసనమండలిలో బిఆర్ఎస్ పార్టీ తరఫున మా నిరసనను తెలిపామన్నారు.. కులగణన తప్పులతడక, చిత్తుకాగితంతో సమానం. ఈ సర్వేతో బలహీన వర్గాల గొంతును కాంగ్రెస్ కోసింది దీన్ని ఏ బీసీ బిడ్డా ఒప్పుకోడు అని పేర్కొన్నారు. మధుసూదనాచారి, తలసాని శ్రీనివాస్ యాదవ్ నాయకత్వంలో బిఆర్ఎస్ పార్టీ అసెంబ్లీలో తన వాదనను వినిపించిందని తెలిపారు. కులగణనను శాస్త్రీయంగా మళ్లీ రీసర్వే



చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బలహీన వర్గాల బిడ్డలు ఆందోళనలతో ఉన్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో, రేషన్ కార్డులలో, ఇండ్ల కేటాయింపుల్లో, ఆరు గ్యారంటీల్లో తమ వాటా తగ్గుతుందేమోనని అట్టడుగు స్థాయిలో ఉన్న ఎంబిసిలు, బిసి బిడ్డలు భయపడుతున్నారని తెలిపారు. ఉల్టా చోర్ కొత్వాల్‌కు >>2

## మార్చి నుంచి ఇంటెగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల పనులు ప్రారంభం

7లో

నెలాఖరులో టెండర్లు ఫైనల్

రూ. 200 కోట్లతో భవన నిర్మాణాలు

## స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలకు చెక్?

ఒక్క నామినేషన్ దాఖలైనా నోటాతో పోటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి9:** స్థానిక సంస్థల ఎన్నికలు ఏకగ్రీవాలకు ఎన్నికల సంఘం చెక్ పెట్టనుందని సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికలు ఏకగ్రీవాలు చేయాలన్న సర్కారు కి షాక్ ఇచ్చింది. ఏకగ్రీవాలకు ఎన్నికల సంఘం చెక్ పెడుతూ.. నోటాతో పోటీ పెట్టనుందని తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలు లేకుండా ఒక్క నామినేషన్ నమోదైనా నోటాను రెండో పోటీదారుగా పేర్కొంటూ ఎన్నిక నిర్వహించేందుకు ఈసీ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోందని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఏకగ్రీవాలపై కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.
దీనిపై ఈనెల 12న రాజకీయ పార్టీలతో చర్చించనుంది. అయితే పార్టీలు ఒకే చెప్పినా ప్రభుత్వం దీనికి అంగీకరిస్తుందా అనేది చూడాల్సి ఉందని అంటున్నారు.





ఆదివారం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు సిఎం పదవికి రాజీనామాపత్రం అందజేస్తున్న అతిశి

# ఢిల్లీ సిఎం పదవికి అతిశి రాజీనామా

## అసెంబ్లీని రద్దుచేసిన లెఫ్టినెంట్ గవర్నర్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:** ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి అతిశిమర్లేనాసింగ్ రాజీనామాచేసారు. ఆమె తన రాజీనామాపత్రాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనాకు అందచేసారు. వెనువెంటనే గవర్నర్ సక్సేనా కూడా ఢిల్లీప్రభుత్వాన్ని రద్దుచేస్తున్నట్లుప్రకటించారు. శనివారం వెల్లడయిన ఫలితాల్లో ఆమ్ ఆద్మీపార్టీకి ఘోరపరాభవం ఎదురయింది. మొత్తం 70 స్థానాలకుగాను బిజెపి 48 స్థానాల్లో గెలిచి అధికారం కైవసంచేసుకోగా అధికార ఆమ్ ఆద్మీపార్టీ కేవలం 22 స్థానాలకే పరిమితం అయింది. ఈ నక్రమంలోనే అతిశిసింగ్ సిఎం పదవికి రాజీనామాచేసారు. గత ఏడాది సెప్టెంబరులో ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ సిఎం పదవికి రాజీనామాచేసి అతిశికి సిఎం పదవిని కట్టబెట్టారు. ఢిల్లీ లిక్కర్‌స్కామ్‌లో జైలుకువెళ్లిన కేజ్రీవాల్ గత సెప్టెంబరులో బెయిల్‌పై బయటికి వచ్చినపుడు సిఎం పదవికి రాజీనామాచేసారు. అతిశి రాజీనామా తర్వాత అసెంబ్లీని రద్దుచేస్తూ ప్రకటన విడుదలచేసారు. ఢిల్లీ ఏడవ అసెంబ్లీని రద్దుచేస్తున్నట్లు లెఫ్టినెంట్ గవర్నర్ తన ప్రకటనలో వెల్లడించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన బిజెపి ప్రభుత్వం ఏర్పాటుకు కసరత్తులు మొదలుపెట్టింది. న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానంనుంచి కేజ్రీవాల్‌పై గెలిచిన పర్వేష్ వర్మకే సిఎంపదవి కట్టబెట్టనున్నట్లు తెలుస్తోంది. ప్రధాని మోడీ ప్రస్తుతం విదేశీ పర్యటనకు వెళుతున్నందున ఆయన అమెరికానుంచి రాగానే ఢిల్లీ సిఎం అభ్యర్థిని ఖరారుచేస్తారని తెలుస్తోంది.

# మణిపూర్ సిఎం రాజీనామా

>> తప్పదని మణిపూర్‌లో బిజెపికి సమస్యలు వస్తాయని గుర్తించిన హైకమాండ్ బీరేన్‌సింగ్‌ను రాజీనామాచేయాలని ఆదేశించడంతో తప్పనిపరిస్థితుల్లో బీరేన్‌సింగ్ రాజీనామాచేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా గడచిన రెండేళ్లుగా మణిపూర్ రావణకాష్టంగామారినసంగతి తెలిసిందే. ఆర్మీ ప్రత్యేకదళాలు అక్కడ మకాంవేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నా ఎక్కడో ఒకచోట మిలిటెంట్లు తెగలమధ్య ఘర్షణలు, ఉద్రిక్తతలు చెలరేగి పెద్ద ఎత్తున హింస చెలరేగుతోంది. ఈ క్రమంలోనే సుమారు 300 మందివరకూ ప్రాణాలు కోల్పోగా వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. ఇప్పటికీ మణిపూర్‌లో ప్రత్యేక శిబిరాలు కొనసాగుతున్నాయి. పొరుగుననే ఉన్న త్రిపుర, నాగాలాండ్, అస్సాం ప్రాంతాలకు రక్షణకోసం లక్షలాదిమంది వలసలు పోయారు. ఈ పరిస్థితుల్లో బీరేన్‌సింగ్‌ను మార్చి కొత్త నాయకత్వానికి బాధ్యతలు అప్పగిస్తే పరిస్థితులు అదుపులోకి వస్తాయని కేంద్రం భావిస్తోంది. దీనికితోడు హోంశాఖ కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణచేసిన సీనియర్ ఐఎఎస్ అధికారి అజయ్‌కుమార్ భల్లాను గవర్నర్‌గా నియమించడంతో మొత్తం సమగ్ర నివేదిక హోంశాఖకు వెళ్లిందని సమాచారం. ఈ క్రమంలోనే ఇపుడు మణిపూర్‌లో నాయకత్వ మార్పిడికి అనివార్యపరిస్థితులు ఏర్పడ్డాయని మణిపూర్‌నేతలు విశ్లేషిస్తున్నారు.

# మావోయిస్టులు హతం

>> ఇరువురి మధ్య హోరాహోరీగా ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పుల్లో 31 మంది మావోయిస్టులు మృతిచెందారు. మావోయిస్టుల జరిపిన కాల్పుల్లో ఇద్దరు జవాన్లు మృతిచెందగా మరో ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. గాయపడిన జవాన్లను హుటాహుటిన హెలికాప్టర్ సహాయంతో బీజాపూర్ జిల్లా హాస్పటల్ తరలించి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. ఈ ఘటనపై బస్తర్ ఐజి సుందర్ రాజ్.పి బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్‌లు మీడియాతో మాట్లాడారు. ఎన్ కౌంటర్‌లో 31 మంది మావోలు చనిపోయారని మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మావోయిస్టులపై భద్రతా బలగాలు పై చేయి సాధించాయని ఎన్‌కౌంటర్ మృతిచెందిన వారిని గుర్తు పట్టే ప్రక్రియ కొనసాగుతుందని మరిన్ని వివరాలు తర్వాత తెలియజేస్తామని అన్నారు. సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందని అన్నారు. కాగా గడిచిన ఏడాది కాలంలో ఇదే అతిపెద్ద ఎన్ కౌంటర్ కావడం గమనార్హం. గడిచిన 14 నెలల వ్యవధిలో ఇప్పటి వరకు 274 మంది మావోయిస్టులు మృతిచెందగా 1169 మందిని అరెస్టు చేయగా 970 మంది లొంగిపోయినట్లు ప్రభుత్వ ఘణాంకాలు తెలుపుతున్నాయి. మావోలపై దాడులు కొనసాగుతాయి... ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి హోంశాఖ మంత్రి విజయ్ శర్మఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోలపై నిత్యం దాడులు జరుగుతాయని మావోయిస్టు రహిత ఛత్తీస్‌గఢ్‌గా ఎజెండా ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి హోంశాఖ మంత్రి విజయ్ శర్మ అన్నారు. ఇంద్రావతి నేషనల్ పార్క్ ఏరియా లో అధికారం ఉదయం జరిగిన ఎన్ కౌంటర్ పై ఆయన మాట్లాడారు. మావోయిస్టులపై మా బలగాలు పట్టు సాధించాయని 31 మంది చనిపోయిన ఘటన భద్రతా బలగాల విజయంగా పేర్కొన్నారు. అయితే మావోల జరిపిన కాల్పుల్లో ఇద్దరు జవాన్లు మృతిచెందడం బాధాకరం అన్నారు మృతిచెందిన జవాన్లకు నివాళి అర్పిస్తు వారి పోరాట పటిమను కొనియాడారు. మావోయిస్టుల అణివేతకు నిరంతరం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందని అన్నారు. ఎన్ కౌంటర్ ఘటన ప్రదేశం పెద్ద ఎత్తున ఆయుధాలు లభ్యం అయ్యాయని తి47 303 రైఫిల్ ఇన్సాస్ బిజిఎల్ రాకెట్ లాంఛర్లు వంటి అత్యాధునికమైన ఆయుదాలు లభ్యం అయ్యాయని అన్నారు.

# ఎంట్రన్స్‌లకు కొత్త నిబంధన!

>> ఇకపై ఉన్నత విద్యా మండలి నిర్వహించే కామన్ ఎంట్రన్స్ పరీక్షలకు అమలు చేయాలని భావిస్తూ.. విద్యార్థులు పరీక్షా కేంద్రంలోనికి 15 నిమిషాల ముందుగానే చేరాల్సి ఉంటుందనే నిబంధనను తీసుకురావాలని భావిస్తోంది. ఇదే అంశంపై శనివారం జరిగిన లాసెట్, పీజీ లాసెట్ కమిటీ సమావేశాల్లో 15 నిమిషాల నిబంధనను అమలు చేస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయనే అభిప్రాయం వ్యక్తమైన నేపథ్యంలో.. దీనిపై పూర్తిస్థాయిలో చర్చించిన అనంతరం 15 నిమిషాల నిబంధనపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే జాతీయస్థాయిలో నిర్వహించే జెఇఇ, నీట్, సివిల్స్ వంటి వాటిలో అమలు చేయడమే కాకుండా టీజీపీఎస్సీ కూడా అమలు చేస్తున్న నేపథ్యంలో తాము కూడా అమలు చేయాలని.. అలా అమలు చేస్తే ప్రస్తుతం నిమిషం నిబంధనతో విద్యార్థుల ఇబ్బందులు తప్పడమే కాకుండా అభ్యర్థులు త్వరగా పరీక్షా కేంద్రాలకు చేరుకునే వీలుంటుందనే అభిప్రాయం వ్యక్తం అయినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో న్యాయ పరమైన చిక్కులు రాకుండా నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. నోటిఫికేషన్లు ఈ నెల 20 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో అప్పటిలోగా ఉన్నత విద్యా మండలి 15 నిమిషాల నిబంధనపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# తెలంగాణలో తొలి 'జిబిఎస్' మరణం

## సిద్దిపేట జిల్లాకు చెందిన 25 యేళ్ల వివాహిత మృతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి9:** ప్రస్తుతం దేశంలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు జిబిఎస్ (గులియన్ బారీ సింద్రోమ్). ఇది ఒక నరాలవ్యాధి. దీన్ని మొదటగా మహారాష్ట్రలో గుర్తించారు. ఈ వ్యాధితో తెలంగాణలో తొలి మరణంసంభవించింది. ఆసుపత్రిలో చికిత్స తీసు కుంటూ సిద్దిపేటకు చెందిన ఓవివాహిత మృతిచెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, సిద్దిపేట జిల్లా సిద్దిపేట గ్రామీణ మండలం సీతారాంపల్లికి చెందిన వివాహిత (25)కు ఐదేళ్లలోపు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమెకు ఇటీవల కుమార్తె జన్మించింది. కుమార్తె జన్మించిన తర్వాత నెల రోజుల కిందట నరాల నొప్పులతో మహిళ అనారోగ్యం బారిన పడింది. దీంతో కుటుంబ సభ్యులు సిద్దిపేట, హైదరాబాద్‌లోని నిమ్స్, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించారు. ఆమె వైద్యానికి రూ.లక్షలు వెచ్చించినా ఫలితంలేకుండా పోయింది. చివరికి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె ప్రాణాలు కోల్పోయారు. మహారాష్ట్రలోని పుణెలో జీబీఎస్ కారణంగా పలువురు మృతి చెందారు. ఇప్పటికే చాలా మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందు తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ వ్యాధితో మరణం సంభవించడం ఇదే మొదటిదని వైద్యులు తెలిపారు.



ఆదివారం బెంగళూరులోని హెచ్ఎఎల్‌ను సందర్శించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

# నేడు మహాకుంభమేళాలో రాష్ట్రపతి పుణ్యస్నానం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:** ఉత్తరప్రదేశ్ ప్రయాగరాజ్‌లో కొనసాగుతున్న కుంభమేళాకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరవుతున్నారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానమాచరించడంతోపాటు స్థానిక ఆలయాల్లోప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో కుంభమేళాలో భద్రతను మరింత కట్టుదిట్టంచేసారు. రాష్ట్రపతి సోమవారం ఉదయం 10 గంటలకు ప్రయాగరాజ్ చేరుకుంటారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ప్రార్థనలుచేస్తారు. అనంతరం బడే హనుమాన్ ఆలయం, పవిత్రమైన అక్షయవట్ వృక్షాన్ని సందర్శిస్తారు. కుంభమేళా ప్రదేశంలో ఏర్పాటుచేసిన డిజిటల్‌కుంభ్ అనుభవ్‌సెంటర్‌ను పరిశీలిస్తారని రాష్ట్రపతిభవన్ వర్గాలు తెలిపాయి. ద్రౌపదిముర్ము పర్యటన సమయంలో ఆమెవెంట యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉంటారని సిఎంఒ వెల్లడించింది. గతంలో భారత తొలిరాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్‌కూడా కుంభమేళాకు హాజరయి త్రివేణి సంగమంలో పవిత్రస్నానంచేసారు.

# కేజ్రీవాల్ వల్లే కూటమి డిస్టర్బ్ అయింది

## ఆప్ వ్యతిరేక ఓట్లు బిజెపి వైపు వెళ్లాయి

### ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై సిఎం రేవంత్‌రెడ్డి స్పందన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి9:** ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పందించారు. కేజ్రీవాల్ వల్లే కూటమి డిస్టర్బ్ అయ్యిందన్నారు. కేంద్రాన్ని ఎదుర్కోవడానికి కూటమి సమర్థవంతంగా పని చేసిందన్నారు. కేజ్రీవాల్ వల్లే ఇదంతా జరిగిందని ఆగ్రహించారు. ఆయన కారణంగా బిజెపి లాభపడిందని గుర్తు చేశారు. ఢిల్లీలో కేజ్రీవాల్ యాంటీ కేజ్రీవాల్ అనే విధంగా పోలింగ్ జరిగిందన్నారు. దీంతో ఆప్ వ్యతిరేక ఓట్లు బీజేపీ వైపు వెళ్లాయన్నారు. ఆదివారం కేరళ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి అక్కడ జరుగుతున్న మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్‌కు హాజరయ్యారు. ఢిల్లీ ఎన్నిక పూర్తిగా ఒక జాతీయ పార్టీ.. ఒక ప్రాంతీయ పార్టీ మధ్య కేంద్రీకృతమైంది. ఈ మధ్యకాలంలో ప్రజలు ప్రతిపక్షం.. అధికార పక్షం వైపే మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు. మూడో పార్టీకి అవకాశం ఇవ్వడం లేదు... తెలంగాణ, కానీ మరే రాష్ట్రమైనా చూసుకోండి రెండు పార్టీల మధ్యనే పోరు నడుస్తోందని తెలిపారు. గతంలో ఎన్నికల్లో ఎక్కువ పార్టీలకు ప్రజలు అవకాశం ఇచ్చేవారు... ఇప్పుడు ప్రజలు తమ ఓటు వృథా కావద్దనుకుంటున్నారని పేర్కొన్నారు.

అందుకే ఎన్నికల పోరు రెండు పార్టీల మధ్య కేంద్రీకృతమవుతోందని వివరించారు. ఢిల్లీలో కేజ్రీవాల్.. కేజ్రీవాల్ వ్యతిరేకత... హర్యానా బీజేపీ వర్సెస్ కాంగ్రెస్..ఇండియా కూటమిలోని ప్రతి పార్టీ అన్నీ తమకే కావాలని కోరుకుంటున్నాయి. అదే పెద్ద సమస్య అన్నారు. హర్యాణాలో ఆప్ వల్ల కాంగ్రెస్ ఓడిపోయిందని, ఢిల్లీలో కాంగ్రెస్ అదే పని చేయడం వల్ల ఆప్ ఓడిపోయిందని, ఈ మొత్తం వ్యవహారంలో చివరికి లబ్ది పొందుతోంది మాత్రం బిజెపీనే అని పేర్కొన్నారు. అందుకే అంతా కలిసివచ్చి ప్లాన్ ప్రకారం ముందుకెళ్తే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు.. తెలంగాణలో కూడా అదే పరిస్థితి.. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నిలిచిందన్నారు. నరేంద్ర మోదీ అనేక సభల్లో ప్రచారం చేసినా తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో బీజేపీకి 13 శాతం ఓట్లే వచ్చాయి... అంతకుముందు జరిగిన ఉప ఎన్నికల్లో వాళ్లు రెండు సీట్లు గెలిచారని, అప్పుడు బీజేపీ గెలిచిన సీటులో మేం డిపాజిట్టు కోల్పోయామన్నారు. మాకు కేవలం 1.4 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. కానీ సాధారణ ఎన్నికల్లో మాకు 40 శాతం ఓట్లు వచ్చాయి.. దీని బట్టి ప్రజల తీర్పు స్పష్టం.. కొత్తగా వచ్చిన ఈ మార్పును మనం గమనించాలి. వాళ్ల తీర్పును అర్థం చేసుకోవాలని చెప్పారు.

# రీసర్వే చేయించండి

>> డాంటే అన్నట్టుగా రేవంత్ ప్రభుత్వం బిఆర్ఎస్‌ను విమర్శిస్తుందని, కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన సమగ్ర సర్వేను అందులోని బిసి జనాభాను తప్పుపడుతూ ప్రభుత్వ పెద్దలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బిసి డిక్లరేషన్ పేరిట కామారెడ్డి సభలో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున వాగ్దానాలు చేసింది. 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పింది. బిసిలకు లక్ష కోట్ల బడ్జెట్ పెడతామని బిసి సబ్ ప్లాన్ తీసుకొస్తామని సిద్ధరామయ్య నోటి వెంట కాంగ్రెస్ పార్టీ చెప్పించిందన్నారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ప్రోక్యూర్మెంట్లలో 42 బిసిలకే ఇస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పిందని, కానీ సంవత్సరం గడిచిన 15 పైసలు కూడా బిసి డిక్లరేషన్ కోసం ప్రభుత్వం కేటాయించలేదన్నారు. కొత్తగా బిసి కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని, ఒక్కో కార్పొరేషన్ రూ.50 కోట్ల బడ్జెట్ ఇస్తామని చెప్పి 50 పైసలు కూడా ఇవ్వలేదన్నారు. ఐదున్నర శాతం జనాభా తగ్గించి దాదాపు 22 లక్షల మందిని లేనట్టుగా చిత్రీకరించిన దుర్మార్గాన్ని రేవంత్ రెడ్డి చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన అశాస్త్రీయం అసంబద్ధమని, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీనే కులగణన సర్వేను చిత్తుకాగితంతో సమానమని కాలబెట్టిండని గుర్తు చేశారు. 'మళ్లీ రీసర్వే చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఈసారి కులగణలో మేమంతా పాల్గొంటాం. కోరిన వివరణ వివరాలు ఇస్తాము. రీసర్వేకు వెంటనే ఆదేశించాలి' అని పేర్కొన్నారు. 42 రిజర్వేషన్లు ఇస్తామన్న మాటను రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలి. దీనిపై మొన్నటి అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు తీసుకొస్తారని భావించాము. కానీ బిల్లు తేలేదు సొల్లు మాత్రం చెప్పారని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ మాత్రమే 50 శాతానికి పైగానే బిసిలకు పార్టీ పరంగా అసెంబ్లీ పార్లమెంటు స్థానిక ఎన్నికల్లో టికెట్లు ఇచ్చింది అత్యధిక సీట్లు కేటాయించిందన్నారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో ఆరు స్థానాల్లో బిసిలకు టికెట్లు ఇచ్చిందని, శాసనసభ ఎన్నికల్లో 34 సీట్లు బీసీలకు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ మాట తప్పింది..

కేవలం 19 సీట్లు మాత్రమే ఇచ్చారు అందులో పాతబస్తీలో ఐదు సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. టిఆర్ఎస్ మాత్రం చెప్పకుండానే బలైహీన వర్గాలకు 34 సీట్లు ఇచ్చింది. మాకు ఎవరి సర్టిఫికెట్లు అవసరం లేదన్నారు. బిసిల ఆందోళన ఆవేదనను మేము అర్థం చేసుకున్నాం. సిఎం రేవంత్‌రెడ్డి బిసిలను క్షమాపణ అడగాలని డిమాండ్ చేశారు. బిసిలకు జరుగుతున్న అన్యాయంపై సోమవారం నుంచి నియోజకవర్గాల వారీగా మండలాల వారీగా జిల్లా కేంద్రాల వారిగా భావజాల వ్యాప్తిని ప్రారంభిస్తాం.

ప్రజలను జాగృతం చేస్తామని చెప్పారు. ఒకవేళ ప్రభుత్వం మొండి వైఖరితోనే ఉంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా వారి గొంతు కోసి స్థానిక సంస్థల ఎన్నికలకు పోతే ఏం చేయాలన్న దానిపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించామన్నారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాన్ని కచ్చితంగా ఎండగడతామని పేర్కొన్నారు. మోడీ, రాహుల్ గాంధీ ఇద్దరు కూర్చునీ చాయ్ తాగే లోపు రాజ్యాంగ సవరణ జరుగుతుంది. ఇందిరాగాంధీ జమానాల్లో ముల్కీ రూల్స్ ను రద్దు చేస్తూ రాజ్యాంగ సవరణ చేయలేదా? బిసిలకు న్యాయం చేయడానికి రాజ్యాంగ సవరణ ఎందుకు చేస్తలేరని ప్రశ్నించారు.

# మహిళ మృతదేహానికి వైద్యం

# ఘటనపై సర్కార్ సీరియస్

## విచారణకు ఆదేశించిన వైద్య, ఆరోగ్య మంత్రి దామోదర రాజనరసింహా

**హైదరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రైవేటు ఆసుపత్రుల ఆగడాలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయి. చికిత్స కోసం హాస్పిటల్‌కి వచ్చే రోగులను వివిధ టెస్ట్‌ల పేరుతో దోచుకుంటున్న ఆసుపత్రులు ఈ మధ్యకాలంలో చనిపోయిన శవాలకు సైతం చికిత్స అందిస్తున్నాయి. సినిమాల్లో చూసినట్టుగానే బయట ప్రైవేటు ఆసుపత్రుల్లో జరుగుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. అందులో భాగంగానే హైదరాబాద్‌లోని మియాపూర్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో రెండు రోజులపాటు మహిళా మృతదేహానికి ఆసుపత్రి వైద్యులు చికిత్స చేశారు. ఇది కాస్త మీడియాలో రావడంతో.. వైరల్‌గా మారింది. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయింది. మియాపూర్ మదీనగూడలోని సిద్దార్థ్ న్యూరో ఆసుపత్రిలో మహిళ మృతదేహానికి రెండు రోజులు వైద్యం అందించిన ఘటనపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా అగ్రహం వ్యక్తం చేశారు. జరిగిన ఘటనపై మంత్రి ఆదివారం విచారణకు అదేశించారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరవృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. మదీనాగూడలోని ఆసుపత్రి ఘటనపై ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా నివేదికను సమర్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

# మోడీ రహస్య అజెండా

>>హైదరాబాద్ కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ అనే మూడు జోన్లుగా విభజించినట్లు తెలిపిన సిఎం.. 160 కిలోమీటర్ల పొడవైన అవుటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలోని కోర్ అర్బన్ ఏరియాలో 1.2 కోట్ల ప్రజలు నివసిస్తున్నారు. ఈ ప్రాంతం సాఫ్ట్ వేర్, ఫార్మా రంగాలకు కేంద్రంగా ఉందని వెల్లడించారు. చార్మినార్, హైదరాబాద్ బిర్యానీ, ముత్యాలకు హైదరాబాద్ ప్రసిద్ధి చెందిందని అక్కడి కార్యక్రమానికి హాజరైన వారికి తెలిపారు. ఓఆర్ఆర్ పరిధిలోని ఈ కోర్ అర్బన్ ఏరియాను సర్వీస్ సెక్టార్స్‌తో 100 శాతం నెట్ జీరోగా మార్పు చేయాలనే ప్రభుత్వ ప్రణాళికల్ని వెల్లడించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. దేశంలోని ముంబయి, ఢిల్లీ, బెంగళూర్, చెన్నై వంటి నగరాలతోనే కాకుండా ప్రపంచంలోని ముఖ్య నగరాలైన న్యూయార్క్, లండన్, సింగపూర్, టోక్యో, సియోల్‌వంటి నగరాలతో పోటీపడేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నామని, ఇది పూర్తి హరిత, పరిశుభ్రమైన, అత్యుత్తమమైన నగరంగా ఉండనుందని వెల్లడించారు. ప్రపంచంలోని మరే నగరంతో పోల్చుకున్నా ఇది సరైన ప్రణాళిక, జోన్లు ఉన్న నగరంగా ఉండనుందని తెలిపారు. అలాగే ఇది మొట్టమొదటి నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఫ్యూచర్ సిటీలో తి। సిటీని నిర్మిస్తున్నట్లు, యువత కోసం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో రూ.1,82,000+ కోట్లకు పైగా పెట్టుబడులను తెలంగాణకు తీసుకు వచ్చినట్లు సీఎంతెలిపారు. గతేడాది రూ.40 వేల పెట్టుబడులు వచ్చినట్లు తెలిపారు. అదే గత ప్రభుత్వంలోని బీఆర్ఎస్ పదేళ్ల పాలనా కాలంలో రూ.25వేల కోట్ల పెట్టుబడులను కూడా సాధించలేకపో యిందని విమర్శించారు. హైదరాబాద్ పర్యావరణ సుస్థిరతకుగానూ మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. గోదావరి నీటిని మూసీలో కలపడం ద్వారా త్రివేణి సంగమంగా మార్చనున్నట్లు తెలిపారు. అక్కడే 200 ఎకరాల్లో గాంధీ సరోవర్‌ను నిర్మించే ప్రణాళికల్ని వివరించారు. దక్షిణాది రాష్ట్రాల్లో తీర ప్రాంతం లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వెల్లడించారు. పోర్టు అవసరాలు తీర్చేందుకు డ్రైపోర్ట్ నిర్మించనున్నట్లు తెలిపారు. దానిని ఆంధ్రప్రదేశ్‌లోని సీ పోర్ట్ (సముద్ర రేవు)కు ప్రత్యేక రైలు, రోడ్డు మార్గం ద్వారా కలుపనున్నట్లు వెల్లడించారు.

తాము రీజినల్ రింగు రోడ్డును, రీజినల్ రింగు రైల్వే లైను నిర్మించబోతున్నాం...ఈ రెండింటిని రేడియల్ రోడ్ల ద్వారా కలపనున్నామని తెలిపారు. ఇటీవల ఎనర్జీ పాలసీని విడుదల చేశాం. ఈవీలపై ఉన్న అన్ని పన్నులను తొలగించాం. ఈవీల అమ్మకాల్లో దేశంలోనే తెలంగాణ తొలి స్థానంలో ఉంది. రాష్ట్రంలోని 3 వేల ఆర్టీసీ బస్సులను దశలవారీగా ఈవీలుగా మార్చనున్నట్లు తెలిపారు. ఓఆర్ఆర్ఆర్ఆర్ మధ్య ఉన్న సెమీ అర్బన్ ఏరియాను ఉత్పత్తి (మాన్యుఫ్యాక్చరింగ్) జోన్‌గా మార్చబోతున్నాం. ఇది చైనా+1 అనే మా వ్యూహానికి ప్రపంచానికి సమాధానంగా నిలవనుందన్నారు. ఔషధాలు, విత్తనాల ఉత్పత్తిలో తెలంగాణ ముందువరుసలో ఉంది. వాటికి అదనంగా ఎఫ్ఎంసీజీ, రక్షణ, రాకెట్స్, స్పేస్, ఎలక్ట్రిక్ వాహనాలు, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో ముందు వరుసలో నిలుస్తామన్నారు. భారతదేశానికి డాటా సెంటర్ హబ్ గా, పంప్ స్టోరేజీ హబ్‌గా తెలంగాణ నిలవనుందన్నారు. దేశంలోని ఉత్తర, దక్షిణ, తూర్పు, పడమర దిక్కులకు అనుసంధానమై, దక్షిణాది రాష్ట్రాలకు ముఖ ద్వారంగా ఉన్న తెలంగాణ దేశానికి లాజిస్టిక్ సెంటర్‌గా ఉండాలని మేం ఆకాంక్షిస్తున్నామన్నారు. రైతులకు ఎకరాకు రూ.12 వేలు రైతుభరోసా ఇస్తున్నాం.. భూమి లేని కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తున్నాం. పంటలకు కనీస మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. దేశంలోనే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణ మాఫీ చేశామన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీలో రూ.10 లక్షల మేర హెల్త్ కవరేజీ ఇస్తున్నామని, అన్ని గురుకులాల్లో మెస్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలను రెట్టింపు చేశామని, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామన్నారు. విద్యా, నైపుణ్యాలే తమ ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యమన్న ముఖ్యమంత్రి తగ్గట్టుగానే స్కిల్ యూనివర్సిటీ దిశగా అడుగులేస్తున్నామని తెలిపారు.

తెలంగాణలో మహిళలందరికీ ఉచితబస్సు ప్రయాణ సదుపాయం కల్పించామని, అక్కాచెల్లెళ్లు ఇప్పటికే కోట్లాది బస్సు ప్రయాణాలు ఉచితంగా చేశారు, ఎంతో డబ్బును ఆదా చేసుకున్నారని పేర్కొన్నారు. అక్కా చెల్లెళ్లకు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం. ఇళ్లకు 200 యూనిట్లులోపు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షల ఇస్తున్నాం. ప్రతి సంవత్సరం నాలుగు లక్షల ఇళ్లు నిర్మించనున్నాం. 20 లక్షల పేద కుటుంబాలు సొంతఇళ్ల కల నెరవేరుతుందని తెలిపారు. సమగ్ర కులసర్వే చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ.. దానిని అసెంబ్లీలోనూ ప్రవేశపెట్టాం. జనాభా దామాషా ప్రాతిపదికన మేం వనరులు సమకూర్చుతామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన తర్వాత వర్గీకరణ చేపట్టాలని మేం 2024, ఫిబ్రవరి 4న నిర్ణయం తీసుకున్నామని, 2025, ఫిబ్రవరి 4న ప్రత్యేక శాసనసభ సమావేశం ఏర్పాటు చేసి దాని అమలుకు తీర్మానం చేశామని, ఫిబ్రవరి 4వ తేదీని ఇకనుంచి తెలంగాణ సామాజికన్యాయ దినోత్సవంగా జరుపుకోనున్నామని తెలిపారు. ఇంత అభివృద్ధి సాధిస్తున్న తెలంగాణకు కేంద్ర సహకారం ఉండాలా వద్దా అని రేవంత్ ప్రశ్నించారు.

# డోజ్ వ్యవస్థకు అమెరికా కోర్టులు షాక్‌లు!

## ట్రెజరీ పత్రాలు ఇచ్చేవీలులేదని ఇంజక్షన్ ఉత్తర్వులు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 9:** అధికార బాధ్యతలుచేపట్టినప్పటినుంచి అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌కు వివాదాలే ఎదురవుతున్నాయి. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలను ఫెడరల్‌కోర్టులు నిలిపివేస్తున్నాయి. యుఎస్ఎయిడ్ సంస్థ ఉద్యోగుల ఉద్వాసనను వెంటనే నిలిపివేయాలని జిల్లాకోర్టు ఒకటి ఆదేశాలు జారీచేస్తే ఇపుడు మరో కోర్టు ఎలాన్ మస్క్ ఆధ్వర్యంలోని డోజ్ విభాగం అమెరికా ట్రెజరీ విభాగం రికార్డులు కోరడాన్ని వ్యతిరేకిస్తూ స్తంభింపచేసింది. డిపార్టుమెంట్ ఆఫ్ గవర్నరమెంట్ ఎఫిషియన్సీ (డోజ్)కు ఎలాన్‌మస్క్ ఛీఫ్‌గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. వ్యయనియంత్రణ వృధా ఖర్చును తగ్గించడం వంటి వాటిపై పనిచేసే డోజ్ తాజాగా అమెరికా ట్రెజరీ శాఖ రికార్డులు కావాలనికోరింది. అయితే అందుకు ట్రెజరీ అధికారులు వ్యతిరేకించారు సామాజిక భద్రత డేటా, మిలియన్లకొద్దీ అమెరికన్ల బ్యాంకు ఖాతాల నంబర్లు ఉంటాయని రహస్య పత్రాలను ఒక ప్రభుత్వపరిధిలోకి రాని సంస్థకు ఇవ్వడం వీలుకాదని వ్యతిరేకించాయి.

దీనిపై అమెరికా కోర్టులో కూడా పిటిషన్ దాఖలుచేయడంతో అమెరికా జిల్లాకోర్టు జడ్జి పాల్ ఎ ఎంజెల్‌మేయర్ ప్రాథమిక ఇంజక్షన్ ఉత్తర్వులు జారీచేసారు. 19 మంది డెమొక్రటిక్ అటార్నీ జనరల్స్ అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌పై వ్యాజ్యం దాఖలుచేయడంతో కోర్టు ఈపిటిషన్‌ను విచారించి డోజ్ ఉత్తర్వులపై నిలిపివేత ఉత్తర్వులు జారీచేసారు. ట్రంప్ యంత్రాంగం అత్యంత కీలకమైన ఆర్థికశాఖ డాక్యుమెంట్లను కోరుతున్నదని డోజ్ సంస్తను కట్టడిచేసేవిధంగా ఉత్త ర్వులు జారీచేయాలనికోరుతూ న్యూయార్క్ సిటీ కోర్టులో పిటిషన్ దాఖలుచేస్తూ ఫెడరల్ న్యాయసూత్రాలకు విరుద్ధం అని పేర్కొన్నారు. ట్రెజరీ శాఖ చెల్లింపుల వ్యవస్థ పన్ను రీఫండ్‌లు, సామాజిక భద్రత ప్రయోజనాలు, వెటరన్స్ బెనిఫిట్స్ మరిన్ని ఇతర కీలక విభాగాలు ఉంటాయని ప్రతి ఏటా లక్షలకోట్ల డాలర్లు చెల్లింపులు జరుపుతోందని, ఈ విభాగంలో అమెరికన్ల వ్యక్తిగత ఆర్థికడేటా మొత్తం ఉంటుందని వాదించారు.

జడ్జి ఎంజెల్‌మేయర్‌ను గత అధ్యక్షుడు బరాక్ ఒబామా హయాంలో నియమితులయ్యారు. ఆయన తన ఉత్తర్వుల్లో ఎవరైనా ట్రెజరీ శాఖ డాక్యుమెంట్లను యాక్సెస్‌చేసునేందుకు ప్రయత్నించినా, చోరీజరిగినట్లు అనుమానం ఉన్నా వెంటనే ట్రెజరీ డిపార్టుమెంట్ సిస్టమ్స్‌నుంచి డౌన్‌లోడ్‌చేసిన కాపీలన్నింటినీ ధ్వంసంచేయాలని ఆదేశించారు. తదుపరి ఈ పిటిషన్‌ను 14వ తేదీకి వాయిదావేసారు.

## వారం - వర్జ్యం

తేది : 10-02-2025, సోమవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
త్రయోదశి సా.6.58
పునర్వసు సా.6.00
వర్జ్యం : రా.2.11-3.49
దు.ము.12.53-1.39, 2) మ.3.11-3.57
శుభసమయం : ఉ.6.30-7.30,
సా.6.00-7.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** కుటుంబ సమస్యలు వేధిస్తాయి. సన్నిహితుల నుండి సాయం అందిస్తారు.

**వృషభం :** ఉద్యోగ యత్నాలు అనుకూలిస్తాయి. ఆకస్మిక ధనలాభం పొందుతారు.

**మిథునం:** కొత్త మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. దైవదర్శనాలు చేసుకొంటారు.

**కర్కాటకం :** ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. వ్యాపారాలలో పురోగతి సాధిస్తారు.

**సింహం:** కొత్త విద్యావకాశాలు పొందుతారు. బంధువుల నుండి ఆహ్వానాలు అందుకొంటారు.

**కన్య :** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. దైవ దర్శనాలు పెరుగుతుంది.

**తుల :** కుటుంబ సమస్యలు తీరి ఊరట చెందుతారు. అనారోగ్యం, వాహనసౌఖ్యం.

**వృశ్చికం:** గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. వస్తు, వస్త్ర కొనుగోలు.

**ధనుస్సు:** పనులు ముందుకు సాగవు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం. ఔషధ సేవనం.

**మకరం:** కీలక నిర్ణయాలలో తొందర పాటుల వద్దు. ధనవ్యయం పెరుగుతుంది.

**కుంభం:** ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. వస్తు లాభం.

**మీనం :** బంధువులతో ఏర్పడిన తగాదాలు పరిష్కరించుకొంటారు. ప్రయాణాలలో లాభాలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## పారిశ్రామికవేత్త జనార్దనరావు

# దారుణ హత్య

### తాతను 73సార్లు

### కత్తితో పొడిచిన మనవడు!

### ఆస్తి తగాదాలే కారణం


విసి జనార్ధనరావు


కీర్తితేజ

**హైదరాబాద్ (పంజాగుట్ట) ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** ఆస్తి తగాదాల నేపథ్యంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త వెల్జాన్ గ్రూపు సంస్థల అధినేత వెలమాటి చంద్రశేఖర(వీసీ) జనార్ధన రావు (86)తన మనవడి చేతిలో దారుణ హత్యకు గురయ్యారు. నగరంలోని సోమాజీగూడాలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ దారుణానికి పాల్పడిన నిందితుడిని పంజాగుట్ట పోలీసులు అరెస్ట్ చేసారు. పంజాగుట్ట పోలీసుల కథనం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు ప్రాంతానికి చెందిన జనార్ధన్‌రావు కొన్నేళ్లుగా సోమాజీగూడాలో నివాసం ఉంటు న్నారు. ఇటీవల తన పెద్దకుమార్తె కుమారుడైన శ్రీకృష్ణను వెల్జాన్ కంపెనీకి డైరక్టర్‌గా నియమించారు. మరో కుమార్తె సరోజీనీదేవి కుమారుడైన కిలారు కీర్తితేజ (29)పేరిట రూ 4 కోట్ల షేర్లను బదలీ చేసారు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా ఆస్తుల కోసం గొడవలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి సరోజీనీదేవి తన కుమారుడైన కీర్తితేజతో కలిసి తండ్రి ఇంటికి వచ్చారు. ఆస్తి పంపకాల విషయంలో తాతతో కీర్తితేజ వాగ్వివాదానికి దిగాడు. తండ్రికి టీ తెచ్చేందుకు సరోజనీదేవి ఇంట్లోకి వెళ్లింది. ఇదే అదునుగా భావించిన కీర్తితేజ తన వెంట తెచ్చుకున్న కత్తితో 73 సార్లు తాత వి.సి.జనార్ధనరావును పొడిచాడు. అరుపులు, కేకలు విన్న సరోజనీదేవి పరుగున వచ్చి కుమారుడిని వారించబోయారు. ఆమెపైనా దాడిచేసి కత్తితో నాలుగు చోట్ల పొడిచాడు. అక్కడే ఉన్న వాచ్‌మన్ వీరబాబు వచ్చేందుకు ప్రయత్నించగా దగ్గరకు రావొ ద్దంటూ కీర్తితేజ అతన్ని వారించాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం నిందితుడిని పంజాగుట్టలో అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు.సరోజనీదేవి జుబ్లీ హిల్స్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. జనార్ధనరావు మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి అనంతరం ఏలూరుకు తరలించారు. పోలీసులు కీర్తితేజ డ్రగ్స్‌కు బానిసయ్యాడనే అనుమానాలను వ్యక్తం చేసారు. జనార్ధనరావు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి పలు దఫాలుగా రూ 40కోట్లు, తిరుమల తిరుపతి దేవస్థానానికి రూ. 40 కోట్ల విరాళాలు ఇచ్చారు. తెలుగు రాష్ట్రాల్లోని పలు స్వచ్ఛంద సంస్థలకు కూడా వి.సి.జనార్ధనరావు విరాళాలు అందజేసారు.

# తెలంగాణకు ఢిల్లీ ఎన్నికలే స్ఫూర్తి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

### ఢిల్లీ ఎన్నికల్లో విజయం..

### నగరంలో బిజెపి సంబురాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** తెలంగాణలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు ఢిల్లీ ఎన్నికలు స్ఫూర్తి నిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి సంచలన విజయం సాధించిన నేపథ్యంలో బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్‌తో పాటు బిజెపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సంబరాల సందర్భంగా కిషన్ రెడ్డి ప్రత్యేక ట్వీట్ చేస్తూ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలను షేర్ చేశారు. 2025 అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీ పీఠాన్ని బిజెపి కైవసం చేసుకున్న సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంబరాల్లో ఎంపి డా.లక్ష్మణ్‌తో పాటు సీనియర్ బిజెపి నేతలు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నానని తెలిపారు. అలాగే ఈ విజయం ప్రధాని నరేంద్ర మోడీ నీతివంతమైన పాలనకు నిదర్శనమన్నారు. ఇక ఈ విజయం తెలం గాణలో జరగ నున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు స్ఫూర్తినింపుతుందని అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాటా ్లడుతూ ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ 27 సంవత్సరాల తర్వాత తమ ముఖ్యమంత్రి



రాబోతు న్నారని అన్నారు. నరేంద్రమోడీ నాయకత్వంలో నీతివంతమైన పాలనతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంతో ఢిల్లీలో డబుల్ ఇంజిన్ సర్కారు వచ్చిందని అన్నారు.దేశంలో ఎక్కడైతే డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్నదో ఆ రాష్రంలో అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఏపీ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్‌లో డబుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి జరుగుతోంది.ఢిల్లీలో భవిష్యత్తులో అభివృద్ధి చేయించి చూపిస్తాం అన్నారు. అదేవిధంగా తెలంగాణలో కూడా డబుల్ ఇంజిన్ సర్కారు రావాల్సిన ఆవశ్యకత ఉంది. అందుకోసం ముందు ెకళ్తామని ఆ దిశగా కృషి చేస్తామని అన్నారు.

## పోలీసుల అదుపులో స్టంట్ మాస్టర్లు?

## ఓఆర్ఆర్‌పై అర్ధరాత్రివేళ కార్లతో యువకుల అడ్డగోలు విన్యాసాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో బైక్ స్టంట్ల గురించి అందరికి తెలిసిందే. ట్రాఫిక్ రద్దీ లేని రహదారులతో పాటు కొన్నిసార్లు వాహనాలు ఎక్కు వగా వున్న రోడ్లపైనా కొందరు యువకులు బైక్‌లతో సినిమాలకు మించిన



స్టంట్లను చేస్తుండడం విదితమే. ఈ క్రమంలో పలువురు యువకులు అనేకసార్లు అరెస్టయినా ఈ స్టంట్లు మాత్రం ఇప్పటికీ అక్కడక్కడా వెలుగు చూస్తూనే వున్నాయి. నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ మార్గ్, రేతిబౌలి, ఆరాంఘర్ మార్గం, ఉప్పల్ నుంచి చాంద్రాయణగుట్ట మార్గంలో ఇప్పటికీ తరచూ కుర్రకారు ప్రమాదకరమైన స్టంట్లు చేస్తూ సాటి వాహనదారులను ప్రమాదలో నెడుతుంటారు. బైక్ స్టంట్ల విషయం అలావుంచితే ఏడాది క్రి తం పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట ప్రాంతంలో అర్ధరాత్రి వేళ ఆటోల స్టంట్లు పోలీసులను షాక్‌కు గురిచేశాయి. కొందరు ఆటో డ్రైవర్లు ప్రధాన రహదారిపై అర్ధరాత్రి వేళ ఆటోలను బైక్‌ల స్థాయిలో ముందరి టైర్లను పైకి లేచేలా చేసి నడపడం, వెనుక భాగంలోని రెండు టైర్లలో ఒక దానిని పైకి లేచేలా చేయడం, వేగంగా వెళ్లడం సో షల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. దీంతో పోలీసులకు ఒళ్లు మండి స్టంట్లకు పాల్పడ్డ ఆటో డ్రైవర్లను అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు. ఆటోలను జప్తు చేశారు. బైక్ స్టంట్లను చూసిన ప్రజలు ఆటో స్టంట్లను చూడడం అదే తొలిసారి. బైక్ స్టంట్ల కారణంగా, బైక్ రేసింగ్ కారణంగా అనేక మంది యువకులు ఒట్టి పుణ్యానికి ప్రాణా లు కోల్పోయారు. ఇందులో సెలబ్రిటీల పిల్లలు కూడా వుండడం విశేషం. ఓఆర్ఆర్ నిర్మాణంలో వున్న సమయంలో క్రికెటర్ అజారుద్దీన్ కుమారుడు గచ్చిబౌలి వద్ద బైక్ రేసింగ్ చేస్తూ ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. తాజాగా ముగ్గురు మైనర్ బాలురు కొత్తగా ప్రారంభమైన జూ పార్క్...ఆరాంఘర్ ఫ్లై ఓవర్‌పై వేగంగా వెళుతూ డివైడర్‌ను ఢీకొని చనిపోయారు. వీటి విషయం ఇలావుంటే తాజాగా అవుటర్ రింగు రోడ్డుపై శంషాబాద్ ప్రాంతంలో కొందరు యువకులు రెండు కార్లపై ఇష్ట ం వచ్చినట్లు స్టంట్లు చేయడం సంచలనం రేపింది. ఓఆర్ఆర్‌పై 24 గంటల పాటు వాహనాల రద్దీ వుండడం తెలిసిందే. తూర్పు, దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వాహ నాలు ఉత్తర, పశ్చిమాది రాష్ట్రాలకు వెళ్లేందుకు ఓఆర్ఆర్ కీలకంగా వుండడం తెలిసిందే. ఈ క్రమంలోనే ఓఆర్ఆర్‌పై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతటి రద్దీ వుండే ఓఆర్ఆర్‌పై కొందరు యువకులు కార్లను గింగిరాలు తిప్పుతూ లైట్లను వెలిగించి సాటి వాహనదారులకు ఇబ్బందులు కలిగించారు. ఈ దృశ్యాలు అక్కడి సిసి కెమెరాల్లో నమోదవగా ఈ కార్ల వెనకాల వచ్చిన ఇంకొందరు వాహనదారులు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పెట్టారు. ఇదికా స్త వైరల్‌గా మారింది. దీంతో కార్ల స్టంట్ల వ్యవహారాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణించారు. సిసి కెమెరాలలో నమోదైన దృశ్యాల ఆధారంగా వాహనాల నంబర్లను కనుగొని కొందరు యువకులను అదుపులోకి తీసుకున్నారని సమా చారం. వీరిని విచారిస్తున్నారని తెలిసింది. కాగా ఓఆర్ఆర్‌పై కార్ల స్టంట్లు ఇదే తొలిసారిగా చెప్పాలి.

## స్థానిక ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి : ఆర్.కృష్ణయ్య

### బిసిలను అణచివేసే తప్పుడు గణాంకాలు అంగీకరించం

### బిసి మేధావుల చర్చావేదికలో బిసి సంఘాలు, అఖిలపక్ష నేతలు, మేధావులు వెల్లడి

**హైదరాబాద్ (నాంపల్లి), ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వానికి నిబద్ధత ఉంటే శాసనసభలో బిసిలకు 42శాతం రిజర్వేషన్లకు బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బిసిలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే కాంగ్రెస్ అభ్యర్థులను చిత్తుగా ఓడిస్తామన్నారు. రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని పట్టుకొని తిరిగితే ప్రయోజనం శూన్యమని,


చర్చావేదికలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జసత్యం, చిరంజీవులు, వకుళాభరణం, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

తెలంగాణలో బిసిలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందేనన్నారు. సర్వేలో రాష్ట్రం బిసిల జనాభాను తగ్గించి ఆ లెక్కలే వాస్తమని నమ్మజూపడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. బిసి రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తూనే రాజకీయ అధికారమే లక్ష్యంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన సర్వేలో బిసిలను అణచివేసే తప్పుడు గణాంకాలు తాము ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించం, సమగ్ర సమీక్ష జరపాల్సిందేనని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత సాధించడమే లక్ష్యంగా ఆదివారం లకిడీకాపూల్‌లోని ఒక వేదికలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన జరిగిన బిసి మేధావుల చర్చావేదికలో గుజ్జసత్యం అధ్యక్షోపన్యాసంలోనేకాక బిసి ఇంటలెక్చువల్ ఫోరం ఛైర్మన్ చిరంజీవులు, మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర బిసి కమిషన్ మాజీ ఛైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఎంపిసి మాజీ ఛైర్మన్ తాండూరు శ్రీనివాస్, కన్వీనర్ గుజ్జకృష్ణ, అన్ని బిసి సంఘాలు, అకిలపక్ష నేతలు, మేధావులు స్పష్టం చేశారు.

గత సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బిసి జనాభా 52శాతంగా పేర్కొనగా, ప్రస్తుత కులగణనలో బిసిల జనాభా 46.25గా చూపించడమేమిటని ప్రశ్నించారు. బిసిల సంఖ్యను తక్కువగా చూపించి వారి రాజకీయ హక్కులను, విద్యా ఉద్యోగ రిజర్వేషన్లను దెబ్బతీసేందుకు ప్రభుత్వం కుట్రపన్నుతుందని ధ్వజమెత్తారు. ఈ సర్వే ఫలితాలను తక్షణమే సమీక్షించి పూర్తి పారదర్శకతతో సరైన గణాంకాలను వెల్లడించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్త బిసి ఉద్యమం తప్పదని హెచ్చరించారు. 50శాతం రిజర్వేషన్లు దాటడానికి రాజ్యాంగ ప్రక్రియ ఇప్పట్లో సాధ్యంకాదని సీఎం రేవంత్‌రెడ్డి చేతులు దులుపుకోవడం సామాజిక న్యాయస్ఫూర్తికి విరుద్ధమని వకుళాభరణం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కులసర్వేలో బిసిల జనాభాను తగ్గించినతీరును గణాంకాలతో చిరంజీవులు విశదీకరించారు. చివరిగా సత్యతెలంగాణ దినపత్రిక, డిజిటల్ చానల్‌ను ఆవిష్కరించారు.

ఈ చర్చావేదికలో సూర్యారావు, నీలవెంకటేష్, వేములరామకృష్ణ, లాల్‌కృష్ణ, అంజి, రామలింగం, రమాదేవి తదితరులతోపాటు 60బిసి, 40 బిసి సంఘాల నాయకులు, మహిళా విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, న్యాయవాదులు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ ఐక్యతను చాటుతూ అభివాదం చేశారు.

## తునికాకు సేకరణ పనులను తక్షణం చేపట్టాలి

### కార్మికుల ఉపాధి కోల్పోకుండా చూడాలి: సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 14 జిల్లాల్లోని గిరిజనులు, గిరిజ నేతర పేదలకు ఉపాధిని కల్పిస్తున్న తునికాకు సేకరణ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి ఆయా జిల్లాల్లోని కార్మికులు, గిరిజనులు ఉపాధి కోల్పోకుండా చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం జనవరి నాటికే టెండర్ల ప్రక్రియను అటవీ శాఖ పూర్తిచేస్తుందని... కానీ ఈ ఏడాది ఇప్పటికీ పూర్తి చేయకుండా తాత్సా రం చేసిందని విమర్శించారు. టెండర్ల పనులు ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో.. ఆదివాసీలు ఆందోళనలో ఉన్నారని.. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే టెండర్ల ప్రక్రియను ప్రారంభించి పూర్తి చేయాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 14 జిల్లాల్లో తునికాకు సేకరణను అటవీశాఖ చేపడు తుందన్నారు. సుమారు 10 లక్షల మంది దీనిపై ఆధారపడి లబ్ధి పొందు తున్నారని.. లోడింగ్, అన్‌లోడింగ్ తదితర పనులతో పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ప్రతి ఏటా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఫిబ్రవరిలో పూనింగ్ చేస్తారు.. ఫలితంగా ఎక్కువగా దిగుబడి వస్తుంది. కానీ ఈ ఏడాది ఆ పని సకాలంలో జరగలేద న్నారు. ఈ విషయంలో అటవీశాఖ స్పందిం చడంలో నిర్లక్ష్యం కన్పడుతోందని.. ఈ సీజన్‌ద్వారా వచ్చే ఆదాయంలో గిరిజనులు అనేక ఆర్థిక కార్య కలాపాలను, శుభకార్యాలను నిర్ణయిం చుకుంటారని జాన్ వెస్లీ గుర్తు చేశారు.

## యాసంగిలో 6.95 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న

**హైదరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రస్తుత యాసంగిలో మొక్కజొన్న సాగవైపు రైతులు దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ సీజనులో రాష్ట్ర వ్యాప్తంగా మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 5.89 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటి వరకూ 6.95 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. అదే గత యాసంగి సీజనులో ఇదే సమయానికి 5.38 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. గతంలో నాలుగు నుంచి ఐదున్నర లక్షల ఎకరాలు మించని ఈ పంట ఈసారి లక్ష ఎకరాలను దాటేస్తోంది.

సులువైన సాగు, తక్కువ పెట్టుబడి, కొంత మోతాదు వరకు నీటి వనరులు, అధిక పంట దిగుబడి, సర్కారు నుంచి గిట్టుబాటు ధర వంటి కారణాలతో రైతులు మొక్కజొన్న సాగుపై మక్కువ చూపుతున్నారు.

ఇతర పంటల సాగులో తెగుళ్ళ, కూలీ, ఇతర పెట్టుబడుల నిమిత్తం అయ్యే ఖర్చు ఎక్కువగా ఉంటుండగా, మొక్కజొన్న స్వల్ప వ్యయంతో మంచి ఫలితాలను సాధిస్తుండటంతో రైతులు దృష్టి ఈ సాగుపై పడింది.

# చిల్కూర్ బాలాజీ అర్చకుడిపై దాడి, నిందితుడి అరెస్టు

### రామరాజ్యం సంస్థ పేరిట వ్యక్తులు ఇంట్లోకి వెళ్లి దౌర్జన్యం

### ఉగాదిలోగా గుడిని, ఆర్థిక వనరులు, సైనికులను మాకు సమకూర్చాలంటూ బెదరింపులు

### న్యాయమూర్తుల తోలు తీయడానికి వచ్చాం

### మావోయిస్టులను తలిపించేలా వారి డ్రైస్‌కోడ్

### నేను రామునికి దాసుడిని, మీకు గుడిని అప్పగించలేను: అర్చకుడు రంగరాజన్ ఫిర్యాదు

**మొయినాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** తెలంగాణలో మరో తిరుపతిగా పేరొందిన చిల్కూర్ బాలాజి టెంపుల్ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై గుర్తు తెలియని వ్యక్తులు రామారాజ్యా స్ధాపన సంస్ద పేరుతో 20 మంది వచ్చి తాను ఇంట్లోకి వెల్లి దాడిచేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది, ప్రధాన అర్చకుడు రంగరాజన్ శుక్రవారం అతని ఇంటి పైకి వచ్చి రామరాజ్య స్ధాపన సంస్దకు విరాళాలు, సైనికులను తయారుచేసి మాకు ఇవ్వాలంటు, చిల్కూర్ గుడిని మాకు అప్పజెప్పాలంటు దాడికి పాల్పడినట్లు తెలిపారు, ఈ సంఘటన పై ఆదిరవారం ప్రధాన అర్చకుడు రంగరాజన్ మొయినాబాద్ పోలీసులను ఆశ్రహించారు, వివరాల్లోకి వెలితే ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు రామారాజ్య స్ధాపన సంస్ద నుండి వచ్చామని చెప్పి వీరరాఘవరెడ్డి తో పాటు 20 మంది ఒక్కే యూనిఫామ్ బ్లాక్ డ్రెస్‌తో మావోయిస్టులను తలపించేలా వారు ఉన్నారని వారంత రాముని భక్తులము మీతో మాట్లాడలని చెప్పడంతో ఏదైనా ప్రత్యేక పూజలు చేయాల్సిఉందేమని వారితో మాట్లాడుతూండగానే వారు నా పై దాడిచేసి మేము చెప్పింది నీవు వినాలంటు భెదిరించినట్లు తెలిపారు,దుండగుల్లో వీరరాఘవరెడ్డి అనే వ్యక్తి అర్చకుడు రంగరాజన్‌తో మాట్లాడుతూ మేము రామారాజ్యాన్ని స్ధాపించడానికి పూనుకున్నామని, దానికి నీవు మాకు సహకరించడం లేదని, నన్ను భెదిరిస్తుంటే నేను రాజ్యాంగం ప్రకారం న్యాయస్ధానాల ద్వార వెళ్తునందుకు వారు తప్పుబట్టి నా ఇంట్లోకి వచ్చి నాకు ఉగాది పండుగలోపు డెడ్‌లైన్ పెట్టారని, అప్పటిలోగా మాకు రామరాజ్య స్థాపన కోసం ఆర్ధిక వనరులను, సైనికులను తయారుచేసి, గుడిలో ఉన్న వారి అర్చకుల గోత్రాలు, ఆలయాన్ని అప్పజెప్పాలంటూ బెదరించినట్లు తెలిపారు, నేను చట్టాలను అనుసరించి రామారాజ్యం స్థాపనకు కృషిచేస్తున్నానని చెప్పినప్పటికి వారు న్యాయ వ్యవస్దలో ప్రధాన న్యాయముర్తులు దోంగలు వారి తోలు తీయడానికే మేము వచ్చామని, రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్దను ఎలా అనుసరిస్తావని వారి దెగ్గర బిక్షమోత్తుతావా అంటు ప్రశ్నలతో వేధించారు, మావోయిస్టులను తలపించేలా వారి డ్రైస్‌కోడ్ ఉందని, వారిని చూసి బ్రయబ్రాంతుకలు గురైయానని అన్నారు, నీవు పూజలు చేస్తు దేవుడుకి నైవేద్యం పెడితే రామారాజ్యాం రాదని, దానికి కొరకు నీవు ప్రత్యేకంగా సైనికులకు అన్నిటికి ఆరితేరేలా తయారు చేయాల్సిన బాధ్యత నీకు లేదా, అసలు ఈ భూమి ఇక్ష్యాకు వంశీయులదని, రాముడు అన్నాడా లేదా, నీకు ఏమీ తెలియదు, ఇక్ష్యాకు వంశీయులది ఏ గోత్రం, ఆలయంలో ఎంత మంది అర్చకులు, వైశ్య, క్షత్రియులు పనిచేస్తున్నారు, వారి గోత్రాలు నీకు తెలియవా, ఎందుకు నీవు దేవుని బ్రాహ్మణ వేశం కట్టి ఆ దేవునికి ద్రోహ చేస్తున్నావు, రామరాజ్యా స్ధాపన కోసం మమ్మల్నందరిని మీతో కలుపుకొవాలంటు వత్తిడి, రామరాజ్యాం కోరకు నేను రాజ్యాంగాన్ని అనుసరించడాన్ని వారు తప్పుబట్టి మమల్ని చిల్కూర్ ఆలయంలో భాగస్వాములను చేయండి మేము మాకు కావాల్సిన సైనికులను తయారుచేసుకుంటామని హైచ్చరించారు, ఇక్షాకు వంశీయుల గోత్రాలు చెప్పాలంటు దురుసుగా మాట్లాడుతూ భెదిరిస్తున్న విడియో సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతుంది, ఇక్షాక వంశీయులు ఏ గోత్రాల్లో ఉన్నారో తెలియదు, అడుగితే కోర్టు, చట్టాలు అంటున్నావు, పండితుల వేశమేసుకొని ఆటలాడుతున్నారా, నీకు, స్వరం, లయ తెలియదు, బలుపు ఆహంకారం మాత్రమే అయ్యవారు అలవాటు చేసుకున్నారని నిందించారు, ఎప్పటికి నీ స్వామి దనుర్బానాలు పట్టుకొని వచ్చి నీవు చెపే మాటాలే వింటారనుకుంటున్నావా, ఇది అర్చకుల పని మీ క్షాత్రం కలిగినవారు, ఏఏ గోత్రాల్లో ఉన్నారు, వైశ్యపరంపరవారు ఏ గోత్రాల్లో ఉన్నారు, దర్మసంస్ధాపన కోసం కలిలో రామారాజ్యాం ఏర్పటయిందని అన్నారు, ఉన్నపనులన్ని పక్కనబెట్టి రామారాజ్యాస్ధాపన కొసం పనిచేయి లేదంటే, ఎవరు నిన్ను కాపాడరు, నిన్ను ఏమిచేస్తారో మాకు తెలియదన్నారు, నీవు అన్ని ముసుకొని చట్టాలు, న్యాయాలు అంటు వెలితావా, న్యాయవ్యవస్దలోనే అందరు దోంగలని, వారి తోలుతీయడానికే మేము వచ్చామన్నారు, నీ రాముడంత అందగాలము మేము కాదు, మమల్ని పంపినవాడు హరి వేదాలు పాఠలు పాడి వినిపిస్తు, న్యాయముర్తులపై ఎవరు చర్యలు తీసుకోవడం లేదన్నారు, మేము ఇక్షాక వంశీయుల సాంప్రదాయాన్ని అనుసరించి నీకు ఇంకో అవకాశం ఇస్తున్నాము, ఇది తప్పితే మేము రాము వచ్చిన వారు వారి పనిచేసుకుంటు పోతారు, మాకు సైనికులను ఇవ్వండి అంటు బెధిరింపులకు గూరిచేసి వెల్లారన్నారు, మొయినాబాదన పోలీసులు వారి పై కేసులు నమోదుచేసి వీర రఘువరెడ్డి అనే వ్యక్తిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు, మిగితా 20 మంది కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిపారు.


### నేషనల్ క్యాపిటల్ రీజియన్ ప్లానింగ్ బోర్డ్

(గవర్నమెంట్ ఆఫ్ హౌసింగ్ & అర్బన్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ కింద ఒక చట్టబద్ధమైన సంస్థ)

1వ అంతస్తు, కోర్-4B, ఇండియా హాబిటాట్ సెంటర్, లోధి రోడ్, న్యూఢిల్లీ-110003

ఫైల్ నం. 9188951

క్రింద ఇవ్వబడిన వివరాల ప్రకారం నేషనల్ క్యాపిటల్ రీజియన్ ప్లానింగ్ బోర్డ్‌లో కింది పోస్ట్‌ల కోసం సిద్ధంగా ఉన్న మరియు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడ్డాయి:-

| పోస్ట్ పేరు | రిక్రూట్‌మెంట్ పద్ధతి | జీతం స్కేల్ |
|---|---|---|
| స్టెనోగ్రాఫర్ గ్రేడ్ C | డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా | లెవెల్-7 (రూ.44,900-1,42,400) పే మ్యాట్రిక్స్‌లో |
| స్టెనోగ్రాఫర్ గ్రేడ్ D | డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా | లెవెల్-4 (రూ.25,500-81,100) పే మ్యాట్రిక్స్‌లో |
| మల్టీ-టాస్కింగ్ స్టాఫ్‌ల (MTS) | డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా | లెవెల్-1 (రూ.18,000-56,900) పే మ్యాట్రిక్స్‌లో. |

నిర్ణీత ఫార్మాట్‌లో దరఖాస్తు, అన్ని విధాలుగా పూర్తి చేసి, టెస్టిమోనియల్‌ల స్వీయ-ధృవీకరించబడిన కాపీలతో అభ్యర్థి సంతకం చేసి, 100 (వాపసు చేయలేని) కోసం IPO/డిమాండ్ డ్రాఫ్ట్‌తో పాటు న్యూఢిల్లీలో చెల్లించాల్సిన NCR ప్లానింగ్ బోర్డ్‌కు దరఖాస్తు రుసుము, సభ్య కార్యదర్శి, NCR ప్లానింగ్ బోర్డ్, హయా 1వ అంతస్తు ప్లానింగ్ బోర్డ్, 100కి చేరుకోవాలి. రోడ్, న్యూ ఢిల్లీ-110003. దరఖాస్తు రుసుమును ఆన్‌లైన్‌లో కూడా చెల్లించవచ్చు.

వంటి వివరాలు లేవు. పోస్టులు, అర్హత ప్రమాణాలు, విద్యా అర్హతలు, రిజర్వేషన్, వయస్సు, దరఖాస్తు ఫారమ్ ఫార్మాట్, ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు వివరాలు మరియు దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీ మొదలైనవి మా వెబ్‌సైట్ https://ncrpb.nic.inలో అందుబాటులో ఉన్నాయి.

ఎటువంటి కారణం చూపకుండా పై పోస్టును భర్తీ చేయకూడదనే హక్కు బోర్డుకు ఉంది.

సం/-
(సభ్య కార్యదర్శి)

CBC 44103/12/0010/2425


# గురుమూర్తి భార్య హత్య ఉదంతంలో మరికొందరు?

### విచారణ సాగిస్తున్న పోలీసులు

### అతడి కుటుంబీకులపై కేసులు నమోదు

**హైదరాబాద్ (సరూర్‌నగర్), ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాలో తీవ్ర సంచలనం సృష్టించిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి గురుమూర్తి భార్య వెంకట మాధవి దారుణ హత్యోదంతంపై పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. మాధవిని కడతేర్చి మృతదేహాని ్న కత్తితో ముక్కలు ముక్కలు చేసి ఎలక్ట్రిక్ హీటర్‌తో వేడి నీళ్లల్లో ఉడకబెట్టి వాటితో పాటు ఎముకలను పొడి చేసి స్థానిక చెరువులో వేయడం ద్వారా శవాన్ని పూర్తిగా మాయం చేసిన ఘటన కలకలం సృష్టించిన సంగతి అందరికీ తెలిసిందే. అయితే నిందితుడైన గురుమూర్తిని రిమాండ్ చేసిన పోలీసులు విచారణలో భాగంగా ఇటీవల కస్టడీలోకి తీసుకున్నారు. అయితే నిందితుడు తాను ఒక్కడే ఘాతుకానికి పాల్పడినట్లు ఒప్పుకుంటున్నా పోలీసులకు మాత్రం ఇందులో అనుమానాలు ఉన్నట్లు సమాచారం. గురుమూర్తికి మాధవి హత్య విషయంలో అదే విధంగా మృతదేహాన్ని మాయం చేయడంతో ఆయన కుటుంబీకుల్లో సహకరించినట్లుగా అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు ఈ కేసులో ఎ-1 గా గురుమూర్తి ఉండగా మరో ముగ్గురిపై కూడా కేసులు నమోదు చేసి నిందితులుగా చేర్చినట్లు తెలిసింది. మాధవి హత్య కేసులో వారి పాత్ర విషయమై విచారణ చేస్తున్నట్లు సమాచారం. హత్య జరగక ముందు మాధవిని డబ్బుల విషయంలో అదే విధంగా మానసికంగా వేధించారని మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని తెలిసింది. ఈ నేపథ్యంలో హత్యకు పాల్పడిన గురుమూర్తి తల్లి సుబ్బ లక్ష్మమ్మ, సోదరి సుజాత, సోదరుడు కిరణ్‌లపై కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

**గురుమూర్తికి పాలిగ్రాఫ్ పరీక్షలు!**

కట్టుకున్న భార్యను దారుణంగా అంతమొందించి శవాన్ని నామరూపా ల్లేకుండా చేసి మాయం చేసిన కిరాతకుడు గురుమూర్తి నుండి అసలు విషయాలు రాబట్టడానికి పాలిగ్రాఫ్ పరీక్షలు నిర్వహించాలని పోలీసులు నిర్ణయించినట్లు సమాచారం. హత్య జరిగిన తర్వాత నుండి పోలీసుల అదుపులోనే ఉండి చాలారోజులకు రిమాండ్ అయిన గురుమూర్తి తిరిగి పోలీసుల విచారణ నిమిత్తం కస్ టడీలో ఉన్నా వాస్తవాలు చెప్పడంలేదనే అనుమానాలు పోలీసులకు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నిందితుడికి పాలి గ్రాఫ్ పరీక్షలు చేయాలని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు కోర్టు అనుమతి కోరనున్నారు.

వార్త

తక్షణ కర్తవ్యం నెరవేరిస్తే,
తదుపరి కర్తవ్యం ఏమిటో సులువుగా తెలుస్తుంది.

న-బైరన్

# ఊహించిన విజయమే..


అన్నివర్గాలు ఊహించినట్లుగానే దేశరాజధానిలో కమలం వికసించింది. సుమారు రెండు దశాబ్దాల తర్వాత భారీ ఆధిక్యంతో భారతీయ జనతాపార్టీ మళ్లీ ఢిల్లీలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. మొత్తం 70 స్థానాల్లో 48 స్థానాలను కైవసం చేసుకుని జయకేతనం ఎగురవేసింది. డబుల్ ఇంజన్ సర్కారు హామీలను ప్రజలు విశ్వసించారనే చెప్పాలి. నిత్యం కేంద్రంతో వాగ్వాదం లెఫ్టినెంట్ గవర్నర్‌తో వివాదాలతోపాటు మద్యం కుంభకోణం, జల్‌బోర్డు అవకతవకలు, యమునా వివాదం, శీష్‌మహల్ ఆరోపణలతో ఆమ్‌ఆద్మీ ప్రతిష్ట పూర్తిగా దెబ్బతిన్నదనే చెప్పాలి. ఎన్నికల్లో కేజ్రీవాల్ ఇచ్చిన హామీలపై నగర ప్రజలు అంతగా ఆకర్షితులు కాలేదనే చెప్పాలి. ఆప్‌కు చెందిన మహామహులు సైతం ఓటమి పాలయ్యారు. మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సిఎం మనిశ్ సిసోడియాతోపాటు మద్యం కుంభకోణంలో ప్రమేయం ఉందని చెప్పిన అందరూ కూడా పరాజయం పాలయ్యారు. అలాగే సుదీర్ఘకాలంపాటు జైలులో ఉన్న నేతలందరినీ ప్రజలు ఈ ఎన్నికల్లో విశ్వసించలేదనే చెప్పాలి. మరో విషయం ఏమిటంటే హ్యాట్రిక్ విజయం సాధించాలని ఆమ్ ఆద్మీపార్టీ బోర్లాపడితే హ్యాట్రిక్ ఓటమిని సాధించి కాంగ్రెస్ పార్టీ యధాతథస్థితిని కొనసాగించింది. ఒక్క స్థానాన్ని కూడా గెలవలేక పోయింది. ఢిల్లీలో అప్పటి సీఎం షీలాదీక్షిత్ తర్వాత మరోసారి కాంగ్రెస్ పార్టీ గెలిచిన సందర్భంలేదు. అలాగే భారతీయ జనతాపార్టీ కూడా సుష్మస్వరాజ్ ముఖ్య మంత్రిగా ఉన్న కాలం తప్ప మరోసారి ఢిల్లీ పీఠం సాధించలేకపోయింది. 27 ఏళ్లుగా పార్టీ గెలుపు అవకాశాల కోసం ఎదురుచూస్తేనే ఉంది. ఈసారి కట్టు దిట్టమైన వ్యూహాలతో ప్రజల్లోకి వచ్చిన కమలనాథులు కేజ్రీవాల్ పాలనా వైఫల్యాలను ఎత్తి చూపించి స్థానిక సమస్యల పరిష్కారం, ఉచితాల వ్యూహాలతోపాటు ఒక్కఛాన్స్ ఇవ్వండి అంటూ సాగించిన ప్రచారం ఢిల్లీ ఓటర్ల గుండెల్లో నిలిచిపోయింది. దీనికి తోడు సీఎం అభ్యర్థి ఎవరు అన్న స్పష్టత లేకుండానే ఎన్నికలకు వెళ్లింది. బిజెపికి స్థానికంగా బలమైన నాయకుడు లేకపోవడాన్ని ప్రధాన అస్త్రంగా తీసుకున్న ఆప్ సీఎం అభ్యర్థిని ప్రకటించడంలో బిజెపి విఫలం అయిందని ప్రచారం చేసింది. అలాగే బిజెపి వస్తే మురికి వాడల న్నింటినీ నిర్మూలిస్తుందన్న ప్రచారంతో కూడా ముందుకు వెళ్లింది. కానీ అవేమీ కూడా ఫలించలేదని ఎన్నికల ఫలితాలు రుజువు చేసాయి. ఎన్నికల్లో కేజ్రీవాల్‌ను లక్ష్యంగా పెట్టుకుని బిజెపి ప్రచారంలో దూసుకు పోయింది. అద్దాలమేడ వివాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలిగారు. కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేసారని, ఆప్‌నేతలందరూ అవినీతిలో కూరుకుపోయారన్న అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లగల గడంలో విజయం సాధించిందనే చెప్పాలి. అలాగే తరచూ కేంద్రంతో కొనసాగుతున్న వివాదాలకు తోడు లెఫ్టి నెంట్ గవర్నర్‌తో వివాదాలను తారస్థాయికి తీసుకెళ్లడం కూడా ప్రజలకు ఎంతమాత్రం రుచించలేదు. కేంద్రంతో సఖ్యతగా ఉంటూ దేశరాజధాని ప్రాదేశిక ప్రాంతాన్ని అభివృద్ధిచేయాల్సిందిపోయి తరచూ వివాదా లకు దిగడం కూడా ఓటర్లు ఎంతమాత్రం ఇష్టప డలేదని ఫలితాలు రుజువు చేసాయి. వీటికితోడు స్థానిక సమస్యలపైనే ఎక్కువ దృష్టిపెట్టి కమలం ముందుకు సాగింది. రోడ్ల నిర్వహణ,మంచినీటి కొరత, నగర కాలు ష్యం మౌలిక సదుపాయాల కల్పనలో ఆప్ ప్రభుత్వం విఫలం అయిందన్న వాదనను బలంగా ప్రచారం చేసింది. సమస్యలన్నింటికీ మోడీ ప్రభుత్వమే కారణ మని ఆప్ ప్రచారం చేసినా ప్రజల్లోకి మాత్రం ఆ వాదన వెళ్లలేదు. అవినీతి ఆరోపణలు, అగ్రనేతల అరెస్టులు వం టివి ఆప్‌పై బలంగా ప్రభావం చూపించాయి. ఢిల్లీ జనా భాలో 40శాతంవరకూ ఉన్న మధ్యతరగతి ప్రజానీ కాన్ని తీవ్ర అసంతృప్తికి గురిచేసాయి. ఇతర రాష్ట్రాల తరహా లోనే మహిళలకు నెలనెలా ఆర్థికసాయం బలంగా పని చేసింది. గర్భిణీలకు రూ.21వేల సాయం కూడా బిజెపికి ఓట్లను కురిపించిందనే చెప్పాలి. పూర్వాంచల్ ప్రభావం కూడా బిజెపి విజయానికి దోహదం చేసింది. దేశ రాజ ధానిలో సుమారు 20 నియోజకవర్గాల్లో వీరి ప్రభావం ఉంది. సుమారు 40లక్షలమంది ఈ ఓటర్లు ఉన్నారు. వీరికోసమే యుపి, బీహార్‌లనుంచి అగ్రనేతలందరినీ రంగంలోకి దించి ఆవర్గం ఓట్లు చీలకుండా జాగ్రత్తలు తీసుకుంది. దీనికితోడు ఆప్, కాంగ్రెస్ వేరువేరుగా పోటీచేయడం కూడా బిజెపికి కలిసొచ్చింది. అలాగే బీఎస్పీ, వామపక్షాలు, మజ్లిస్, ఆజాద్ సమాజ్ పార్టీ, ఎన్సీపీలు కూడా ఎన్నికల్లో వేరువేరుగా తలపడటం ఆమ్ ఆద్మీకి తీవ్రనష్టం కలిగించింది. ప్రత్యేకించి 60 లక్షలకు పైగా ఉన్న మహిళా ఓటర్లు ఈసారి బిజెపికి తమ మద్దతును తెలియజేసారన్నది ఈ ఎన్నికల ఫలితాలు రుజువు చేసాయి. దీనికితోడు మధ్యతరగతి వర్గానికి ఊరట నిచ్చేవిధంగా ఆదాయపు పన్ను పరిమితిని రూ.12లక్షలకు పెంచడం ఈ ఎన్నికల్లో ప్రభావం చూపించింది. దేశ రాజధానిలో మధ్యతరగతి జనాభాయే ఎక్కువ. ఈ ప్రభావం కూడా బిజెపికి కలిసొచ్చిందనే చెప్పాలి. అంతేకాకుండా వేతన జీవులకోసం ఎనిమిదవ వేతన సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం ఉద్యో గుల, పింఛన్‌దారుల జీతాలు, పింఛన్లు పెరుగుతుందన్న ఆశలు వేతన జీవుల్లో పెరిగాయి. అలాగే తాము అధికారంలోకి వస్తే పాతపథకాలేమీ రద్దు చేయబోమని వాటిని కొనసాగిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. సీనియర్ సిటిజన్లకు ఇచ్చిన రాయితీలు, ఆరోగ్యరంగంలో వారికిచ్చిన హామీలు కూడా పనిచేసాయి. మొత్తంగా చూస్తే హ్యాట్రిక్ కొట్టాలని భావించిన ఆమ్ ఆద్మీకి ఈ ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు గుణపాఠమే చెప్పారని నిస్సందేహంగా చెప్పవచ్చు.

చదరంగంలో మాదిరిగానే
జీవితంలో కూడా ముందుచూపు
ఎంతో అవసరం.



ఐ. జాన్సన్

చేయగలిగే శక్తి ఉన్నవాడికంటే,
చేయాలనే కోరిక ఉన్నవాడు
ఎక్కువ చేయగలుగుతాడు.



జి.ముర్రే

# ప్రజావాక్కు



### గిరిజనుల్లో పోషకాహార లోపం

**గత ఏడేళ్లుగా,** గిరిజనులు ప్రభుత్వ నిర్లక్ష్య విధానాల కారణంగాతీవ్రమైనపోషకాహారలోపసమస్యను ఎదుర్కొం టున్నారు.భారతదేశంలోని 47లక్షలమందిగిరిజన పిల్లలు తీవ్రమైనపోషకాహార లోపంతో బాధపడుతున్నారని ఐక్య రాజ్య సమితి తాజా నివేదిక తెలియజేస్తోంది. ఇది వారి మనుగడ, అభివృద్ధి, అభ్యాసం, ఉత్పాదకతను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. జనజీవన స్రవంతికి దూరంగా నివ సించే గిరిజనులలోవివక్ష,భౌగోళిక వేర్పాటువాదం, ప్రజా సేవలకు పరిమిత ప్రాప్యత, సాంస్కృతిక వ్యత్యాసాలు వంటిఇతరకారణాల వలనవారుఅవసరమైన సేవల కోసం ప్రభుత్వంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. కాబట్టి, పోషకాహారం ఆరోగ్య సంబంధిత సేవలకోసం వారి పట్ల ప్రభుత్వబాధ్యత రెట్టింపుగావుంది.

-సి.సాయిరుత్విక్, నల్గొండ

### అమలు కాని విద్యా హక్కు చట్టం

**సమాజంలో** కొంతమంది పిల్లలు బడి బయట ఉండిపోవ డం, బాలకార్మికులుగా పనుల్లో కార్ఖానాల్లో, గనుల్లో పని చేయడం, వారిప్రవేశానికి పాఠశాల నియమ నిబంధనలు అడ్డంకి రావడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ప్రాథమికహక్కుగా మారిన విద్యను పిల్లలందరూ పొంద డానికిగాను ఉచిత నిర్బంధవిద్యకు 'బాలల విద్యా హక్కు చట్టం2009'దేశవ్యాప్తంగా2010ఏప్రిల్ 1నుండి అమలు లోకి వచ్చింది.విద్యా హక్కు చట్టం అమలులోకి వచ్చి 16 సంవత్సరాలు అయినా ఇప్పటికీ 10 శాతం కూడా అమలుకావడంలేదన్న నేషనల్ సెంటర్ ఫర్ ప్రైమరీ స్టడీస్ వారి అధ్యయన నివేదిక ఆందోళన కలిగిస్తోంది.

-సి.హెచ్.ప్రతాప్. శ్రీకాకుళంజిల్లా

### వేతన జీవులకు ఊరట

**వేతన జీవులకు** ఉరటనిస్తూ పన్నెండు లక్షలవరకు టాక్స్ తీసివేస్తూ కేంద్రంమధ్యతరగతి జీవులకు ఊరటనిచ్చింది. ఇది శుభ పరిణామం. అంటే దేశంలో సగటు సంపద పెరిగిందన్నమాట.ఇక రెండోవిషయంఏమిటంటే జాతీయ పత్తి మిషన్‌ను ప్రారంభించడం నది తీరా రాష్ట్రాలకు ఉరటనిచ్చేదే. ముఖ్యంగా ఛాంబల్, గోదావరి కృష్ణ తీరా ప్రాంత రాష్ట్రాలు మరింత సంపద సృష్టించబోతున్నాయి. కొన్నిరాష్ట్రాలు పత్తిని పండించడంలో పేరెన్నిక కలిగినవి.

- భారత అవినాష్, జనగామ

### వాట్సప్ ద్వారా సమస్యల పరిష్కారం

**ఆంధ్రప్రదేశ్** విద్య,ఐ.టి. శాఖల మంత్రి నారా లోకేష్ ఈ మధ్య వాట్సప్ గవర్నెన్స్ మన మిత్ర అనే నూతన పద్ధతిని ప్రవేశపెట్టారు. దీనిద్వారా ప్రజలు తమకు ప్రభుత్వ కార్యాల యాలలో పరిష్కారం కాని అనేక సమస్యలను సత్వరం పరిష్క రించేందుకే ఈవాట్సప్ పద్ధతిని అమలు పరచడం జరిగిందని ప్రకటించారు.ఇచ్చిన నంబరుకు వాట్సప్ చేయాలని పేపరులో ప్రకటన విడుదల చేసారు.సమస్య పరిష్కారం అయినదీ లేనిది తిరిగి వాట్సాప్ కాల్‌లో తెలియ జేస్తారట. ఈ పద్ధతి విజయ వంతమైతే ప్రజలకు శ్రమ, లంచాలు ఇచ్చి పనిచేయించుకునే పనితగ్గుతుంది.ఇతర రాష్ట్రాలవారు కూడా ఈవినూత్న ప్రయో గాన్ని ఉపయోగించుకోవచ్చును.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### అమెరికా...అనాగరికా!

**అమెరికా** అధ్యక్షుడి ఆలోచనలు, నిర్ణయాలు,చర్యలు అనాగరి కంగా తయారవుతున్నాయి. అవి ఆదేశాన్ని గొప్పగా మారుస్తా యో లేదో గానీ ఇతర దేశాలకు తలనొప్పిని తెస్తున్నాయి. రాజ కీయ,ఆర్థిక,భౌగోళిక స్థితుల్ని తలక్రిందులు చేసేవిగా ఉన్నాయి. ఆదేశంఎదుర్కొంటున్న సమస్యపై అధ్యక్షుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపడం అంత వరకూ అభినందనీయమే.ఒకప్పుడు వలసల్ని ప్రోత్సహించడం ద్వారా ప్రపంచ ఆర్థికశక్తిగా మారిన దేశం వలసల్ని నేడు అరిక ట్టాలని అనుకోవడం వారి అవసరం.అందునా అక్రమంగా వచ్చి న వాళ్లని ఆపడం, వెనక్కి పంపించడంలో ఎవరికీ ఆక్షేపణ, అభ్యంతరంఉండనక్కరలేదు.కానీవారినిగొలుసులతో బంధించి, అమానవీయంగా సైనిక విమానాల్లో తరలించడం ఒకింత అతి.

-డా.డి.వి.జి. శంకరరావు, హైదరాబాద్

### వ్యక్తిగత క్రమశిక్షణే సరైన చదువు

**కళాశాలల్లో** ర్యాగింగ్ పేరుతో జరుగుతున్న అమానుష ప్రవర్త ననుఅరికట్టేందుకు యూజీసి డిక్లరేషన్ వసూలు చేయని వైద్య కళాశాలల సంజాయిషీ కోరి తిరిగి కౌన్సెలింగ్ ద్వారా సీటు ఖాయం జరిగేటప్పుడే పేరెంట్ సమక్షంలో విషయం చెప్పి వసూలు చేయడంలో బాధ్యత, భయం ఉంటాయి. కారణం డబ్బుతో పాటు క్రమశిక్షణ చర్యలు ఉంటాయి. దీనితో పాటు కళాశాలలో అడుగుపెట్టిన రోజునుండే వారికి, పేరెంట్‌కి కౌన్సెలింగ్ అవసరం. ఇక సీనియర్స్‌కి కూడా ర్యాగింగ్ విషయం లో స్పష్టంగా ఉన్నతాధికారుల ఉత్తర్వులు చెప్పాలి.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆకలి మరణాలకు ఏదీ పరిష్కారం!

***దేశంలో ఆకలి,పోషక ఆహార లోపంవల్ల ప్రతిరోజు 4,500 మంది పిల్లలు చనిపోతున్నారు. ఆకలితో ప్రతిసంవత్సరం 3లక్షలకుపైగా ప్రజలు మరణిస్తున్నారు. ప్రపంచ దేశాల్లోని పేద, సామాన్య ప్రజలు దేశసంపదలకు దక్కకపోవటం, భూములు, ఫ్యాక్టరీలపై హక్కులు లేకపోవటం, పాలక ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలు, సంపదకేంద్రీకరణ, వెనుకబడ్డ దేశాల్లో సామ్రాజ్యవాదుల దోపిడీ, ఆధిపత్య విధానాలు, యుద్ధఘర్షణలు, పర్యావరణ కాలుష్యం, ప్రకృతి వైపరీత్యాల వల్ల పేదరికం, ఆకలి మరణాలకు కారణం. పాలకుల విధానాలకు, యుద్ధ ఘర్షణలకు వ్యతిరేకంగా ఆయాదేశాల ప్రజలు ఉద్యమించాలి.***

బొల్లిముంతసాంబ శివరావు

ఆక్స్‌ఫామ్ విడుదల చేసిన కొత్త నివేదిక ప్రకారం ప్రపంచదేశాల్లో కరవు, ఆహార కొరత, యుద్ధఘరణల వల్ల సంభవించిన ఆకలిమరణాల గురించిన వివరాలు తెలి యచేసింది. దాని నివేదిక ప్రకారం వెనకబడిన దేశాల్లో ముఖ్యంగా ఆఫ్రికా, ఆసియా దేశాల్లో ఆకలి మరణాలు ఎక్కువగా ఉన్నాయి. ఈదేశాల సహజ సంపదలను సామ్రా జ్యవాదులు, బహుళజాతి సంస్థలు దోచుకుపోవటమే అందు కు కారణంగా ఉంది. 2024-25లో ప్రపంచంలో ఆకలి వివరాలు ప్రకారం ప్రతిరోజు 73కోట్ల, 30లక్షల మంది ఆక లితో అలమటిస్తున్నారు. 280 కోట్లమంది ప్రజలు ఆరోగ్య కరమైన ఆహారం పొందలేకపోతున్నారు. వీరు ప్రపంచ జనాభాలో 35శాతంగా ఉన్నారు. తక్కువ ఆదాయ దేశాల్లో 71.5శాతం మంది ప్రజలకు పుష్టికరమైన ఆహారంఅందటం లేదు.అధిక ఆదాయదేశాల్లో వీరి సంఖ్య 6.3శాతం మాత్ర మే. 2024లో గ్లోబల్ హంగర్ ఇండెక్స్ ప్రకారం 36 దేశా ల్లో ఆకలిరేటు తీవ్రస్థాయిలోఉంది. పిల్లల మరణాలలో సగం పోషకాహార లోపంకారణంగా ఉంది. ప్రతిసంవత్సరం 90 లక్షలమంది పిల్లలు ఆకలి సంబంధిత కారణాలతో మరణిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది 5 సంవత్సరాల లోపు పిల్లలే. అనేక దేశాల్లో ఆకలి మరణాలు పెరుగుతూ ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి నాలుగు సెకన్లకు ఒకరు ఆకలితో మరణిస్తున్నారు. 2021లో ఆహార సంక్షోభంలో 15.5 కోట్ల మంది చిక్కుకున్నారు. తినటానికి తిండిలేక, ఆకలికి తట్టుకోలేక ప్రతినిమిషం 11మంది చనిపోయారు. కరోనా వైరస్ కంటే అత్యంత ప్రమాదకరంగా ఆకలి బాధ ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్నది. 2020లో కరవు పరిస్థితులు ఎదుర్కొన్న వారి సంఖ్య కంటే నేడు ఆరురెట్లు పెరిగిందని ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడించింది. కరోనా సంక్షోభం, ఆర్థిక పతనం, ప్రకృతివైపరీత్యాలు కలిపి 5లక్షల 20 వేలమందికి పైగాప్రజల ఆకలి చావులకు కారణమైందని ఆక్స్‌ఫామ్ నివే దిక తెలిపింది. ప్రజలు ఆకలి చావుల బారినపడుతున్నా, ఇదే సమయంలో ప్రపంచ సైనిక వ్యయం 51బిలియన్ డ్డాలర్లకు పెరిగిందని పేర్కొంది. కోవిడ్ వల్ల పెరుగుతున్న ప్రపంచ అసమానతల కారణంగా 50 లక్షలమందికిపైగా ప్రజలు తీవ్ర పేదరికంలో కూరుకుపోయారు. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఆహార ధరలు పెరిగాయి. ఇదిప్రజలపై తీవ్రప్రభావం చూపింది. ఇదే సమయంలో 2019 నుండి ప్రపంచంలోని 12వందల అతి పెద్దకంపెనీల ఆస్తులు 56 శాతం పెరిగాయి. ఆఫ్రికాలో కరువు ఆకలిఆఫ్రికాలోని కొన్ని దేశాలు, ప్రాంతాలు తీవ్రమైన కరవు, ఆకలి సమస్యను ఎదుర్కొంటున్నాయి. కెన్యా, నైజీరియా, ఇథియోపియా, సోమాలియా తదితర ఆఫ్రికా దేశాల అంతటా 40 ఏళ్లలో చూడని అత్యంత ఘోరమైన ఆహారసంక్షోభంలో ఉన్నాయి. కుటుంబాలు ఆహారం కోసం వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రు వదలలేక వదలివలసపోతున్నారు. పిల్లలను పాఠశాల కు పంపకుండా కుటుంబ అవసరాల రీత్యా పనులకు పంపుతున్నారు, లేదా భిక్షాటన చేయిస్తున్నారు.పాలకుల ప్రజావ్యతిరేక విధానాల వలన సంపద కొద్ది మంది వద్ద పోగుపడటం,పేదరికం పెరగటం, సంవత్సరాల తరబడి వర్షాభావ పరిస్థితులు, పంటలు విఫలం కావటం, పశు వులు చనిపోవటం ఆఫ్రికాలో కరవు ఆహార సమస్యకు, ఆకలి మరణాలకు కారణం అయ్యాయి. ఆఫ్రికాలో1.4 (100కోట్ల,40 లక్షలు)బిలియన్లకుపైగా ప్రజలు ఉన్నారు. వీరిలో22కోట్ల,60 లక్షలమంది ఆకలితో అలమటిస్తున్నారు. ప్రపంచంలోని 30 పేదదేశాల్లో 27దేశాలు ఆఫ్రికాలోనే ఉన్నాయి. ఆఫ్రికాలో అత్యంత పేదరికం, ఆకలితో ప్రభా



వితమైన దేశాలు సహారాకు దక్షిణాన ఉన్నాయి. ఇక్కడ ప్రతినలుగురిలో ఒకరు ఆకలితో అలమటిస్తున్నారు. ప్రపంచ ఆహార కార్యక్రమం గుర్తించిన 10దేశాల్లో అత్యధికసంఖ్యలో ప్రజలు ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారు. ఇందులో 5 దేశాలు ఆఫ్రికాలోనే ఉన్నాయి. 2022 గ్లోబల్హంగర్ ఇండెక్స్ ప్రకారం తీవ్రమైన కరవు ఉన్న 54 దేశాల్లో 37 దేశాలు ఆఫ్రికాలోనే ఉన్నాయి. మధ్య దక్షిణాఫ్రికాలోని 12 దేశాల్లో 45.5 మిలియన్ల ప్రజలు, తూర్పుఆఫ్రికాలోని 9 దేశాల్లో 43.6 మిలియన్ల ప్రజలు, పశ్చిమ ఆఫ్రికా సాహె ల్లోని 16 దేశాల్లో 30.4 మిలియన్ల ప్రజలు కరవు పరిస్థి తుల్లో ఉన్నారు. సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, చాడ్, డెమో క్రటిక్ రిపబ్లిక్ ఆఫ్కాంగో,మడగాస్కర్ దేశాలు ప్రపంచ ఆరోగ్య సర్వేప్రకారం ఆందోళనకరమైన ఆకలిస్థాయిలో ఉన్నాయి. నైజీరియాలో 24.5 మిలియన్ల మందికి తిన టానికి సరిపడా ఆహారంలేదు. కెన్యాలో 5లక్షల, 20 వేల మంది కరవు వాతపడ్డారు. డిసెంబర్ 2023 నాటికి సోమాలియా కరవు అంచున ఉంది. 80లక్షల, 30వేల మంది ఆహార అభద్రత అధ్వాన స్థాయికిచేరింది.పేదరికం, కరువు, ఆహార కొరత వల్ల పోషకాహారం లభించక పిల్లలకు అనేక సమస్యలు ఎదురౌతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన కనీస అవసరమైన ఆహారం కూడా ఆఫ్రికాలోని 10మంది పిల్లల్లో 9 మందికి అందటంలేదు. రోజుఐదుగురి లో ఇద్దరు భోజనానికి దూరంగా ఉన్నారు. వయస్సుకు అనుగుణంగా ఎదుగుదల లేకపోవటంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులవల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. ఆహారలేమి కార ణంగా ప్రతి 3 సెకన్లకు ఒక పిల్లవాడు, రోజుకి10 వేల మంది చనిపోతున్నారు. ఆఫ్రికా దేశాలు కరవుకి, ఆకలికి నిలయంగా ఉన్నా, ఆసియాలోనే ఎక్కువమంది ఆకలితో, పోషకాహార లోపంతోఉన్నారు. ప్రపంచంలో పోషకాహార లోపం ఉన్న పిల్లల్లో 64శాతం మంది ఆసియాలోనే ఉన్నా రు. ఆసియాలోని 519.6మిలియన్ల పెద్దలు, పిల్లలు చాలా తక్కువ ఖర్చుతో జీవిస్తున్నారు. వీరు ఆసియా మొత్తం జనాభాలో 12 శాతం. దక్షిణాసియాలో పోషక ఆహార లోపంలో గ్లోబల్ హంగర్ ఇండెక్స్ స్కోరు ప్రకారం 30.9 శాతం ఉంది. ఇది తీవ్రమైన ఆకలిని సూచిస్తుంది. అత్యధిక మంది పోషకాహార లోపం, ఆకలితో ఉన్నారు. ప్రపంచంలో 15కోట్ల, 80లక్షల మంది కుంగిపోయిన పిల్లలు ఉంటే, వీరిలో 8,30,60,000 (55శాతం) మంది ఆసియాలోనే ఉన్నారు. (యూనిసెఫ్,వరల్డ్ బ్యాంకుగ్రూపు 2018). దక్షిణ ఆసియా అంతట తీవ్రమైన రక్తహీనత కారణంగా ప్రసవ సమయంలో ప్రతిరోజు 25 వేలమంది మహిళలు చనిపోతు న్నారు. ఆఫ్ఘనిస్తాన్, గాజాలో(పాలిస్తీనియా) దురాక్రమణ యుద్ధాలకు,ఘర్షణలకు ఆహార కొరతకు లక్షలాది మంది ప్రజలు చనిపోయారు. ఆకలిసూచిలో భారతదేశం పరిస్థితి దారుణంగా ఉంది. 2022లో 121 దేశాల్లో భారత్ 107 స్థానంలో ఉంది. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్, పాకిస్థాన్లు భారతదేశం కన్నా ముందు ఉన్నాయి. ప్రపంచంలో అత్య ధిక సంఖ్యలో కుంగిపోయిన పిల్లలున్న దేశం భారత్. దేశంలోని మొత్తంపిల్లల్లో 46.8 మిలియన్లు కుంగుబాటుతో బాధపడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా కుంగిపోయిన పిల్లల్లో వీరుమూడవ వంతుగా ఉన్నారు. దేశంలో కౌమార దశలో( 15-19 సంవత్సరాల వయస్సు) బాలికలలో రక్త హీనత 56శాతం ఉంది. భారత్లో చైల్డ్ విస్టింగ్రేటు 19.3 శాతంతో ప్రపంచంలోనే అత్యంత తీవ్ర సమస్యగా ఉంది. దేశంలో ఆకలి,పోషక ఆహార లోపంవల్ల ప్రతిరోజు 4,500 మంది పిల్లలు చనిపోతున్నారు. ఆకలితో ప్రతిసంవత్సరం 3లక్షలకుపైగా ప్రజలు మరణిస్తున్నారు. ప్రపంచ దేశాల్లోని పేద, సామాన్య ప్రజలు దేశసంపదలకు దక్కకపోవటం, భూములు, ఫ్యాక్టరీలపై హక్కులు లేకపోవటం, పాలక ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలు,సంపదకేంద్రీకరణ, వెనుకబడ్డ దేశాల్లో సామ్రాజ్యవాదుల దోపిడీ, ఆధిపత్య విధానాలు, యుద్ధఘర్షణలు, పర్యావరణ కాలుష్యం, ప్రకృతి వైపరీత్యాల వల్ల పేదరికం, ఆకలి మరణాలకు కారణం. పాలకుల విధానాలకు, యుద్ధఘర్షణలకు వ్యతిరేకంగా ఆయాదేశాల ప్రజలు ఉద్యమించాలి. ●

# వన్యప్రాణుల రక్షణ ఎవరి బాధ్యత?

డాక్టర్ మోటె చిరంజీవి

వన్యప్రాణుల సంరక్షణ అనేది వృక్ష జంతు జాతులను వాటి ఆవాసాలను రక్షించే పద్ధతి. వన్యప్రాణులు ప్రపంచ పర్యావరణ వ్యవస్థలకు అంతర్భాగం. ప్రకృతి ప్రక్రియలకు సమతుల్యత స్థిరత్వాన్ని అందిస్తాయి. వన్య ప్రాణుల సంరక్షణ లక్ష్యం ఈ జాతుల మనుగడను నిర్ధారిం చడం, ఇతర జాతులతో స్థిరంగా జీవించడంపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా సాధ్యమవుతుంది. వన్య ప్రాణులకు రక్షణ కరవైంది. ఫలితంగా రోజురోజుకూ అవి కనుమరుగవుతున్నాయి.ధనార్జనే ధ్యేయంగా ఏజెన్సీ గ్రామా ల్లో వేటగాళ్లు ఉచ్చులు, విద్యుత్‌తీగలు అమర్చి అడవిజంతు వులను వధిస్తున్నారు. అనంతరం గుట్టుచప్పుడు కాకుండా వాటి చర్మం, మాంసాన్ని పట్టణ ప్రాంతాలు, శివారుల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎవరైనా సమాచారం ఇస్తేనే పట్టుకుంటున్నారని, మరి కొందరు నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లు వెత్తుతున్నా యి. వన్యప్రాణుల సంరక్షణకు కఠిన చట్టాలున్నా అవి అమ లుకు నోచుకోవడం లేదనే విమర్శలున్నాయి. వేటగాళ్లఉచ్చు లో పడి వన్యప్రాణులు విలవిల్లాడుతున్నాయి. పంటల కోసం అవి వస్తుండడంతో వేటగాళ్లు ఉచ్చులు, విద్యుత్ తీగలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కొండగొర్రె, అడవి పందులు, దుప్పులు, కుందేళ్లు, కొండముచ్చులు వంటి అడవి జంతువులు మృత్యువాత పడడంతో గుట్టు చప్పుడు కాకుండా మాంసాన్ని మైదానప్రాంతాల్లోని రహస్య ప్రదేశా లకు తీసుకొచ్చి కిలో రూ. 500 నుంచి రూ. వేయివరకు విక్రయిస్తున్నారు. వన్యప్రాణుల వేట యధేచ్ఛగా కొనసాగు తోంది. బయటి ప్రాంతాల నుంచి కొందరు వేటగాళ్లు తుపా కులు వేసుకుని అడవిలో సంచరిస్తూ, వన్యప్రాణుల పాలిట



యమకింకరులు అవుతున్నారు. వన్యప్రాణులను సంరక్షించ డానికి అనేక చట్టాలున్నాయి. వన్యప్రాణులను రక్షించడానికి భారత పార్లమెంటు 1972లో వన్యప్రాణుల (రక్షణ)చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టం వన్యప్రాణుల రక్షణ, సంరక్షణ, నిర్వహణకు సంబంధించిన నిబంధనలను కలిగిఉంది.అందు లో ముఖ్యంగా అడవి జంతువులు, పక్షులు మొక్కలకు రక్షణ కల్పించడం ఈ చట్టం ప్రధానలక్ష్యం. కొన్ని ప్రాంతా లను అభయారణ్యాలు లేదా జాతీయ ఉద్యానవనాలుగా ప్రకటించాలి. అడవి జంతువుల వేటను చట్టం నిషేధిస్తుంది. కొన్ని చట్టాలను చూసినట్లయితే భారతదేశ వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972, అటవీ, పక్షుల, జంతువుల భద్రతా చట్టం- 1912, భారతీయ ఏనుగుల భద్రతచట్టం-1879, బెంగాల్ ఖడ్గమృగ చట్టం 1932,మద్రాసు అటవీ ఏనుగుల చట్టం 1873, అసోం ఖడ్గమృగ భద్రత చట్టం 1954, ఇవేకాక ఆదేశిక సూత్రాల్లోని 48వ ప్రకరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వన్య ప్రాణులను సంరక్షించాలని పేర్కొంది. అదే విధంగా 51బి ప్రకారం వన్యప్రాణుల సంరక్షణపౌరుల ప్రాథమిక విధిగా పేర్కొంది. 42వ సవరణ ద్వారా వన్య ప్రాణుల సంరక్షణ రాష్ట్రజాబితా నుంచి ఉమ్మడి జాబితా లోకి మార్చారు. జంతువుల,పశువుల ఆవాసాలను సంరక్షిం చడం, అంతరించిపోతున్న జాతులను సంరక్షించడం, అక్రమ వేటను నివారించడం, జంతువులే మన దేశ భవిష్యత్తు అని భావించడం. జంతువులు మన జీవితంలో ఒక భాగం. ప్రజలు వారి వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాటికి హాని కల్పిస్తున్నారు. దీని నివారించడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నాయి. కానీ ప్రతి పౌరుడిగా మనం ముందడుగు వేసి మన కర్తవ్యాన్ని నెరవేర్చినప్పుడే వన్యప్రాణుల సంరక్షణ సాధ్యమవుతుంది. అందుకే వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతగా భావించినప్పుడే వాటిని సంరక్షించగలం. ●

# సంపద అశాశ్వతం.. జ్ఞానం శాశ్వతం



మేకిరి దామోదర్

ప్రతి బిడ్డ పుట్టినప్పుడు విశ్వ మానవుడే. మనమే జాతి, మతం, ప్రాంతం, కులం, తక్కువ, ఎక్కువ లాంటి సంకుచిత పరిధుల్లోకి కుదించి చిన్నవాడిని చేస్తాం. మంచి విద్య వారిని మళ్లీ విశ్వమానవుల్ని చేస్తుంది. భారతదేశ వ్యాప్తంగా సుమారు 26కోట్లకు పైగా పాఠశాల విద్యార్థులున్నారు. వారిలో60 శాతం సర్కారీబడుల్లోనే చదువుకుంటున్నారు. వారికి నాణ్యమైన విద్య అందక పోతే మన దేశ భవిష్యత్తు ఏంకావాలి?. ఈ ఆలోచన పాల కుల్లో ఉన్నట్లైతే సర్కారీ విద్యను గాడిన పెట్టవచ్చు. దానికి కావల్సిందల్లా ప్రభుత్వాలు ప్రతి ఆర్థికసంవత్సరంలో విద్యా రంగం మీద సరైన శ్రద్ధవహించడం, నిధులు వెచ్చించడం తో నిపుణత, సృజనాత్మకత, ఉత్పాదకతల్లో సాటిలేని మేటి మానవ వనరులు సిద్ధమవుతాయి. వాటి ద్వారా దేశ ఆర్థిక పురోగమనం వేగవంతమవుతుంది. ప్రగతిశీల ఫలాలపంపిణీ సమంగా జరిగి జనజీవన ప్రమాణాల మెరుగుదల సాధ్య పడుతుంది. కానీ ఇందుకు భిన్నంగా మన దేశంలో చదు వులు భావితరాల సహజనైపుణ్యాన్ని హరిస్తున్నాయి. సంవ త్సరం తిరిగే సరికే విద్యార్థుల పై తరగతులకు వెళ్తున్న ప్పటికీ, అత్యధిక అభ్యసన సామర్థ్యాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగడిఅక్కడే అన్నట్లుగా అఘోరిస్తున్నాయి. పునాది డొల్లైతే ఎంతపెద్ద భవనమైనా పేక మేడలా కూలిపోతుంది. ప్రాథమిక విద్యలో పిల్లలు వెనుకబడితే వారి ఎదుగుదలకు అదే ప్రధాన అవరోధమవుతుంది. మరోవైపు తల్లిదండ్రులు, సమాజం పిల్లల చదువుల పేరిట వారిని ప్రైవేట్, కార్పొరేట్ పంజరాల్లోకి నెట్టేస్తున్నారు. పిల్లలు ప్రయోజకులుకావాలని, జీవితాలు వెలిగిపోవాలని తల్లిదండ్రులు కోరుకోవడం సహ జమే. కానీ ఆ యావలో ప్రాధాన్యాలు మర్చిపోతున్నారు. మార్కులు, ర్యాంకులు, కెరీర్ అంటూ పిల్లలను ఒత్తిడికి గురి చేస్తున్నారు. తాము సాధించలేని లక్ష్యాలన్నింటిని వారిపై రుద్దేస్తున్నారు. పిల్లలందరి శక్తి సామర్థ్యాలు ఒకేలా ఉండవు. ముఖ్యమైన ఈ విషయాన్ని మరిచిపోయి ఇత రులతో పోలుస్తూ, వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారు. పిల్లలు ఆడుతూ పాడుతూ చదువుకోవాలి. స్వేచ్ఛగా స్వతం త్రంగా ఎదగాలి. చదువునైనా, కళనైనా, ఆటనైనా వారి ఇష్టాఇష్టాలను బట్టి నేర్పించాలి. తల్లిదండ్రులు ముఖ్యంగా గమనించాల్సిన అంశం ఏమిటంటే పిల్లల్ని పెంచే అవకాశం ఎవరికైనా ఒక్కసారే వస్తుంది. అక్కడ పొరపాటు జరిగితే సరిదిద్దుకునే ఛాన్స్ ఉండదు. అందుకని ఆ పరిస్థితి రాకుం డా చూసుకోవాల్సిన బాధ్యత నేటి సమాజం, తల్లిదండ్రుల పై ఎంతో ఉంది. ఇక్కడ అజ్ఞానాన్ని పారద్రోలి ప్రగతిశీల ఆలోచనలకు పాదుగొల్పడం, నవతరానికి నవీన నైపుణ్యా



లను అలవర్చడం చదువు లక్ష్యం. అంతేకాదు జీవితం పట్ల ఆశావహ దృక్పథాన్ని, జీవన గమనాన్ని నిర్దేశించుకునే తెలి విని, దానిని చేరుకునే దృఢచిత్తాన్ని భావితరానికి అందిం చడం విద్య పరమార్థం. కానీ దేశీయంగా జరుగుతున్నది ఏమిటి? మూస పాఠాలు, బండ బోధనా పద్ధతులకు తోడు ర్యాంకుల ఉన్మాద రేసులో విద్యార్థులు మానసికంగా కుంగిపోతున్నారు. పిల్లల సహజ ప్రతిభను గాలికొదిలి, మార్కులు, గ్రేడుల రేసులో ఒత్తిడికి గురి చేయడం వల్ల నిస్సహాయ స్థితికిలోనై మరణాలకు పాల్పడుతున్నారు. ఇలా జాతీయ నేర గణాంక సంస్థల లెక్కల ప్రకారం 2013లో దేశవ్యాప్తంగా ఆరున్నర వేల మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. పదేళ్ల వ్యవధిలో అటువంటి అభాగ్యుల సంఖ్య అంతకంతకు రెట్టింపు కావడం మన విద్యా వ్యవస్థ వైఫల్యాన్ని కళ్లకు కడుతుంది. వాస్తవంగా మానవ వికాస పరిణామక్రమంలో మనిషి ఆలోచనా విధానం అనేకమార్పు లు చెందుతూ వచ్చింది. ఆదిలో ఆకలి తీరితే చాలనుకున్నా డు. తర్వాత ఉండడానికి గూడు, ఒంటిమీద బట్టను కోరు కున్నాడు. ఆ కోరికల చిట్టా నెమ్మదిగా ఆస్తులు కూడపెట్ట డం వరకు చేరింది. చివరికి జీవితమంటే ధనం సంపాదిం చడం కోసం అన్నట్లయింది. ఏ జ్ఞానంతో అయితే మానవ జీవితం వికాస పరిణామం చెందిందో ఆ జ్ఞానం మరుగున పడిపోయింది. జ్ఞానమే అసలు సంపదనే వాస్తవ ఉనికిని కోల్పోయింది. పౌరులందరూ నాణ్యమైన జీవితాలు గడప గలడమే దేశ ప్రగతికి నిజమైన కొలమానం. ప్రజలు ఆరో గ్యంగా, ఆనందంగా, గౌరవప్రదంగా జీవించాలంటే తలసరి ఆదాయాల్లో అసమానతలు సమసిపోవాలన్నది నిర్వివాదాం శం. అలాంటి వాస్తవిక సమ్మిళిత, సుస్థిరాభివృద్ధికి భరత జాతి ఎప్పుడు నోచుకుంటుంది?. విద్యారంగం మీద ప్రభు త్వాలు సరైన బడ్జెట్ కేటాయించి, శ్రద్ధవహిస్తూ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే నాణ్యమైన ఉచిత విద్యను అందించి నప్పుడే అది సాధ్యపడుతుంది. మన దేశంలో 75ఏళ్ల ప్రజా పాలనలో విద్యపై చేసే ఖర్చు నానాటికి తెగ్గోసుకుపోతుంది. అంతేకాదు నాణ్యమైన ఉచిత విద్యను పొందడం రాజ్యాం గం ప్రజలకు కల్పించిన హక్కు. విద్యను అంగడి సరుకుగా చేశాక విలువలు, జ్ఞానసంపద అర్థమే మారిపోతోంది.సర్కా రీ విద్యపై పాలకుల మాటలు నీటిపై రాతలుగా మారు తున్నాయి. ఈ తీరు మారాలి. ఈ దేశం బాగుపడాలంటే విద్యాలయాలు వ్యాపార కేంద్రాలుగా మారకుండా విజ్ఞాన కేంద్రాలుగా బాసిల్లాలి. అప్పుడే విలువ ఆధారిత బోధన సాధ్యమవుతుంది. ఇలా విలువ ఆధారిత విద్యతోనే మంచి సమాజం నిర్మాణం అవుతుంది. ఈ రోజుల్లో మంచి వ్యక్తుల అవసరం ఎంతో ఉంది. మంచి వ్యక్తులను నిర్మించే కర్మాగారాలైన విద్యాలయాల వల్లనే సాధ్యం. "ప్రపంచాన్ని మార్చగల గొప్ప ఆయుధం విద్య ఒక్కటే."విద్యను నిర్లక్ష్యం చేస్తే, దేశం నిర్లక్ష్యానికి గురవుతుంది. విద్య జ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంపొందిస్తుంది. నాణ్యమైన జీవితాన్ని గడపడానికి ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. ●

# ఇంకా తేలని ఢిల్లీ సీఎం!

## కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో పార్టీ అధ్యక్షుడు జెపి నడ్డా భేటీ

### రాజస్థాన్, మధ్యప్రదేశ్ వ్యూహమే మళ్లీ?



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన బిజెపి ఇపుడు ప్రభుత్వం ఏర్పాటు కసరత్తుల్లో మునిగిపోయింది. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపికపై ముమ్మరకసరత్తులుప్రారంభించింది. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపినడ్డా భేటీ అయ్యారు. సాయంత్రం బిజెపి విజయోత్సవ వేడుకల అనంతరంప్రధానిమోడీ సహా పలువురు కీలక నేతలు ఇదే అంశంపై చర్చించగా తాజా భేటీ కీలకప్రాధాన్యం సంతరించుకుంది. కొత్త సీఎం ఎంపిక విషయంలో అనేక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని కమలనాథులు పలువురు సీనియర్లపేర్లను పరిగణనలోనికి తీసుకుంటున్నారు. సీఎం ఎంపిక విషయంలో రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో అనుసరించిన రాజకీయ వ్యూహం ఢిల్లీకి మినహాయింపేమీ కాదన్న అంచనాలు కూడా పెరిగాయి. ఇప్పటికే ఈ పదవిరేసులో మాజీ సీఎం కేజ్రీవాల్‌ను మట్టికరిపించిన సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మాజీ సీఎం కుమారుడు పర్వేష్‌సింగ్ వర్మ సతీశ్ ఉపాధ్యాయ్, విజయేందర్‌గుప్తా, ఆశిష్ సూద్, పవన్‌శర్మ వంటి పలువురు నాయకుల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ప్రజలకు పెద్దగా పరిచయంలేని కొత్తనేతలకు సిఎం పదవిని కగట్టబెట్టిన చరిత్ర బిజెపికి ఉంది. అందువల్ల ఎవరి పేరును ఖరారు చేస్తారన్నది ఉత్కంఠగా ఉంది. పూర్వాంచల్ నేపథ్యం కలిగిన ఎమ్మెల్యే, సిక్కు లేదా మహిళలను కూడా పరిగణనలోనికి తీసుకుంటారు. గతంలో సంఘటనలను పరిశీలిస్తే 2023లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, గత ఏడాది ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాక అభ్యర్థులను ఒక్కసారిగా మార్చేసారు. మధ్యప్రదేశ్‌లో మోహన్ యాదవ్; రాజస్థాన్‌లో భజన్‌లాల్‌శర్మ, ఒడిశాలో మోహన్ చరణ్ మాఝిలను సీఎం పదవులు వరించాయి. ఇదే క్రమంలో ఢిల్లీ కూడా మినహాయింపు కాదని అంటున్నారు. ఢిల్లీ బిజెపి చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ మాట్లాడుతూ సీఎం అభ్యర్థి ఎంపికపై పార్టీ కేంద్ర నాయకత్వమే నిర్ణయిస్తుందని చెపుతున్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేందరూ తమకు కేటాయించిన బాధ్యతలని నిర్వర్తించగలిగిన వారేనన్నారు. కొత్తసీఎంగా ఎవరిని ఎన్నుకున్నా ప్రధాని నరేంద్రమోడీ అమెరికా పర్యటన ముగించుకుని వచ్చాకే ప్రమాణస్వీకారం ఉంటుందని బిజెపి హైకమాండ్ చెపుతోంది. ఈలోపు కొత్తనేతను ఎంపికచేయడం, కేబినెట్ బెర్త్‌లకు సీనియర్లు జూనియర్ల ఎంపిక వంటివి కూడా పూర్తి చేస్తారని సమాచారం.



## ప్రజల కోసం పనిచేయండి..

### ఎన్నికైన ఎమ్మెల్యేలతో కేజ్రీవాల్ సమీక్ష

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:** అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీనుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలతో ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సమావేశం అయ్యారు. ఢిల్లీలోని ఫిరోజ్‌షారోడ్‌లోని తన నివాసంలోజరిగిన భేటీలో ప్రజలకోసం పని చేయాలని వారికి సూచించారు. ఈ సమావేశంలో అతిశీతోపాటు 22 మంది ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. భేటీ అనంతరం అతిశి మీడియాతో మాట్లాడారు. బిజెపి ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ఆప్ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను పోషిస్తుందని అన్నారు. ప్రజలకోసం పనిచేస్తూ వారి సమస్యల్ని పరిష్కరిస్తామన్నారు. ఎన్నికల్లో బిజెపి ఇచ్చిన హామీలను అమలుచేసేలా పని చేస్తామన్నారు. మార్చి 8 నాటికి మహిళలకు నెలకు రూ.2500 చెల్లించేలా చూస్తామని, 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం, ప్రజలకు ఇతర మౌలిక సౌకర్యాలు అందేలా చూస్తామన్నారు. గడచిన పదేళ్లలో ఆప్ సర్కారు అందించిన ఉచిత సేవల్ని నిలిపివేయకుండా ప్రజలకుఅండగా నిలబడతామని అతిశి అన్నారు. అయితే ఆప్ శాసనసభా పక్ష నేత ఎవరనేది తదరుపరి సమావేశంలో ఎన్నుకోవడం జరుగుతుందని మాజీ సీఎం చెప్పారు.

## కేంద్రప్రభుత్వం ఓపెన్ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతోంది

### తమిళనాడు సిఎం స్టాలిన్ ఆరోపణ



**చెన్నై, ఫిబ్రవరి 9:** బిజెపి నేతృత్వంలోని కేంద్ర సర్కార్‌పై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఓపెన్ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతోందని మండిపడ్డారు. జాతీయ విద్యావిధానాన్ని తిరస్కరించినందుకు ప్రతీకారంగా రాష్ట్రానికి రావాల్సిన రూ.వేల కోట్ల నిధులను వేరేవాటికి మళ్లించారంటూ ఎక్స్ వేదికగా ఆరోపణలు చేశారు. తమిళనాడు విషయంలో కేంద్ర ప్రభుత్వ అన్యాయాలకు హద్దుల్లేకుండా పోతోంది. జాతీయవిద్యావిధానాన్ని, త్రిభాషా సూత్రాన్ని వ్యతిరేకించినందుకు బహిరంగ బెదిరింపులకు పాల్పడుతోంది. తమిళనాడు విద్యార్థులకు ఉద్దేశించిన రూ.2152 కోట్లను ఇతర రాష్ట్రాలకు మళ్లించింది. మాపై జులుం ప్రదర్శిస్తోంది. హక్కుల కోసం నిలబడినందుకు విద్యార్థులను శిక్షిస్తోంది. దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం కూడా ఒక రాష్ట్రంపై రాజకీయ ప్రతీకారం కోసం విద్యను అడ్డుకునేంత క్రూరంగా వ్యవహరించలేదు. తమిళనాడు, ఇక్కడి ప్రజల విషయంలో ద్వేషం, అన్యాయాలకు ప్రతిరూపంగా బిజెపి మరోసారి తనను తాను నిరూపించుకుంది అని స్టాలిన్ విమర్శలు గుప్పించారు. మహాకుంభమేళాలో సరైన ఏర్పాట్లు చేయకపోవడంతోనే తొక్కిసలాట జరిగిందని సిఎం స్టాలిన్ ఆరోపించారు. 30 మందే మృతి చెందినట్లు ప్రభుత్వం వెల్లడించినా ఈ సంఖ్య మరింత ఎక్కువ ఉంటుందని స్థానిక నేతలే చెబుతున్నారన్నారు. అక్రమ వలసదారులను వెనక్కి పంపుతున్న అమెరికా ఆ క్రమంలో వారికి సంకెళ్లు వేయడాన్ని క్రూరమైన చర్యగా పేర్కొంటూ వారి కష్టాలు కన్నీళ్లు తెప్పించాయన్నారు. దీనిపై అమెరికాతో చర్చించాల్సిన విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ సైతం ఆ దేశ చర్యలను సమర్థించే విధంగా వివరణ ఇచ్చారని విమర్శించారు.

## బంగ్లాదేశ్‌లో ఆపరేషన్ డెవిల్స్ హంట్..



**ఢాకా, ఫిబ్రవరి 9:** బంగ్లాదేశ్‌లో యూనస్ సర్కారు తాజాగా ప్రత్యర్థులను వేధించేందుకు సరికొత్త చర్యలు మొదలుపెట్టింది. మాజీ ప్రధాని షేక్ హసీనా మద్దతుదారులపై ఆపరేషన్ డెవిల్స్ హంట్ పేరిట దాడులు మొదలు పెట్టింది. కొన్ని ఆందోళనలపై ఇటీవల స్థానిక గ్యాంగులు దాడులు చేశాయి. ఈ నేపథ్యంలో చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం పేర్కొంది. గత నిరంకుశ పాలకులకు చెందిన గ్యాంగ్‌లు కొన్ని విద్యార్థి బృందాలపై దాడులు చేసినట్లు ఆరోపించింది. ఇంటీరియర్ మినిస్ట్రీ అధిపతి జహంగీర్ ఆలమ్ చౌద్రీ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో విద్యార్థి ఉద్యమం తర్వాత చేపట్టిన ఈ దాడులను ఆపరేషన్ డెవిల్స్ హంట్‌గా వ్యవహరిస్తున్నారు. దుష్టశక్తులను అంతం చేసేవరకు ఇది కొనసాగుతుందన్నారు. బుధ వారం షేక్ హసీనా కుటుంబ భవనాలపై కొం దరు దాడులు చేసి ధ్వంసం చేశారు. ఈ క్రమం లో బంగబంధు షేక్ ముజిబుర్ రహ్మాన్ స్మారక భవనంపై దాడి చేశారు. ఈ దాడిలో భవనం పూర్తిగా దెబ్బతిని, మ్యూజియం కూడా ధ్వంసమైంది. ఈ నేపథ్యంలో ప్రజలు సంయమనంతో వ్యవహరించాలని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేత మహమ్మద్ యూనస్ కూడా విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఓ మంత్రిపై దాడికి ఈ గ్యాంగ్‌లే కారణమని సమాచారం.

ఆపరేషన్ డెవిల్స్ హంట్‌ను గాజీపుర్‌లో మొదలుపెట్టి దేశం మొత్తం అమలు చేస్తామని హోం మంత్రిత్వశాఖ పేర్కొంది. ప్రజల భద్రతలో భాగంగానే దీనిని అమలు చేస్తామని వెల్లడించింది. దీనికి సంబంధించిన అదనపు వివరాలను లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు ఆదివారం వెల్లడిస్తాయని తెలిపింది.


## హత్యకేసు ఖైదీని విడుదల చేయాలని రాష్ట్రపతి పేరిట బోగస్ లేఖ

### సహారాన్‌పూర్ జైలు అధికారుల దర్యాప్తు



**సహారాన్‌పూర్(యుపి), ఫిబ్రవరి 9:** ఒక హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీని విడుదల చేయాలంటూ రాష్ట్రపతి ద్రౌపదిముర్ము పేరిట ఒక లేఖ జిల్లా జైలు అధికారులకు రావడంపై ఇపుడు అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ సంఘటనపై జిల్లా జైలు అధికారులు పోలీసులకు ఫిర్యాదులుచేయడంతో జనక్‌పురి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదుచేసారు. సీనియర్‌జైలు సూపరింటెండెంట్ సత్యప్రకాష్ ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. అయితే ఈ ఉత్తర్వులు బోగస్ అని రాష్ట్రపతి పేరును దుర్వినియోగంచేస్తూ ఈ లేఖలు విడుదలచేసారని తేలింది. బోగస్ ఉత్తర్వులను జారీచేసి ఖైదీ అజయ్‌ను విడుదలచేయాలని రాసారనితేలింది. ఈ లేఖలో రాసిన ఖైదీ అజయ్ హత్యకేసులో నిందితుడని జైలు అధికారులు వివరించారు. ప్రెసిడెంట్స్ కోర్టు పేరిట వచ్చిన ఈలేఖను ముందు అధికారులు అను మానించారు. పరిశీలన తర్వాత రాష్ట్రపతి భవన్‌లో ఇలాంటి కోర్టులనేవి ఉండనే ఉండవని చెప్పారని సత్యప్రకాష్ చెప్పారు. కొందరు బోగస్ వ్యక్తులు అధికారులను తప్పుదారి పట్టించేందుకు ఇలా నకిలీ ఉత్తర్వులు జారీచేసారన్నారు. ఈ లేఖను తీవ్రంగా పరిగణించిన జైలు అధికారులు పోలీసులకు తెలిపారు. ఇందుకు సంబంధించి జనక్‌పురి పోలీస్‌స్టేషన్‌లో కేసునమోదుచేసారు. గుర్తుతెలీని వ్యక్తులు రాసిన లేఖగా నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ అధికారులు తెలిపారు.

## నమీబియా జాతిపిత సామ్‌నుజోమా కన్నుమూత



**విండ్‌హాక్(నమీబియా), ఫిబ్రవరి 9:** స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత నమీబియాకు మొట్టమొదటి అధ్యక్షుడుగా పనిచేసిన సామ్‌నుజోమా 95యేట కన్నుమూసారు. రాజధాని విండ్‌హాక్‌లోనే ఆయన తుదిశ్వాస విడిచనట్లు ప్రభుత్వం ప్రకటించింది. దక్షిణాఫ్రికానుంచి స్వాతంత్ర్యం సాధించేందుకు నుజోమా సుదీర్ఘకాలం పాటు స్వాతంత్ర్యోద్యమం నడిపారు. 1990లో స్వాతంత్ర్యం కోసం అని నమీబియా విముక్తి పోరాటాన్ని ప్రారంభించారు. ఈ పోరాటాన్నే వాయవ్య ప్రజానీకం సంస్థ(సౌత్‌వెస్ట్‌పీపుల్స్ ఆర్గనైజేషన్ స్వాపో)స్థాపించి పోరాటాన్ని కొనసాగించారు. స్వాతంత్ర్యం తర్వాత నుజోమా 1990నుంచి 2005 వరకూ దేశ అధ్యక్షుడుగా కొనసాగారు. గడచిన మూడు వారాలుగా నుజోమా అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రిలో చేరారు. చికిత్సపొందుతూనే కోలుకోలేకపోవడంతో ఆయన తుదిశ్వాస విడిచారని ప్రస్తుత నమీబియా అధనయక్షుడు నాంగోలో ఎంముంబా ఒక ప్రకటన విడుదలచేసారు. నమీబియాకు జాతిపిత అని ఆయన అందించిన సేవలు నేటితరం, భావితరానికి స్ఫూర్తిదాయకమని ప్రస్తుత అధ్యక్షుడు ప్రకటించారు. 2005లో పదవినుంచి దిగిపోయినాకూడా పార్టీని నడిపించారు. 2007వరకూ నడిపించిన అధికార స్వాపో పార్టీకి చీఫ్‌గా వ్యవహరించారు. నుజోమా భార్య కోవాంబో తియోపోల్డిన్ కాట్జిమునేకు కూడా 91 ఏళ్లు. ప్రస్తుత అధ్యక్షుడు ఎంబుంబా నుజోమా నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. దక్షిణాఫ్రికానుంచి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత దేశంలో శాంతిసుస్థిరతను నెలకొల్పేందుకు విశేషకృషి చేసారు. 1990వరకూ దక్షిణాఫ్రికాలో మైనార్టీ శ్వేతజాతీయుల పాలనలోనే నమీబియాకూడా మగ్గిపోయింది. మహిళలు, చిన్నారుల హక్కులు విశేషకృషి చేసారు. పెళ్లికిముందు జన్మించిన శిశువులకోసం తల్లితండ్రులకు మెయింటెనెన్స్ అలవెన్సులు ఇచ్చే విధానం తీసుకువచ్చారు. నమీబియా ఉపాధ్యక్షుడు నెటుంబో నందిఎన్‌డైట్‌వాహ్ వచ్చే మార్చిలో అధ్యక్షుడు కాబోతున్నారు. ఈ సందర్భంగా ఆయన కూడా మాట్లాడుతూ దేశవిముక్తిపోరాటంలో నుజోమా సేవలు ఎన్నితరాలయినాసరే విస్మరించలేమని పేర్కొన్నారు. కాగా నుజోమా మృతికి ఆఫ్రికన్‌యూనియన్ కమిషన్ ఛైర్మన్‌మౌస్సా ఫకీ మహ్మద్ నమీబియాకు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు సంపాదించిన జాతిపిత మనకు లేకపోవడం దురదృష్టకమన్నారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రాంఫోసా మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో మడమ తిప్పని వీరుడు నుజోమా అని కొనియాడారు. 1994లో అప్పటివరకూ దక్షిణాఫ్రికాలో ఉన్న శ్వేతజాతి పాలన ముగింపు కోసం అవిరళకృషి చేసిన వారిలో నుజోమా కూడా ఉన్నారని ఆయన అన్నారు. కెన్యా అధ్యక్షుడు విలియమ్ రూటో మాట్లాడుతూ ఒక విశాల ధృక్పథం కలిగిన నాయకుడు లేకుండా పోయారని, ఆయన జీవితం మొత్తం నమీబియా అభివృద్ధికే ధారపోసారని అన్నారు.

## రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్న బిజెపి

### కాంగ్రెస్ ఎంపి ప్రియాంకగాంధీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:** దేశచరిత్రలో తొలిసారిగా కేంద్ర ప్రభుత్వంలోని బిజెపి రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తుందని కాంగ్రెస్ ఎంపి ప్రియాంక ఆరోపించారు. వయనాడ్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పార్టీ బూత్ స్థాయి నాయకులను ఉద్దేశిస్తూ మాట్లాడిన సమయంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే పనిలో మన కేంద్రం ఉంది. ఇది దేశ చరిత్రలోనే తొలిసారి. ప్రస్తుతం మనం చేస్తున్న పోరాటం మన సొంత రాజకీయాల కోసం కాదు. దేశ రక్షణ కోసమని మీరు గుర్తుంచుకోవాలి అని అమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మానవ, జంతు సంఘర్షణలను గురించి ప్రస్తావించారు. ఈ సమస్య పరిష్కారమయ్యేందుకు చర్యలు తీసుకుంటాను. ఈ అంశాన్ని ఇప్పటికే అనేక సార్లు లెవనెత్తా. మెరుగైన భద్రతా చర్యల కోసం నిధులు చాలా కీలకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వాటిని రాబట్టడం చాలా కష్టంగా ఉంది అని ప్రియాంక తెలిపారు. ఇక నిధుల కేటాయింపుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తాను లేఖ రాస్తానని వెల్లడించారు.

## సర్పంచ్ హక్కులు ఓ వ్యక్తికి అప్పగింత

### స్టాంప్ పేపర్‌పై ఒప్పందం!

**భోపాల్, ఫిబ్రవరి 9:** ఒక మహిళా సర్పంచ్ ఆ హక్కులను ఒక వ్యక్తికి అప్పగించారు. ఇకపై సర్పంచ్ అధికారాన్ని ఆ గ్రామస్తుడు నిర్వహిస్తాడని పేర్కొంది. దీనికి సంబంధించిన ఒప్పందం గురించి స్టాంప్ పేపర్‌పై వారిద్దరూ సంతకాలు చేశారు. ఈ విషయం తెలిసిన అధికారులు ఆ మహిళా సర్పంచ్‌కు నోటీసు జారీ చేశారు. మధ్యప్రదేశ్‌లోని నీముచ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మానస జనపద్ పరిధిలోని దాతా గ్రామానికి చెందిన కాలాషిబాయి కచావా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. కాగా, అదే గ్రామానికి చెందిన సురేష్ గరాసియాకు తన సర్పంచ్ హక్కులను కైలాషిబాయి అప్పగించారు. గత నెల 24న వీరిద్దరి మధ్య ఈ మేరకు ఒప్పందం కుదిరింది. సాక్షుల సమక్షంలో రూ. 500 స్టాంప్ పేపర్‌పై సంతకాలు చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, వాటర్‌షెడ్ మిషన్ మొదలైన పథకాల పనులను ఇకపై సర్పంచ్‌గా సురేష్ నిర్వహిస్తాడని అందులో పేర్కొన్నారు. అలాగే సర్పంచ్ విధుల్లో తాను జోక్యం చేసుకోబోనని, అవసరమైన సంతకాలు తాను చేస్తానని కైలాషిబాయి హామీ ఇచ్చారు. ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించిన వ్యక్తి నాలుగు రెట్లు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని ఆ బాండ్‌లో పేర్కొన్నారు. అయితే ఎంత మొత్తం చెల్లించాలన్నది అందులో ప్రస్తావించలేదు. మరోవైపు మహిళా సర్పంచ్ కైలాషిబాయి తన అధికారాలు, హక్కులను సురేష్‌కు అప్పగించిన అంశంతోపాటు ఒప్పందం చేసుకున్న స్టాంప్‌పేపర్ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో జిల్లా పంచాయతీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) అమర్ వైష్ణవ్ దీనిపై స్పందించారు. పంచాయతీరాజ్




చట్టంలోని సెక్షన్ 40 కింద ఆ మహిళా సర్పంచ్ తొలగింపు కోసం నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శికి కూడా షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు చెప్పారు. వారి వివరణ తెలుసుకున్న తర్వాత చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## అణ్వాయుధ తయారీని మరింత బలోపేతంచేయాలి

### అధికారులకు కిమ్ ఆదేశాలు



**ప్యాంగ్యాంగ్(ఉత్తరకొరియా), ఫిబ్రవరి 9:** అణ్వాయుధాల తయారీని మరింత బలోపేతం చేయాలని ఉత్తరకొరియా నియంత అధ్యక్షుడు కిమ్‌జాంగ్ ఉన్ తన అధికారులను ఆదేశించారు. కిమ్ ఇలాంట ఇఉత్తర్వులను గతంలో కూడా అనేకసార్లు జారీచేసారు. అయితే జపాన్‌ప్రధాని ఇషిబా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌లమధ్య తాజాగా ద్వైపాక్షిక బేటీ జరిగిన నేపథ్యంలోనే కిమ్ ఈ ఆదేశాలు జారీచేసినట్లు తెలుస్తోంది. జనవవారం కొరియన్‌పీపుల్స్ ఆర్మీ 77వ వ్యవస్థాపక దినోత్సవంలో కిమ్ పాల్గొని మాట్లాడారు. న్యూక్లియర్‌ఫోర్స్ సహా ప్రత్యర్థులను భయపెట్టే అన్ని రకాల ప్లాన్లను బలోపేతంచేయాలి. అత్యాధునిక అణ్వాయుధాల అభివ1ద్ధికి పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నామని కిమ్ తెలిపారు. ఈ సందర్భంగా రష్యాకు తన మద్దతును పునరుద్ఘాటించారు. మాస్కో ప్రజలు దళాలు వారి దేశ సార్వభౌమాధికారం భద్రత ప్రాదేశికతను కాపాడుకునేందుకు కృషిచేస్తున్నాయని ఆయన అన్నారు. ట్రంప్ అధికారంలో ఉన్న సమయంలో కిమ్‌పరంగా కొనిన సందర్భాల్లో కలిసి ఉన్నా మరికొన్ని సార్లు చూసీచూడనట్లు వ్యవహరించారు. 2019లో వియత్నాంలోజరిగిన బేటీలో అణ్వాయుధాలు వదిలేసే విషయంలో ఉత్తరకొరియా వెనక్కి తగ్గలేదు. దీనితో నాటిచర్చలు విఫలం అయ్యాయి. బైడెన్ అధికారంలోకి వచ్చాక ఇరు దేశాలమధ్య దూరం మరింతపెరిగింది. మరోవైపు దక్షిణకొరియా జపాన్‌లతో ప్యాంగ్యాంగ్ సంబందాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గత ఏడాది వరుసగా క్షిపణి పరీక్షలుచేసిన కిమ్ కవ్వింపు చర్యలకు కూడా దిగారు. దక్షిణకొరియా తమకు శతృదేశమని ప్రకటించిన కిమ్ ఆదేశంపైకి చెత్తబెలూన్లను వదిలారు. సరిహద్దు రోడ్లను బాంబులుపెట్టి పేల్చివేసి సంబంధాలను పూర్తిగాతెంచేసారు. తమపై దాడికి పాల్పడితే ఎదుర్కొనడానికి అణ్వాయుధాలు సిద్ధంగా ఉనాననయని హెచ్చరించిన కిమ్ ఇపుడు అణ్వాయుధ తయారీలో మరింత వేగం పెంచాలని అధికారులను ఆదేశించడాన్ని ప్రపంచదేశాలను కలవరపెడుతోంది.



## హమాస్ చెర నుంచి విడుదలై భార్యాపిల్లలను చూడాలని వస్తే..

**టెల్అవీవ్, ఫిబ్రవరి 9:** హమాస్ తన వద్ద ఉన్న మరో ముగ్గురు ఇజ్రాయెలీ బందీలను శనివారం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఎల్ షరాబి (52), ఒహాద్ బెన్ అమి (56), ఓర్‌లెవీ (34)లను శనివారం రెడ్‌క్రాస్‌కు అప్పగించింది. ప్రతిగా ఇజ్రాయెల్ 183 మంది పాలస్తీనా ఖైదీలను విడిచిపెట్టింది. కాగా హమాస్ చెరలో 491 రోజులు బందీగా చిత్రహింసలు అనుభవించిన ఎల్ షరాబి ఇన్ని రోజులకు తన కుటుంబాన్ని కలుస్తున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. తన భార్యాపిల్లలు తనకు ఘనంగా స్వాగతం పలుకుతారని వేయి కళ్లతో ఎదురు చూస్తున్నాడు. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేసిన సమయంలో తాను బందీగా మారినా తన కుటుంబం ఎక్కడో ఒకచోట సురక్షితంగా ఉండి ఉంటుందని.. తన కోసం ఎదురుచూస్తున్న వారిని వెంటనే కలిసేలా సహాయం చేయాలని ఇజ్రాయెల్ అధికారులను కోరాడు. అయితే ఆ రోజు హమాస్ దాడిలో అతడి భార్య లియాన్, కుమార్తెలు నోయా (16), యాహెల్ (13) ప్రాణాలు కోల్పోయారని తనను ప్రాణంగా ప్రేమించే వారిని ఇక ఎప్పటికీ కలవలేడనే విషయం అతడికి తెలియదు. తనతోపాటు బందీ అయిన తన సోదరుడి మరణవార్త మాత్రం అధికారులు అతడికి తెలియజేశారు. ఎల్ షరాబిను అతడి తల్లి, సోదరులకు అప్పగించారు. తన భార్యాపిల్లలను ఇంకెప్పుడూ కలవలేడనే విషయాన్ని తన సోదరుడికి ఎలా చెప్పాలని షరాబి సోదరుడు షారోన్ ఆవేదన వ్యక్తం చేశాడు.

గాజా కాల్పుల విరమణ ఒప్పందం ప్రారంభమైనప్పటి నుంచి ఇజ్రాయెల్‌- హమాస్ మధ్య జరిగిన ఐదో మార్పిడి ఇది. ఒప్పందం తొలిదశలో భాగంగా హమాస్ 33 మంది బందీలను, ఇజ్రాయెల్ దాదాపు 1,800 పైగా పాలస్తీనా ఖైదీలను విడిచిపెట్టనుంది.

## వలసదారులను అరెస్టుచేస్తే జైళ్లు సరిపోతాయా?

### అమెరికాలో ఫెడరల్ అధికారులను వేధిస్తున్న ప్రశ్నలు



**న్యూయార్క్, ఫిబ్రవరి 9:** అమెరికాలో అరెస్టు చేస్తున్న అక్రమ వలసదారుల్లో కొందరిని ఫెడరల్ ప్రభుత్వం జైళ్లకు పంపిస్తోంది. అక్కడ వారికి సరైన వసతులు ఉండవని, లైంగిక దాడులు జరుగుతాయని, మతాచారాలకు విరుద్ధమైన ఆహారం ఇస్తారన్న భయాలు పెరుగుతున్నాయి. డొనాల్డ్‌ట్రంప్ తొలిసారి అధ్యక్షుడుగా ఉన్నపుడు ఇలాంటివేజరిగాయని ఆందోళనలు పెరిగాయి. అమెరికాలో 1.17 కోట్లమంది అక్రమ వలసదారులున్నట్లు అంచనా. వారిలో కేవలం 41 వేలమందిని మాత్రమే నిర్భంధిచే శక్తి అమెరికా వలసల వ్యవహారాలు కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఉంది. ఫెడరల్ న్యాయ శాఖపరిధిలోకి వచ్చే బ్యూరో ఆఫ్‌ప్రిజన్స్‌కు 122 కారాగారాలు ఉండగా వాటిలో 1.55 లక్షలమంది ఖైదీలను నిర్బంధించారు. 30వేల మంది సిబ్బందికలిగిన ఈ బ్యూరో వార్షిక బడ్జెట్ 800 కోట్ల డాలర్లు, లక్షలమంది అనక్రమ వలసదారులను నిర్బంధించడానికి కావలిసిన జైళ్లు అమెరికాలో లేవనేది తెలిసిందే. ట్రంప్ గతనెల 20న ప్రమాణస్వీకారం చేసినప్పటినుంచి 8వేల మందిని అరెస్టుచేసినా వారిలో 461 మందిని చోటుచాలకపోవడం, వైద్యకారణలవాల్ల విడిచిపెట్టారు. మరోవైపు బాగా తక్కువ రుసుముకు వలసఖైదీలను తమ దేశంలోని సువిశాల సెకాట్‌జైలులో నిర్బంధిస్తానని ఎల్‌సాల్వడార్ అధ్యక్షుడు నయీబ్ బుకేలే సిద్ధం అయ్యారు. అది చట్టపరంగా సాధ్యమో కాదో పరిశీలిస్తామని ట్రంప్ అన్నారు.

## కల్కాజీ నుంచి గెలుపొందిన అతిశీ డ్యాన్స్..

### సిగ్గుచేటంటూ ఎద్దేవా చేసిన స్వాతి మలివాల్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పరాజయం పాలైన విషయం తెలిసిందే. అయితే కల్కాజీ స్థానం నుంచి విజయం సాధించిన అనంతరం ఢిల్లీ సిఎం అతిశీ పార్టీ కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా నృత్యం చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ గామారింది. రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్ దీనిపై స్పందిస్తూ ఆప్ ఘోర పరాజయం పొంది, సీనియర్ నాయకులంతా ఓడిపోతే అతిశీ తనకేమీ పట్టనట్లు సంబరాలు చేసుకుంటున్నారన్నారు. పార్టీ అధికారాన్ని కోల్పోయి, అధినేత కేజ్రీవాల్ కుమిలిపోతుంటే భవిష్యత్తు గురించి ఆమెకు ఎలాంటి బాధాలేదని విమర్శించారు. ఇది సిగ్గు పడాల్సిన విషయమని దుయ్యబట్టారు. ఆప్ నేతల పాలనా వైఫల్యాలు, కుంభకోణాల ఆరోపణలు, యమునా నది కాలుష్యం మొదలైన వాటితో అధికార ఆమ్ ఆద్మీ ఢిల్లీ ఎన్నికల్లో పరాజయం పాలైంది. పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సహా పలువురు సీనియర్ నాయకులు ఓడిపోయారు. కాగా, ఢిల్లీ సిఎం అతిశీ మాత్రం విజయం సాధించారు.



# వైభవంగా కాళేశ్వర మహాకుంభాభిషేక మహోత్సవం

### పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్

### వీక్షించి తరించిన భక్తజనం.. శివనామ స్మరణతో మార్మోగిన దేవాలయ ప్రాంగణం

**ప్రభాతవార్త, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో:** దక్షిణకాశిగా పేరుగాంచిన కాళేశ్వరముక్తేశ్వరస్వామి ఆలయంలో మహాకుంభాభిషేక మహోత్స వ మహా ఘట్టం ఆదివారం ఘనంగా జరిగింది. 42 సంవత్సరాల తర్వాత మహా కుంభాభిషేక మహాక్రతువుకు ఈ ఆలయం వేదికయింది. గంగా యమునా సరస్వతి సంగమైన ప్రయాగరాజ్‌లో మహాకుంభమేళా జరుగుతున్న తరుణంలోనే కాళేశ్వరంలో త్రివేణి సంగమంలో మహాకుంభాభిషేక ఘట్టం ఆవి ష్కృతమైంది. ఆదివారం ఉదయం 10:42 సుముహూర్తాన మహా కుంభాభిషేక ఘట్టానికి రుత్వికులు శ్రీకారంచుట్టారు. 7 నుండి 9వ తేదీ వరకు మూడు రోజులపాటు జరిగిన క్రతువులో 3వరోజు కుంభాభిషేక మహోత్స వ ఘట్టంలో భాగంగా విశేష పూజలు చేశారు. శతచండీ పారా యణం, సహస్రఘటాభిషేకం తదితర ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రీకాళేశ్వర ముక్తేశ్వరస్వామివారికి సహస్ర ఘటాలతో విశేషఅభిషేకాన్ని ఘనంగా జరిపారు. ఉదయం 10 గంటల 42 నిమిషాలకు వేదపండితులు మంత్రోచ్ఛారణ మధ్య శృంగేరి పీఠం తపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతిచే కుంబాభిషేక మహోత్స వం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తోపాటు అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు హాజరయ్యారు. ముందుగా ఆలయఅర్చకులు పూర్ణకుంభస్వాగతం పలికారు. అనంతరం కాళేశ్వర ముక్తేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆల యంలో విశేషపూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు తగు ఏర్పాట్లు చేపట్టారు.

# పాఠశాల నుంచి ఆలస్యంగా వచ్చాడని తీవ్రంగా కొట్టిన తండ్రి

### ఆపస్మారకస్థితిలోకి వెళ్లిన కొడుకు మృతి

**చౌటుప్పల్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** పాఠశాల నుంచి ఆలస్యంగా ఇంటికి వచ్చాడన్న అక్కసుతో కొడుకును కన్న తండ్రి చావ బాదిన సంఘటన చౌటుప్పల్ మండలం ఆరెగూడెంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఆరెగూడెంకు చెందిన కట్ట సైదులు కుటుంబ సభ్యులతో కలిసి పట్టణంలోని బంగారిగడ్డ ప్రాంతంలో ఇంటి నిర్మాణం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య నాగమణితో పాటు ముగ్గురు కుమారులు కలరు. చిన్న కుమారుడు కట్ట భానుప్రసాద్(14) స్థానిక అన్నా మెమోరియల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాల వార్షికోత్స వం కావడంతో ఇంటికి ఆలస్యంగా వచ్చాడు. అప్పటికే వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన తండ్రి సైదులు మద్యం మత్తులో తూలియాడుతూ ఆలస్యంగా వచ్చాడని కొడుకుని చావ బాదాడు. దెబ్బలను భరించలేక బయటికి వెళ్లిపోయిన కుమారుడు కొద్ది సేపటి తర్వాత తండ్రి కోపం తగ్గిందని తిరిగి ఇంటికి వచ్చాడు. తిరిగి మళ్లీ కొట్టడంతో ఆపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఇది గమనించి వెంటనే చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆసత్రిలో ఉన్న వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ఆరెగూడెంకు తరలించారు. అదే రాత్రి అంత్యక్రియలను నిర్వహించేందుకు స్మాశాన వాటికకు వెళ్లిన తర్వాత విషయం తెలుసుకున్న పోలీసులు అంత్యక్రియలను ఆడ్డుకున్నారు. తండ్రి కొట్టడంతోనే భానుప్రసాద్ మృతి చెందాడని సామాజిక మాద్యవాల ద్వారా తెలుసుకున్న పోలీసులు చౌటుప్పల్ ఎసిపి పటోళ్ల మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇన్స్‌పెక్టర్ మన్మదకుమార్ గ్రామస్తులు, కుటుంబ సభ్యులను ఒప్పంచి పోస్టుమార్టంకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. శనికావేశంతో తండ్రి కొట్టడంతోనే చేతికి అందివచ్చిన కొడుకు మృతి చెందాడన్న విషయం ఆరెగూడెంలో దావహానంలా వ్యాపించడంతో తండోపతండాలుగా ప్రజలు మృతుని నివాసానికి చేరుకున్నారు. మృతుని తల్లి రోధనలను చూసి ప్రతి ఒక్కరు కన్నీళ్ల పర్యాంతమయ్యారు. పోస్టుమార్టం అనంతరం ఆదివారం ఆరెగూడెం గ్రామంలో అశ్రునయనాల మధ్య భానుప్రసాద్ అంత్యక్రియలు ముగిశాయి. కాగా మృతుని తల్లి నాగమణి ఫిర్యాదే మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఇన్స్‌పెక్టర్ మన్మదకుమార్ తెలిపారు

# పాత ఎంపిడిఓ కార్యాలయంలో అగ్నిప్రమాదం

### మంటల్లో దగ్ధమైన పాతదస్త్రాలు

**బిజినేపల్లి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని పాత ఎంపీడీవో కార్యాలయం (ఒకప్పటి బ్లాక్ కార్యాలయం)లో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సాయంత్రం వేళ నిప్పు అంటుకొని పాత భవనం లోపలి నుండి పెద్ద ఎత్తున మంటలు చెలరేగడాన్ని అటుగా వెళ్ళిన స్థానికులు గమనించి పోలీసులకు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఎస్ఐ కె.శ్రీనివాస్ సమాచారంతో అగ్నిమాపక శాఖ అధికారులు వెంటనే మంటలను అర్పివేసి మరింత నష్టం జరగకుండా మంటలను ఆర్పి నివారించారు. మంటలు పూర్తిస్థాయిలో ఆర్పి క్రమంలో కాలి బూడిదైన శవం కనిపించడంతో భయాందోళన గురై తిరిగి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై మంటల్లో కాలి బూడిదైన శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన షార్ట్ సర్క్యూట్‌తో లేక ప్రమాదవశాత్తు జరిగిందా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ సుదీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

# హెచ్‌సిటీ ప్రాజెక్టు పనులు ప్రయోజనం కలిగేలా తీర్చిదిద్దాలి

### పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎం దానకిషోర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** హెచ్‌సిటి కింద చేపట్టిన ప్రతి ప్రాజెక్టును ట్రాఫిక్ ఇబ్బందులు దూరం చేసేలా, ప్రజలకు అధిక ప్రయోజనం, సౌకర్యం కలిగేలా తీర్చిదిద్దాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దానకిషోర్ జిహెచ్‌ఎంసి అధికారులకు సూచించారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్ ఫార్మేటివ్ ప్రాజెక్ట్ (హెచ్ సిటీ) పనులపై రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దాన కిషోర్ జిహెచ్‌ఎంసి కమిషనర్ డాక్టర్ ఇలంబర్తి, అదనపు కమిషనర్‌లు, జోనల్ కమిషనర్‌లు, ఎస్‌ఈ, ఈఈ, సిటి ప్లానర్‌లతో ఆదివారం సచివాలయం నుండి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. హెచ్‌సిటీ ప్రాజెక్టుతో హైదరాబాద్ నగరానికి ప్రధాన సమస్యగా మారిన రహదారులను పెద్ద ఎత్తున ప్రభుత్వం బాగుచేస్తుంది. గ్రేటర్ హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలను తీర్చడం, వరద ముంపును తప్పించేలా నగరం నలుమూలలా ఫ్లైవంతెనలు, అండర్ పాస్‌లు, ఆర్‌యుబి, ఆర్‌ఓబిలను రూ. 7,300 కోట్ల రూపాయలతో 50 పనులను హెచ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మూ డు దశల్లో నిర్మిస్తుందన్నారు. మొదటి విడతలో 2100 కోట్లతో పనులు చేపట్టిందన్నారు. ఈ పనులపై శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమగ్ర సమీక్ష నిర్వహించిన తర్వాత పలు కీలక సూచనలు చేశారని చెప్పారు. ఈ ప్రాజెక్టులో చేపట్టిన పనులు ప్రజలకు సౌకర్యవంతంగా, అధిక ప్రయోజనకరంగా ఉండాలన్నారు.

సిఎం ఆలోచనలు, ఆదేశాలకు అనుగుణంగా జిహెచ్‌ఎంసి కమిషనర్, అదనపు కమిషనర్‌లు, జోనల్ కమిషనర్‌లు, ఎస్‌ఈ, ఈఈ, సిటి ప్లానర్‌లు బృందాలుగా ఏర్పడి గ్రేటర్ హైదరాబాద్‌లో చేపట్టిన హెచ్ సిటి ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన ఫ్లై ఓవర్‌లు, రోడ్డు విస్తరణ,అభివృద్ధి సహా అన్ని పనులను క్షేత్ర స్థాయిలో పర్యటించి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని ముఖ్య కార్యదర్శి ఆదేశించారు. ఒక్కో జోన్‌కు అదనపు కమిషనర్ గానీ జోనల్ కమిషనర్ నేతృత్వంలో క్షేత్ర పరిశీలన జరగాలన్నారు. హెచ్ సిటి ప్రాజెక్టు కింద చేపట్టిన ప్రతి ప్రాజెక్టు ప్రజలకు మరింత అధిక ప్రయోజనకరంగా మార్చేందుకు, ట్రాఫిక్ ఇబ్బందులను దూరం చేసేందుకు ఏమైనా మార్పులు, చేర్పులు చేయాల్సి ఉంటే సలహాలు, సూచనలు లిఖిత పూర్వకంగా వెంటనే అందజేయాలని అధికారులకు ముఖ్య కార్యదర్శి అధికారులను ఆదేశించారు.

# షరతుల్లేకుండా కంది పంటను కొనుగోలుచేసి మద్దతు ధరకు అందించాలి

### సన్నవడ్ల బకాయి బోనస్ డబ్బులు రూ. 432 కోట్లు చెల్లించాలి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



మీడియాతో మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల సమయం లో వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట చేత గానీ అనేక హామీలు ఇచ్చి అధికారం లోకి రాగానే తుంగలో తొక్కుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు తీవ్ర స్థాయిలో మండి పడ్డారు.

సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సన్న వడ్లకు 48 గంటల్లో రూ.500 బోనస్ డబ్బులు చెల్లిస్తామని చెప్పి 48 రోజులైనా రైతుల ఖాతాలతో జమ చేయలేదన్నారు. సన్న వడ్లు అమ్ముకున్న రైతులకు రూ.432 కోట్ల బోనస్ డబ్బులు ప్రభుత్వం బకాయి పడిందన్నారు. సన్న వడ్ల బోనస్ డబ్బులు వెంటనే విడుదల చేయాలని సిఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్లు తెలిపారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చీటికి మాటికి బిఆర్ఎస్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని చేతల్లో మాత్రం ఉత్తమ్‌కుమారెడ్డి మాటలు ఉత్తర కుమార ప్రగల్బాలుగానే మిగిలి పోతున్నాయన్నారు. బి ఆర్ఎస్ పాలనలో ఏనాడు రైతులను ఇబ్బం దులకు గురిచేయలేదని కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను ఇబ్బందులకు గురి చేస్తూ శఠగోపం పెడుతున్నారని మండి పడ్డారు. కాంగ్రెస్ సర్కారు మాటల కోతల సర్కార్‌గా మారిందన్నారు. కంది రైతుల నుంచి 3 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. కంది పంటకు రూ.400 బోనస్ ఇస్తామని చెప్పి మోసం చేస్తున్నారని తెలిపారు. కంది పంటను ఎకరాకు మూడు క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.కంది పంట రైతులపై ఎందుకు పగ బట్టారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కోతలు, షరతులు లేకుండా వెంటనే కంది రైతుల నుంచి పూర్తిస్థాయిలో కంది పంట కొనుగోలు చేసి రూ.7550 మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. సన్ ఫ్లవర్ సైతం కొనుగోలు చేయడానికి నేటికీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సన్‌ఫ్లవర్‌కు రూ.7280 మద్దతు ధర చెల్లించాలన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నవంబరు 30న మహబూబ్‌నగర్‌లో చెక్కు ఇస్తే ఇప్పటికి చెక్కు చెల్లని పరిస్థితి నెలకొందన్నారు. కాంగ్రెస్ పార్టీ తాను తవ్వుకున్న బావిలో తానే సమాధి అవుతుందన్నారు. రైతులను, ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్‌ను స్థానిక సంస్థల ఎన్నికల్లో గాలిలో కలపడానికి ప్రజలు సిద్దంగా ఉన్నారని తెలిపారు. బిఆర్ఎస్ హయాంలో జగమంత పాలన అందిస్తే కాంగ్రెస్ హయాంలో సగమంత పాలన అందుతుందన్నారు. సమావేశంలోఎమ్మెల్సీ డా॥యాదవరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు గుండు భూపేష్, మనోహర్‌రావు, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, కొండం సంపత్‌రెడ్డి, పూజల చిన్నా తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కారు రావాలి

### మోడీ నేతృత్వంలో స్థిరమైన, ఆర్థిక వ్యవస్థతో ముందుకెళ్తోన్న దేశం : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

### సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా దీపక్ బాధ్యతల స్వీకరణలో పాల్గొన్న కేంద్రమంత్రి

**హైదరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** దేశంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో ఉన్న సర్కారు స్థిరమైన ఆర్థిక వ్యవస్థతో దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బిజెపి సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా లంకల దీపక్ రెడ్డి బాధ్యతలు తీసుకున్న సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడారు. 27 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ విజయం సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలను విభజించి, అనేక రకాలుగా మోసపూరిత హామీలిచ్చి మభ్యపెట్టి, చివరకు లిక్కర్ కుంభకోణానికి పాల్పడ్డ ఢిల్లీ సిఎం కేజ్రీవాల్‌ను ఓడించి పాతరేశార న్నారు. దేశంలో వరుసగా అనేక రాష్ట్రాల్లో బిజెపి విజయదుందుభి మోగిస్తోందన్నారు. ఉత్తరప్రదేశ్ లో రెండోసారి, మధ్యప్రదేశ్‌లో మూడోసారి, గు జరాత్‌లో ఆరో సారి, గోవా లో మూడోసారి అధి కారంలోకి వచ్చా మన్నారు. అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని మట్టికరిపించింది, కాషాయ జెండా రెపరెపలాడించేలా నరేంద్ర మోడీ పాలన అందిస్తున్నారన్నారు. మన పక్కనున్న దేశాలు పాకిస్తాన్, బంగ్లదేశ్‌తో పాటు అమెరికా, యూకే, శ్రీలంక వంటి దేశాల్లో ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయన్నారు. ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక దేశంగా భారత్ ఐదో స్థానంలో ఉందన్నారు. ప్రపంచంలో ఏ సమస్య వచ్చినా పరిష్కారం కోసం మన దేశ ప్రధాని నరేంద్ర మోడీని అభ్యర్థిస్తున్నారి అన్నారు. ఇటీవల హర్యానాలో, నిన్న ఢిల్లీలో భారతీయ జనతాపార్టీని గెలిపించారు. మన దేశ ప్రధాని నరేంద్రమోడిపై విశ్వాసంతో బిజెపిని ఆదరిస్తున్నారు. ఇక మిగిలింది మన తెలంగాణ రాష్ట్రం అన్నారు. తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కారు రావాలన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కుటుంబ పాలనతో తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుందన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజ లకు అనేక రకాల హామిలిచ్చి, ఏ ఒక్క హామీని నెవరేర్చకుండా వైఫల్యం చెందిం దన్నారు. వచ్చే శాసనసభ ఎన్ని కలకు ముందు మనమంతా సిద్ధంగా ఉండాలి. దానికంటే ముందు మున్సి పల్ కార్పొరేషన్ ఎన్నికలుంటాయి. ఈ ఎన్నికల్లో అహంకారపూరిత మజ్లిస్ పార్టీ కోరలు పీకి కాషాయ జెండా ఎగురవేయాలన్నారు. ఈసారి జిహెచ్‌ఎంసిలో వందకు వందసీట్లు గెలిపించుకునేలా బిజెపి శ్రేణులు కృషిచేయాలన్నారు. బిజెపిలో ప్రస్తుతం సంస్థాగత పర్వం కొనసాగుతుందన్నారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లాలో లంకల దీపక్ బాధ్యతలు స్వీకరించారని, దీపక్ నేతృత్వంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లాలో బిజెపిని ముందుకు తీసుకెళ్లాలని, అందుకు అందరు సహకరించాలని కోరుతున్నానన్నారు.

# బిసి రిజర్వేషన్ల నివేదికపై కసరత్తు

**హైదరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** స్థానిక సంస్థల్లో బీసీలకు ఏ మేరకు రిజర్వేషన్లు కల్పించాలనే అంశంపై కసరత్తు జరుగుతోంది. ఈ మేరకు దీనికి సంబంధించిన తుది నివేదికను రూపొందించే పనిలో డెడికేటెడ్ బీసీ కమిషన్ నిమగ్నమైంది. కోర్టు తీర్పునకు లోబడి రిజర్వేషన్ల సీలింగ్‌లో మార్పు లేకుండా ఈ కమిషన్ సిఫారసు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నివేదికను ఈ నెల 10 లేక 11వ తేదీల్లో కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు సమాచారం. ఈ నివేదిక ఆధారంగానే త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి టికెట్లను కేటాయింపులు జరపనుండటంతో కమిషన్ నివేదికకు ప్రాధాన్యత సంతరించుకుంది. నివేదిక అందిన వెంటనే ప్రభుత్వం స్థానిక సంస్థలకు సంబంధించిన రిజర్వేషన్లను ఖరారు చేయనుంది.

# సంగీత, సాహిత్యాలకు సొబగులద్దిన రమణాచారి, రామాచారి

### మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల మాజీ గవర్నర్ సిహెచ్.విద్యాసాగర్‌రావు

### కె.రామాచారికి వంశీ-కె.వి.రమణ గ్లోబల్ మ్యూజిక్ అవార్డు ప్రదానం



రామాచారికి వంశీ-కె.వి.రమణ గ్లోబల్ మ్యూజిక్ అవార్డు ప్రదానం చేస్తున్న విద్యాసాగర్‌రావు, రమణాచారి, గోపి, వంశీరామరాజు, కృష్ణయ్య తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** తెలుగు భాష, సంగీత, సాహిత్యాల సొగబులద్దిన 73 వసంతాలు పూర్తిచేసుకున్న విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి, సంగీత గురువు డా. కె.రామాచారిలు అయితే ఒకరు సువర్ణాన్ని పూస్తే మరొకరు సుగంధాన్ని పూసి తెలుగు భాష, సంస్కృతిని రక్షిస్తున్నారని మహారాష్ట్ర, తమిళ నాడు రాష్ట్రాల మాజీ గవర్నరు సిహెచ్ .విద్యా సాగర్‌రావు అన్నారు. సంగీతమంటే పాటలు, డాన్స్‌లనే ఆలోచనలు సరికాదని, సంగీతంలో ఉన్న శక్తి ఈ వేదికపై ఎంతోమంది పిల్లలు పాడుతూంటే వారి జీవితంతో నిగ్రహశక్తిని నేర్పించిన సంగీతం, సంగీతాన్ని నేర్పించిన గురు రామాచారికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రమణాచారి ఐఎఎస్ అధికారిగా పరిపాలనా దక్షతతోపాటు అన్ని రంగాల్లోని వారిని ఆదు కొని వివిధరంగాల్లో విప్ల వాత్మక విధానాలను బైటకుతీసి, అమలు చేసి ఆలోచింపజేసి స్ఫూర్తిగా నిలిచార న్నారు. ఐఎఎస్ చాలా ప్రధాన మైన బాధ్యతని, అందరూ రమణాచారి కార్యదీక్ష, దక్షతను స్ఫూర్తి తీసుకొని మెలగాలని నేటి ఐఎఎస్ అధికారులకు సూచించారు. తెలుగుభాష తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న కమ్మటిభాషని, తెలుగును రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈ నెల 21న అంతర్జాతీయ తెలుగుభాషా దినోత్స వాన్ని జరుపుకోవాలని యునెస్కో ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు. వంశీ ఆర్ట్ థియేటర్స్, వంశీ కల్చరల్ అండ్ ఎడ్యు కేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో వంశీ సంస్థల అధినేత కళాబ్రహ్మ శిరోమణి డా. వంశీ రామరాజు నేతృత్వంలో ఆచార్య ఎన్.గోపి సభాధ్యక్షతన జరిగిన డా. కె.వి. రమణాచారి 73వ జన్మదినోత్స వాలకు కె.విద్యా సాగర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై విశిష్ట అతిథి కిమ్స్ వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్య, గౌరవ అతిథులు దైవజ్ఞశర్మ, రేలంగి నరసింహారావు తదితరులతో కలిసి ప్రముఖ గాయ కుడు, సంగీత దర్శకుడు, స్వరకర్త డా. కొమాండూరి రామాచారిని ఘనంగా సత్కరించి వంశీ- కె.వి. రమణ గ్లోబల్ మ్యూజిక్ అవార్డును ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు.

# కేంద్రం ఇచ్చే ఇళ్లకు ఇందిరమ్మ పేరు పెడితే ఊరుకోం

### కాంగ్రెస్‌కు మిగిలింది గాడిద గుడ్డే

### మీడియా సమావేశంలో మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి డికె అరుణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** గాడిద గుడ్డు నెత్తిన పెట్టుకొని ఊరేగిన రేవంత్‌కు అదే రిటర్న్‌గిఫ్ట్ వచ్చిందని ఎంపీ డీకే అరుణ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మీద ప్రజలకు నమ్మకం పోయిందని, అందుకే మొన్న మహారాష్ట్రలో, నిన్న ఢిల్లీలో ఓటర్లు గాడిద గుడ్డే ఇచ్చారని చెప్పారు. ఢిల్లీలో కాంగ్రెస్ ఓటమిపై మహ బూబ్‌నగర్ బీజేపీ జిల్లా కార్యాల యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. అభి వృద్ధిని అటకెక్కించిన ఆప్‌ను ఢిల్లీ ప్రజలు ఊడ్చేశారని, ఏ చీపురు గుర్తుతో ఆప్ అధికారం లోకి వచ్చారో అదే చీపురు గుర్తుతోనే ఊడ్చేశారని చెప్పారు. ఢిల్లీలో బీజేపీది చరిత్రాత్మక విజయ మని ఆమె పేర్కొన్నారు. మోదీ అభివృద్ధి గ్యారంటీకి ఢిల్లీ ప్రజలు ఓటు వేశారని చెప్పారు. కాంగ్రెస్‌ను ఇక నమ్మే పరిస్థితి లేదని, ప్రజల్లో పూర్తి విశ్వాసాన్ని కోల్పో యిందన్నారు. పిఎం ఆవాస్ యోజన నిధులతో నిర్మించే వాటికి ఇందిరమ్మ ఇళ్లు అని పేరు పెడితే ఊరుకోమని, చిత్తశుద్ధి ఉంటే ఇందిరమ్మ ఇళ్లు వేరే కట్టించాలని, లేదా పేరు మార్చాలని ఎంపి సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్తేనే ప్రజలకు పథకాలు, హామీలు అమలవుతాయని పేర్కొ న్నారు. ప్రజల్ని మోసం చేసిన కాంగ్రెస్‌కు సీఎం రేవంత్‌రెడ్డికి కేజ్రీవాల్ గతే పడుతుం దన్నారు. అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చేదిగా కేంద్రం బడ్జెట్ రూపొందించడం జరిగిందన్నారు. రూ.12 లక్షలు లోపు ఆదాయం ఉన్నవారికి టాక్స్ మినహాయింపు ఇవ్వడం శుభపరిణామన్నారు.




నిరసన కార్యక్రమాన్ని నిర్వహించిన దృశ్యం

# అక్రమ వలసదారుల పేరిట సంకెళ్లేసి అవమానించిన ట్రంప్ వైఖరిని ఖండించండి

### ఆర్టీసి క్రాస్‌రోడ్స్‌లో సిపిఎం నిరసన

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** భారతీయ వలసదారుల పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహరిస్తున్న అమానుష వైఖరిని ఖండి స్తూ ఆదివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్‌సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ అధ్యక్షత వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన సిపిఎం జాతీయ నాయకుడు బి.వెంకట్ మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహరిస్తున్న వైఖరి అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధమని, అక్రమ వలసదారుల పేరుతో భారతీయుల కాళ్లకు, చేతులకు సంకెళ్లు వేసి సైనిక విమానంలో 104 మందిని కుక్కి పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు పంపించారని అన్నారు. భారతీయుల పట్ల వ్యవహరించిన వైఖరి యుద్ధ ఖైదీల పట్ల కూడా ఉండదని అన్నారు. ఈ విషయమై ప్రధానమంత్రి నరేంద్రమోడీ కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవికుమార్ మాట్లాడుతూ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి జలియన్ వాలాబాగ్‌లో అనేక మంది అమరులైన పోరాటాల గడ్డ పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో విదేశీ (అమెరికా) సైనిక విమానం దిగడం భారత సార్వభౌమత్వానికి మాయనిమచ్చ అన్నారు. ఐదు కోట్ల మంది జనాభా ఉన్న కొలంబియా, అమెరికా పక్కనే ఉన్న మెక్సికో, ఇతర చిన్నదేశాలు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైఖరిని వ్యతిరేకించాయని అన్నారు. కనీసం ఆదేశాలకున్న ధైర్యం మన భారత ప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఎందుకు లేదని ప్రశ్నించారు.

# ఆరు నెలల్లో 200 మందికిపైగా నక్సలైట్ల హతం

### తెలంగాణ సరిహద్దుల్లో నిరంతర కూంబింగ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టుల ఏరివేతకు నడుం బిగించిన పోలీసు బలగాలకు నక్సల్స్ ఖిల్లా బూజ్‌మడ్‌కు సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన పారామిలటరీ బేస్ క్యాంప్‌లు పోలీసుల ఆపరేషన్‌కు సహకరిస్తున్నాయి. ఈ బేస్ క్యాంప్‌ల వల్లే గడచిన ఆరు నెలల వ్యవధిలో ఛత్తీస్‌ఘడ్‌లో 200 మందికి పైగా నక్సలైట్లు ఎదురు కాల్పుల్లో చని పోవడం గమనార్హం. ఇదే సమయంలో మావోయిస్టులకు సంబంధించి పెద్దఎత్తున ఆయుధాలు, మందు గుండు సామాగ్రిని పోలీసులు జప్తు చేయడం గమనార్హం. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులపై వరుసగా దాడులు చేస్తున్న పోలీసులకు అటవీ ప్రాంతాలలో పదికి పైగా వున్న బేస్ క్యాంపులు సహాయకారిగా వున్నాయి. సాధారణం గా బేస్ క్యాంపులు లేని రోజుల్లో పోలీసులు జిల్లా కేంద్రం నుంచి ఆపరేషన్ చేబట్టి తిరిగి జిల్లా కేంద్రానికే చేరుకోవాల్సి వచ్చేది. మార్గమధ్యన నక్సలైట్లతో ఎదురుకాల్పులు జరిగి ఎవరైనా గాయపడితే జిల్లా కేంద్రం నుంచి సహాయ సిబ్బంది వచ్చే వరకు ఎదురుచూడాల్సి వచ్చేది. ఈ క్రమంలో కొన్నిసార్లు పోలీసుల తరపున భారీ నష్టం వాటిల్లిన ఉదంతాలూ వున్నాయి. అయితే బేస్ క్యాంపులు ఏర్పాటయ్యాక పరిస్థితులు పూర్తిగా మారి పోయాయి. బేస్ క్యాంపుల్లో నక్సల్స్ ఆపరేషన్‌కు వెళ్లే పోలీసులకు అన్ని మౌలిక వసతులు వుంటాయి. ఆయు ధాలు, మందుగుండు సామాగ్రితో పాటు వైద్యసేవలందించేందుకు పారా మెడికల్ సిబ్బంది, అత్యవసర సేవలకు అంబులె న్స్‌లు, ఇంకా అవసరం అను కుంటే నిమిషాల్లో వచ్చే హెలికాప్టర్లు అందుబాటులో వుంటాయి. ఇటీవల కాలంలో ఛత్తీస్‌గఢ్ లోని బీజాపూర్, దంతేవాడ, సుకుమా జిల్లా అటవీ ప్రాంతాలలో జరిగిన పలు ఎన్ కౌంటర్‌లో పదుల సంఖ్యలో మావోయిస్టులు మరణించడం తెలిసిందే. మావోయిస్టులకు కీలకంగా వున్న అబూజ్‌మడ్‌కు భద్రతా బలగాలు చేరువలో వచ్చారనడానికి ఇవన్నీ సంకేతాలుగా నిలిచాయి. ఈ క్రమంలోనే అబూజ్‌మడ్‌కు అత్యంత సమీపంలో గల దుబ్బకొంట, నంబి ప్రాంతాలలో బేస్ క్యాంప్‌లను ఏర్పాటు చేయడం ద్వా రా దట్టమైన అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు సులభంగా వెళ్లేందుకు మార్గం సుగమం చేశారు. ఇప్పటికే వందల సంఖ్యలో సిఆర్‌పిఎఫ్ బలగాలు ఆయుధాలు, మందు గుండు సామాగ్రితో అక్కడ మకాంవేసి నక్సల్స్ ఆపరేషన్‌లో పాల్గొంటున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ప్రస్తుతం 31 సాధారణ సిఆర్‌పిఎఫ్ బెటాలియన్లతో పాటు మరో బస్తర్ బెటాలియన్, ఆరు కోబ్రా బెటాలియన్ల సిబ్బంది మావోయిస్టుల ఏరివేతలో పాలుపంచుకుంటున్నాయి. అంటే సమారు 40 వేల మంది పారా మిలటరీ బలగాలు ఈ రాష్ట్రంలో మావోయిస్టుల ఏరివేతలో వున్నారు. . ఛత్తీస్‌ఘడ్‌లోని సుక్మా, బీజాపూర్, కంకేర్, నారాయణ్‌పూర్, బస్తర్ ప్రాంతాలు మావోయిస్టులకు పట్టున్న ప్రాంతాలు. మావోయిస్టుల ఖిల్లా అబూజ్‌మడ్ ఇక్కడే వుంది. దట్టమైన కీకారణ్యం జనజీవనం పెద్దగా లేని ఈ ప్రాంతంలో కొన్ని గిరిజన తెగలకు చె ందిన వారు మాత్రమే జీవిస్తారు. ఈ ప్రాంతంలో మావోయిస్టులు దశాబ్దాలుగా స్థావరాన్ని ఏర్పాటు చేసుకుని దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాలలో చాలా కాలం పాటు త మ కార్యకలాపాలు సాగించారు. త్వరలో మరికొన్ని బేస్ క్యాంప్‌లు ఏర్పాటుకానున్నాయని సమాచారం. దీని వల్ల మావోయిస్టులను కట్టడి చేసేందుకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర పోలీసులకు మరింత సులభతరం అవుతుంది. మరోవైపు ఛత్తీస్‌ఘడ్ నుంచి తెలంగాణలోకి నక్సలైట్లు రాకుం డా ఇక్కడి పోలీసులు సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం చేశారు.



# వన్డే సిరీస్ భారత్ కైవసం

## నాలుగు వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై గెలుపు

**కటక్, ఫిబ్రవరి 9:** ఇంగ్లండ్‌తో జరిగిన రెండో వన్డేలో టీమిండియా విజయం సాధించింది. మూడు వన్డేల సిరీస్‌ను భారత్ ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో కైవసంచేసుకుంది. తొలుత బ్యాటింగ్‌చేసిన ఇంగ్లండ్‌జట్టు 49.5ఓవర్లలో 304 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ భారీ లక్ష్యాన్ని టీమిండియా 44.3 ఓవర్లలో ఆరువికెట్లునష్టపోయి ఛేదించింది. రోహిత్‌శర్మ 90 బంతుల్లో 12 ఫోర్లు, ఏడు సిక్స్‌లతో 119 పరుగులుచేసాడు. చాలా కాలంతర్వాత సెంచరీ బాది మంచి ఫామ్‌లోకి వచ్చాడు. ఆతనికి వన్డేల్లో ఇది 32వ సెంచరీ. భారీ అంచనాలతో బరిలోకి దిగిన విరాట్‌కోహ్లీ ఐదుపరుగులతోనే నిరాశకు గురిచేసాడు. శుభ్‌మన్‌గిల్ 52 బంతుల్లో తొమ్మిదిఫోర్లు, ఒక సిక్స్‌తో 60 పరుగులుచేసాడు. వరుసగా గిల్ రెండో అర్ధశతకం బాదాడు. శ్రేయస్ అయ్యర్ 47 బంతుల్లో మూడు ఫోర్లు ఒకసిక్స్‌తో 44 పరుగులుచేస్తే అక్షర్‌పటేల్ 43 బంతుల్లో నాలుగుఫోర్లుచేసి 41 పరుగులుచేసాడు. కెఎల్‌రాహుల్ పది, హార్థిక్ పాండయ 10, రవీంద్రజడేజా 11 పరుగులుచేసారు. ఇంగ్లండ్ బౌలర్లలో జెమీ ఓవర్టన్‌రెండు, ఆదిల్‌రషీద్ లివింగ్‌స్టన్, అట్కిన్సన్ చెరొక వికెట్ తీసారు. సిరీస్‌లో నామమాత్రపు మూడో వన్డే 12వ తేదీ అహ్మదాబాద్‌లో జరుగుతుంది. తొలుత బ్యాటింగ్‌చేసిన ఇంగ్లండ్ జట్టులో ఓపెనర్ బెన్ డకెట్ 56 బంతుల్లో పది ఫోర్లతో 65 పరుగులుచేసాడు. జోరూట్ 72 బంతుల్లో నాలుగు ఫోర్లతో 69 పరుగులుచేసి అర్ధశతకాలుచేసి స్కోరు పెంచారు. హ్యారీబ్రూక్ 52 బంతుల్లో మూడు ఫోర్లు ఒక సిక్స్‌తో 31, జోస్ బట్లర్ 35 బంతుల్లో రెండుఫోర్లతో 34 పరుగులుచేసాడు. ఫిల్‌సాల్ట్ 29 బంతుల్లో రెండు ఫోర్లు, ఒకసిక్స్‌తో సహా 26 పరుగులుచేసి పర్వాలేదనిపించారు. చివరిలో లివింగ్‌స్టన్ 32 బంతుల్లో రెండుఫోర్లు రెండు సిక్స్‌లుబాది 41పరుగులుచేసాడు. ఇంగ్లండ్‌స్కోరు ఈ దూకుడుకు 300 దాటింది. భారత బౌలర్లల రవీంద్ర జడేజా 3/35 తీసి అద్భుత స్పెల్‌వేసాడు. షమీ, హర్షిత్‌రాణా, హార్థిక్ పాండ్య, వరుణ్‌చక్రవర్తి తలో వికెట్‌తీసారు.




# 'కల్తీనెయ్యి' కేసులో కీలక పరిణామం

## సిబిఐ అదుపులో నలుగురు నెయ్యి సరఫరాదారులు

**తిరుమల, ఫిబ్రవరి 9, ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలేశుని లడ్డూప్రసాదాల తయారీలో కల్తీనెయ్యి సరఫరా చేసిన కేసులో ఎట్టకేలకు సిబిఐ సిట్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ సరఫరాలో కీలకంగా వ్యవహరించిన తమిళనాడు ఏఆర్ డైరీ యాజమాన్యం ఎండి రాజశేఖరన్‌తోబాటు సరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన విపిన్‌గుప్త, షోమిల్‌జైన్, అపూర్వచావ్డాలను సిబిఐ ఆదివారం సాయంత్రం అదుపులోకి తీసుకుంది. ఈ నలుగురిని సోమవారం ఉదయం తిరుపతిలో కోర్టులో హాజరుపరచనుందని సమాచారం. ఆదివారం రాత్రి సిబిఐ సిట్ చీఫ్ వీరేష్‌ప్రభు, మరో ఐదుగురు కీలక అధికారులు ఈ నిందితుల అరెస్టులో పాల్గొన్నారు. గత ఏడాది జూన్‌లో టిటిడికి కల్తీనెయ్యిసరఫరాచేశారని ప్రభుత్వం గుర్తించింది. దీంతో ఈ కల్తీపై దర్యాప్తుకు ప్రభుత్వం తొలుత రాష్ట్రపోలీసు అధికారులతో సిట్‌ను ఏర్పాటుచేసినా ఆరోపణలు రావడంతో చివరకు సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశాలతో సిబిఐ అధికారులతో, రాష్ట్రపోలీసుఅధికారులుతో, ఆహారభద్రత అధికారితో సిట్‌ను ఏర్పాటుచేసి కీలకంగా 25రోజులు దర్యాప్తు చేపట్టింది. తిరుపతిలోనే సిబిఐ సిట్ అధికారులు తిష్టవేసి అనేక కోణాల్లో ఆధారాలు సేకరించారు. టీమ్ అధికారులు తిరుమల,తిరుపతికి చేరుకుని దాదాపు మూడువారాలు పాటు అన్ని కోణాల్లో దర్యాప్తు చేశారు. పలు రకాల రికార్డులు, ఆధారాలు సేకరించారు. నేడు కోర్డులోహాజరుపరిచిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడించనున్నారు.

# మార్చి నుంచి ఇంటెగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల పనులు ప్రారంభం!

## నెలాఖరులో టెండర్లు ఫైనల్

## రూ. 200 కోట్లతో భవనాల నిర్మాణాలు

## ఒక్కో స్కూలు 20 ఎకరాల్లో ఏర్పాటు

**హైదరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న గురుకులాల స్థానంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను తీసుకురానున్నట్టు ప్రకటించారు. అందులో భాగంగా నియోజకవర్గానికి ఒకటి ప్రారంభిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే 54 నియోజకవర్గాలకు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను మంజూరు చేశారు. వాటిలో మార్చిలో మూడు స్కూల్స్‌కి సంబంధించిన పనులను ప్రారంభించనున్నారు. మూడు స్కూల్స్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌లో ఒకటి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గమైన మధిరలో ఒకటి, ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గమైన హుజూర్‌నగర్‌లో ఒక స్కూల్ పనులను మార్చిలో ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియను ప్రారంభించారు. ఈ నెల 18తో టెండర్ల దరఖాస్తు ప్రక్రియ కూడా ముగియనుంది. అనంతరం ఈ నెలాఖరు నాటికి టెండర్లను అధికారులు ఫైనల్ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మార్చి నెలలో పనులను ప్రారంభించడానికి విద్యాశాఖ అధికారులు ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ప్రతి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి రూ. 200 కోట్లను ఖర్చు చేయనున్నారు. ప్రతి స్కూల్‌ను 20 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు. 20 ఎకరాల్లో క్లాస్‌రూమ్‌లు, డార్మెటరీ, కిచెన్, డైనింగ్‌తోపాటు బోధన, బోధనేతర సిబ్బంది నివాస భవనాలను సుమారు 4 ఎకరాల్లో ఏర్పాటు చేయాలని.. మిగిలిన వాటిలో ఎక్కువ శాతం గ్రౌండ్‌తోపాటు ఇతర వాటికి ఉపయోగించేలా ఈడబ్ల్యూఐడీసీ అధికారులు ప్లాన్‌ను రూపొందించినట్టు తెలుస్తోంది. క్లాస్ రూమ్‌లకి సంబంధించి రెండంతస్తుల భవనాలను నిర్మించనున్నారు. 5 నుంచి 8వ తరగతి విద్యార్థులకు వన్ ప్లస్ వన్ బెడ్స్‌ను ఏర్పాటు చేయాలని.. 9, 10 తరగత విద్యార్థులకు ఒక్కొక్కరికి ఒక బెడ్‌ను ఏర్పాటు చేసేలా ప్లాన్‌ను సిద్ధం చేశారు. ప్రిన్సిపాల్ ఉండటానికి అలాగే బోధనా సిబ్బంది ఉండటానికి వేర్వేరుగా భవనాలను నిర్మించనున్నారు. బాచిలర్ వార్డెన్లకు విద్యార్థులతోపాటుగానూ.. పెళ్లి అయిన వార్డెన్‌లు అయితే వారికి సిబ్బందికి ఏర్పాటు చేసిన భవనాల్లో వసతి ఏర్పాటు చేయనున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులందరికీ కలిపి ఒకేదగ్గర సుమారు 2500 మందికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను కొనసాగించనున్నారు. ఒక్కో గురుకులానికి చెందిన 640 మందితో కలిపి మొత్తం 4 రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఒకేదగ్గర 2500 మందితో ఏర్పాటు చేయనున్నారు. 20 ఎకరాల స్థలం అందుబాటులోలేని హైదరాబాద్ వంటి నగరంలో బహుళ అంతస్తులను విద్యార్థుల క్లాస్‌ల కోసం నిర్మాణం చేపట్టాలని అధికారులు భావిస్తున్నట్టు తెలుస్తోంది. 2500 మంది విద్యార్థులకు ఒకే దగ్గర కిచెన్ ఏర్పాటు చేసి అక్కడే వంట చేసిన అనంతరం 1250 మందికి ఒక దగ్గర.. 1250 మందికి ఒక దగ్గర డైనింగ్‌ను కొనసాగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులతో మీటింగ్ ఏర్పాటు ప్రత్యేకంగా ఒక మీటింగ్ హాల్‌ను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని 54 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకి మంజూరు చేసిన నేపథ్యంలో వాటిన్నింటికి సంబంధించి భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశిస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో భూసేకరణ కొలిక్కివచ్చినట్టు తెలుస్తోంది. 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభం కంటే ముందుగానే భూసేకరణ పనులను పూర్తి చేసేలా చూడాలని జిల్లా కలెక్టర్లను విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి కోరారు. ప్రస్తుతం వివిధ గురుకులాలు వేర్వేరుగా కొనసాగుతున్నాయని.. వాటిలో చాలా వరకు అద్దె భవనాల్లో కొనసాగుతున్న నేపథ్యంలో అన్నింటినీ ఒకేదగ్గర ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షిల్ స్కూల్స్‌గా కొనసాగించాలని నిర్ణయించి.. ఒకేదగ్గర సొంత భవనంలో గురుకులాలను కొనసాగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాదిలో మిగిలిన నియోజకవర్గాలకు కూడా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను మంజూరు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# తెలంగాణపై జనసేన ఫోకస్

## స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సై!

## రాజకీయ వర్గాల్లో హాట్‌హాట్ చర్చ

**హైదరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** తెలంగాణపై జనసేన పార్టీ ఫోకస్ చేసింది. వచ్చే ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేసే ఇప్పటి నుంచే అడుగులు వేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల బరిలో దిగేందుకు జనసేన సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో తెలంగాణలో జనసేన పార్టీకి రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తింపు ఇచ్చింది. ఇతర రాష్ట్రాలలో గుర్తింపు పొందిన ప్రాంతీయ పార్టీగా వర్గీకరించింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన తరఫున పోటీకి నిలిచే అభ్యర్థులకు గాజు గ్లాసు గుర్తును కేటాయించనున్నట్టుగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై తెలంగాణ రాజకీయాల్లో హాట్ హాట్ చర్చ అప్పుడే మొదలైపోయింది. తెలంగాణలో ప్రస్తుతం ఎలాంటి ఎన్నికలు లేవు. అయినా స్టేట్ ఎలక్షన్ కమిషన్ జనసేనకు గుర్తు కేటాయింపు నేపథ్యంలో స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు గ్రౌండ్ స్థాయిలో కసరత్తు జరుగుతున్నట్లు జనసేన పార్టీ వర్గాలు



సైతం అంగీకరిస్తున్నాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పార్టీల గుర్తు మాత్రమే జరుగుతున్నాయి. గ్రౌండ్ లెవల్‌లో కేడర్‌ను పెంచుకునేందుకు జనసేన వేసిన ఎత్తుగడగా కొందరు చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ చేస్తే రానున్న అసెంబ్లీ ఎన్నికల నాటికి ఎక్కువ స్థానాల్లో పోటీ చేసే వీలు ఉంటుందన్నది ఆ పార్టీలో కొందరి నేతల మాట. ఇది నాణెనికి ఒకవైపు మాత్రమే. రెండో వైపు విషయానికొస్తే. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా తెలంగాణలోనూ కూటమి పోటీ చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు పెద్ద ఎత్తున రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. తెలంగాణలో బీజేపీ నేతలున్నారని, కాకపోతే గ్రౌండ్ స్థాయిలో కేడర్ పరిస్థితి ఆశించిన స్థాయిలో లేదని, ఇక టీడీపీ కేడర్ బలంగా ఉంది. కాకపోతే పేరున్న నేతలు కనిపించలేదని, ఈ నేపథ్యంలో తెలంగాణలో బిజెపి, టిడిపి, జనసేన ఈ మూడు పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడేందుకు ఇప్పటి నుండీ కసరత్తు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా తెలంగాణలో జనసేన రిజిస్టర్డ్ పొలిటికల్ పార్టీగా ఉన్నప్పటికీ ఇంత వరకూ ప్రత్యేకంగా ఎలాంటి గుర్తును రాష్ట్ర ఎన్నికల సంఘం కేటాయించలేదు. అయితే ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం ఆంధ్రప్రదేశ్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల జాబితాలో జనసేనను చేర్చడం, గాజు గ్లాస్ గుర్తు రిజర్వ్ చేయడంతో తెలంగాణలో సైతం పార్టీకి గుర్తు కేటాయింపు కోసం ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా గత నె 28న జనసేన పార్టీ లీగల్ సెల్ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. కేంద్ర ఎన్నికల సంఘం జనసేనను ఏపీలో ప్రాంతీయ పార్టీగా గుర్తించిందని, దానికి అనుగుణంగా తెలంగాణలోనూ గుర్తించాలని, గాజుగ్లాసు గుర్తు ఇవ్వాలని ఆ లేఖలో కోరింది. దానిపై స్పందించిన రాష్ట్ర ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికలలో జనసేన పార్టీ ద్వారా పోటీచేసే అభ్యర్థులకు కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా పార్టీకి రిజర్వు చేయబడిన గాజు గ్లాసు గుర్తు కేటాయించబడుతుందని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు కసరత్తు జరుగుతున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

# మిర్చి కూలీల ట్రాక్టర్ బోల్తా

## నలుగురు మహిళల దుర్మరణం

## పలువురికి తీవ్రగాయాలు

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ముప్పాళ్ళ మండలం చాగంటివారిపాలెం గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం మిర్చి కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాకొట్టిన సంఘటనలో నలుగురు మహిళా కూలీలు దర్మరణం చెందారు. పోలీసుల కథనం ప్రకారం ముప్పాళ్ళ మండలం చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన మహిళా కూలీలు సుమారు 30 మంది ట్రాక్టర్‌లో మిరపకాయలు కోసేందుకు వెళ్ళారు. పని ముగించుకొని తిరిగి సాయంకాలం సమయంలో అదే ట్రాక్టర్‌లో ఇంటికి వస్తుండగా కూలీలతో ఉన్న ట్రాక్టర్ అదుపుతప్పి సమీపంలోని మాదల పంట కాలువలో బోల్తా పడింది. ఈ సంఘటనలో చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన మధిరా గంగమ్మ (60) తేనేపల్లి పద్మావతి (53), మధిరా సామ్రాజ్యం (60), చక్కిర మాధవి (33) మృతిచెందారు. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అదే విధంగా మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పొట్టకూటి కోసం మిరపకాయలు కోసేందుకు వెళ్ళి మృత్యువాతపడిన తమవారి మృతదేహాలను చూసి కుటుంబసభ్యులు, బంధువులు రోధిస్తున్న తీరు పలువురిని కంటతడిపెట్టించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామంలో ఒకేసారి, ఒకే రోజు ట్రాక్టర్ ప్రమాదంలో నలుగురు మృతిచెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా ఈ మేరకు ముప్పాళ్ళ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రైతులకు వెంటనే వడ్ల బోనస్ విడుదల చేయాలి

## సిఎం రేవంత్‌కు బిఆర్ఎస్ నేత హరీశ్‌రావు లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 9:** సిద్దిపేటలో రైతులకు వెంటనే వడ్ల బోనస్ విడుదల చేయాలని సిఎం రేవంత్ రెడ్డిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్ చేశారు. ఈ అంశంపై సీఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ రాశారు. వడ్లకు బోనస్ విషయంలో రైతుల్ని ప్రభుత్వం మోసం చేస్తుందని మండిపడ్డారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాటలు గొప్పగా ఉన్నాయి.. కానీ అందుకు తగ్గట్లుగా ఆయన చేతలయితే లేవన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాటల మనీషా? లేక మోసపు మనీషా అంటూ హరీష్ రావు సందేహం వ్యక్తం చేశారు. బోనస్ డబ్బుల కోసం కలెక్టరేట్, అధికారుల చుట్టూ రైతులను తిరుగుతున్నారని ఈ సందర్భంగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసా.. రూ. 2లక్షల రుణ మాఫీ, సన్న వడ్లకు బోనస్ అన్ని మోసాలేనంటూ ఎద్దేవా చేశారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌ను పూర్తిగా విస్మరించారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. రెండో పంటకు పెట్టుబడి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రూ. 432 కోట్లు బోనస్ బకాయిలు ఉన్నాయని గుర్తు చేశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాటలు ఉత్తర కుమార ప్రగల్భాలుగా మారాయంటూ హరీష్ రావు వ్యంగ్యంగా అన్నారు. బిఆర్ఎస్‌ను ఇష్టమొచ్చినట్లు తిడుతున్నావు.. మాకు తిట్టడం రాదనుకున్నారా? అని ప్రశ్నించారు. కానీ తమకు సంస్కారం ఉంది.. మీకు లేదన్నారు. కందులు కూడా ఎకరానికి మూడు క్వింటాళ్ల మాత్రమే కొంటారని.. ఎన్నికల వేళ హామీల కోతలు.. గెలిచాక అమలులో కోతలు అంటు రేవంత్ సర్కార్‌ను తప్పుపట్టారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా రైతు.. ఆయనకు తెలిసే ఇది జరుగుతున్నదా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలో కందులకు సైతం రూ. 400 బోనస్ ఇస్తామన్నారని గుర్తు చేశారు. కానీ కందులు రూ.7,550 మద్దతు ధర, ప్రభుత్వం బోనస్‌తో కలిపి రూ.7,950 కి కొనాల్సి ఉందన్నారు. కందులు పండించడం రైతులు చేసిన నేరమా? అని ప్రశ్నించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్రాప్ బుకింగ్ చేయక పోతే అ తప్పు రైతులదా? అని సందేహం వ్యక్తం చేశారు. క్రాప్ బుకింగ్‌లో మిస్సింగ్ రైతులకు అనుమతి ఇవ్వాలని అధికారులు కోరితే ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదన్నారు.

షరతులు లేకుండా మొత్తం కందులు కొనాలని తాము ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. సన్ ఫ్లవర్ రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. నూనెల వచ్చే పంటలు పండిస్తే.. ప్రభుత్వం వారికి శఠగోపం పెడుతున్నారన్నారు. సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంతో రైతులు రూ. 6 వేలకే విక్రయిస్తున్నారని చెప్పారు. విదేశీ మారక నిల్వలను కాపాడుతున్న నూనె రైతులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. ఇది కోతల సర్కారు.. ఎన్నికల ముందు ఆ కోతలు.. ఎన్నికల తరువాత ఈ కోతలంటూ ఎద్దేవా చేశారు. కోతలు, షరతులు లేకుండా రైతులు పండించిన పంట మొత్తం కొనాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. రైతు భరోసాలో సైతం ఈ సర్కారు కోత పెడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

# 42కోట్లు దాటిన కుంభమేళా భక్తులు

## ప్రయాగ్‌రాజ్ రోడ్లన్నీ వాహనాలతో రద్దీ

## ఎక్కడికక్కడ నిలిచిపోతున్న ట్రాఫిక్

**మహాకుంభ్‌నగర్, ఫిబ్రవరి 9:** రాష్ట్రంలోని ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభ్‌మేళాకు కోట్లాదిమంది భక్తులు తరలివస్తున్నారు. 45 రోజులపాటుజరిగే మహాకుంభమేళాకు 40



కోట్లనుంచి 45 కోట్లమంది వస్తారని యుపి ప్రభుత్వం అంచనావేసింది. అయితే అధికారుల అంచనాలకు మించి మహాకుంభమేళా ప్రారంభం అయిన 26రోజుల్లోనే ఈసంఖ్య 42 కోట్లకు చేరింది. ఈనెల26వతేదీతో ముగుస్తున్న మహాకుంభ్‌మేళాకు వచ్చే భక్తుల సంఖ్య 50 కోట్లు దాటుతుందని స్పష్టం అవుతోంది. నిత్యం సగటున 50 లక్షలకు తగ్గకుండా పుణ్యస్నానాలు చేస్తున్నారు. మరో 18 రోజులు సమయం ఉన్నందున భక్తులసంఖ్య మరింతగా పెరుగుతుందని అంచనావేస్తున్నారు. కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోయిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఆదివారం ఒక్కరోజే 1.50 కోట్లమంది భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసినట్లు యుపి సర్కారు వెల్లడించింది. కాగా కుంభ్‌మేళాకు వెళ్లే వాహణాలతోప్రయాగ్‌రాజ్ దారులన్నీ నిండిపోయాయి. ప్రయాగరాజ్ కాన్పూర్; ప్రయాగరాజ్ లక్నో, ప్రతాప్‌గఢ్, ప్రయాగరాజ్ వారణాసిమీర్జాపూర్;రేవా ప్రయాగరాజ్ మార్గాలన్నీ వాహనాలతో నిండిపోయాయి. 50 కిలోమీటర్ల దూరానికి 10 నుంచి 12 గంటల సమయం పడుతున్నట్లు అంచనా. మధ్యప్రదేశ్‌లోని అనేక జిల్లాల్లోట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిపివేసారు. కనటీ,మైహర్, రివా జిల్లాల్లోపరిస్థితి దారుణంగా ఉంది. సోమవారం కూడా ఈరూట్లలోట్రాఫిక్‌ను నిలిపివేయాల్సి వస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతిభాపాల్ వెల్లడించారు. ట్రాఫిక్‌లో చిక్కుకున్నవారికోసం తాత్కాలిక వసతి, నీరు ఆహారం అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# కులగణన రీసర్వే గురించి కెటిఆర్ మాట్లాడడం విడ్డూరం

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరోక్షంగా బిజెపికి బిఆర్ఎస్ మద్దతు

## పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ కౌంటర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 9:** కులగణన సర్వేపై కేటీఆర్‌కు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో కులగణన సర్వే పాదర్శకంగా జరిగిందని,.కేటీఆర్ ఎలాంటి ఆధారాలు లేకుండా బిసి కులఘననను తప్పులు తడక అంటున్నాడని తప్పుబట్టారు.ఎంతో శాస్త్రీయంగా లక్షకు పైన సిబ్బందిని పెట్టి ఇల్లిల్లు పరిశీలన చేసి ఘనన చేయడం జరిగిందని తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూకులఘనన దేశానికే ఆదర్శంగా చేపట్టమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంటే భరించలేక కెటీఆర్ ఏదేదో మాట్లాడుతున్నారని ఆరోపించారు.రాహుల్ గాంధీ ఆదేశాలనుసారం కులగణన సర్వేను కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పంతో పూర్తి చేసిందని,కులగణన సర్వేపై కేటీఆర్ వ్యాఖ్యలను బీసీ సమాజం క్షమించదన్నారు.1931 తర్వాత కులఘనన జరిగిందని,ఇది బీసీ లకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.పక్కాగా పకడ్బందీగా కులఘననను దేశంలోనే మొదటిసారి చేసిన ఘనత మా కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. 2014 లో సమగ్ర కుటుంబ సర్వే చేసి కనీసం ఆ లెక్కలను కూడా బయటకు చెప్పలేని అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పుడు మాట్లాడడం అవివేకమన్నారు.బీసీలకు న్యాయం జరుగుతుంటే కేటీఆర్ భరించలేక పోతున్నారు.కులగణన సర్వేలో పాల్గొనని కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులు రీసర్వే గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బలహీనవర్గాల గురించి కేటీ ఆర్ మాట్లాడటం హస్యాస్పద మని, పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ బీజేపీ లోపాయికారి ఒప్పందం జరిగిందని, బిఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులు కరువు అయ్యారని, పార్లమెంట్ ఎన్నికల్లో మాదిరిగానే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరోక్షంగా బీజేపీకి బిఆర్ఎస్ మద్దతిస్తున్నదని దుయ్యబట్టారు.

# గిట్టుబాటు కోసం ఆందోళనలు

## రోడ్డెక్కుతున్న వేరుశెనగ రైతాంగం

## రెండు రోజుల్లోనే రూ.3 వేలు తగ్గింపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా వేరుశనగ రైతులు రోడ్డెక్కుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండిచిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ ఆగ్రహాలు వ్యక్తం చేస్తున్నారు. కేవలం రెండు రోజుల్లోనే క్వింటా ధర ఏకంగా 3 వేల రూపాయలు తగ్గిపోవడంతో నష్టాలతో నిండా మునిగిపోతున్నామంటూ కన్నీటి పర్యాంతమవుతున్నారు. దీంతో గత్యంతరం లేక పలు జిల్లాల్లో రైతులు రోడ్డెక్కుతున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, వికారాబాద్ ఇలా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పల్లీల రైతులు రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. తెలంగాణాలో వేరుశనగ పంటపై ఆధారపడ్డ రైతులు ఎక్కువగానే ఉన్నారు. అయితే ఇప్పుడు ఈ రైతులకు పెట్టిన పెట్టుబడి తిరిగి వెనక్కు రావడం అటుంచితే నిండా అప్పుల్లో మునిగిపోయే దుస్థితి ఏర్పడింది. తాజాగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో క్వింటా వేరుశనగ ధర 7 వేల రూపాయల నుంచి ఏకంగా రెండు రోజుల్లో 4 వేలకు పడిపోయింది. ఇదేమని ప్రశ్నించేందుకు వెళ్లిన రైతులకు అధికారుల నుంచి బెదిరింపులు ఎదురవ్వడంతో రెచ్చిపోయారు. దీంతో మార్కెట్ యార్డులో వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. అలాగే వికారాబాద్ జిల్లాలో సైతం వందలాదిగా రోడ్డెక్కిన పల్లీ రైతులు, గిట్టుబాటు ధర కల్పించాలంటూ ఆందోళనలు చేశారు. ఇంతలా రోడ్డెక్కడానికి ప్రధాన కారణం లాభాలు పక్కన పెట్టి కనీసం గిట్టుబాటు ధరకూడా రాకపోవడమేనని రైతులు చెబుతున్నారు. గతంలో 500 రూపాయలు ఉండే ఎరువుల బస్తా ఇప్పుడు 1,800 రూపాయలు పలుకుతోంది. విత్తానాల ఖర్చు పెరిగిపోయింది. పురుగు మందుల ధరలు సరేసరి. కూలీల ఖర్చులు సైతం భారంగా మారాయి. ఇలా పెరిగిన ధరలను భరించి, ఆరుగాలం శ్రమించి, వేరుశనగ సాగు చేస్తే ఏకంగా రెండు రోజుల్లో క్వింటాకు మూడువేల రూపాయలు అమాంతం పతనమవ్వడంతో రైతులు తట్టుకోలేకపోతున్నారు.

తెల్లవారుజామున మూడు గంటలకు జోరున మంచుకురుస్తున్నా పల్లీలు కోసేందుకు వెళ్లి, రోజంతా పొలంలో శ్రమించి, మార్కెట్‌కు తీసుకొస్తున్నామని, ఇక్కడకు వచ్చిన తర్వాత మార్కెట్ కమిటీ, మిల్లర్లు కుమ్మక్కై ధరలు తగ్గిస్తున్నారని తెలంగాణలో వేరుశనగ రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే అధిక వడ్డీలతో బయట అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టాం, ఇప్పుడు కనీసం పెట్టిన పెట్టుబడి కూడా వెనక్కు రాకపోతే ఎలా బతకాలంటూ తెలంగాణా వేరుశనగ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా పంటకు నాణ్యత లేకపోతే రెండు రోజుల క్రితం క్వింటా 7 వేల రూపాయలకు పైగా ఎందుకు ధర పలికింది. ఇప్పుడు కేవలం రెండు రోజుల్లోనే ఎందుకు ఇంతలా పతనమైందని ప్రశ్నిస్తున్నారు.
ఇందంతా మార్కెట్ కమిటీల అధికారులు చేస్తున్న కుట్ర, కావాలనే రైతులను మంచుతున్నారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే దీనిపై మార్కెట్ కమిటీ మరోలా స్పందిస్తోంది. వాతావరణ పరిస్థితులు కారణంగా ఈ ఏడాది వేరుశనగ పంటలో ఆశించిన స్థాయిలో నాణ్యత లేదు. పంట నాణ్యత లేకపోవడం వల్లనే ధరలు అమాంతం పడిపోయాయి. ఇదే విషయం రైతులకు వివరించే ప్రయత్నం చేస్తున్నామంటున్నారు. కాగా ఇలాగే వదిలిస్తే గతంలో పత్తి రైతుల ఆత్మహత్యల తరహాలో పల్లీ రైతుల ఆత్మహత్యలు తప్పవంటూ హెచ్చరిస్తున్నారు రైతులు. తెలంగాణ ప్రభుత్వం జోక్యం చేసుకుని వెంటనే రైతులకు న్యాయం చేయాలనే డిమాండ్ చేస్తున్నారు.

# ఆర్థిక ఇబ్బందులతో ట్రావెల్స్ నిర్వాహకుడు ఆత్మహత్య

**హైదరాబాద్ (నాంపల్లి), ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఒక ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకుడు ఐదంతస్తుల భవనంపై నుండి కిందికిదదూకి ఆత్మహత్యకు పాల్పడిన దుస్సంఘటన ఆదివారం రాత్రి చిక్కడపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే చిక్కడపల్లి సిఐ రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం చిక్కడపల్లిలో నివాసముంటున్న ఎం.శ్రీనివాస్ (50) అనే వ్యక్తి కార్లు అద్దెకిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇటీవలే కుమార్తె వివాహం చేశాడు. ఒక కుమారు కెనడాలో ఉన్నత చదువులు అభ్యసించడానికి వెళ్లాడని, మరో కుమారుడు భారత్యతో కలిసి ఉంటున్నాడు. కూతురు కొన్నిరోజులుగా ఇక్కడే ఉంటుందని, వారం రోజులుగా ఇంట్లో గొడవలు జరగడంతో పాపయ్య ఎస్టేట్‌లోనే ఉంటున్నాడు. కుటుంబ ఆర్థిక సమస్యలవల్ల జీవితంపై విరక్తిచెంది అదే భవనంపై నుండి దూకి అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సిఐ రాజునాయక్ తెలిపారు.

# 'పుష్ప అందరికి జీవితాంతం గుర్తుండిపోతుంది'

## థ్యాంక్స్ మీట్‌లో ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్

**ఐకాన్ స్టార్** అల్లు అర్జున్, జీనియస్ దర్శకుడు సుకుమార్ కలయికలో అత్యంత ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి నిర్మించిన ఇండియన్ బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ 'పుష్ప2 ది రూల్. ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో అన్ కాంప్రమైజ్‌డ్‌గా నిర్మించారు. నిర్మాతలు నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్. డిసెంబరు 5న విడుదలైన ఈ చిత్రం ప్రపంచస్థాయిలో ఎంతటి గొప్ప విజయం సాధించింతో అందరికి తెలిసిందే. ఇండియన్ సినిమాలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా 'పుష్ప2 సరికొత్త రికార్డులు సృష్టించింది. రష్మిక మందన్నా నాయికగా నటించిన ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. కాగా ఈచిత్రం థ్యాంక్స్ మీట్ హైదరాబాద్‌లో జరిగింది. ఈ వేడుకలో చిత్రం యూనిట్ నటీనటులకు, సాంకేతిక నిపుణులకు హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్, నిర్మాతలు నవీన్ ఎర్నేని, రవి శంకర్ చేతుల మీదుగా షీల్డులు బహుకరించారు.




ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ, 'పుష్ప 2 జర్నీలో ఐదు నిమిషాల నుండి ఐదు ఏండ్ల వరకు పనిచేసిన అందరికి నా కృతజ్ఞతలు. పుష్ప పోస్టర్‌లో నా ఫొటో చూసుకున్న ప్రతిసారి.. నా మీద ఈ టీమ్ అంతా చూపిన ప్రేమే కనిపించింది. మీరు ఎంతో కష్టపడి అద్భుతమైన సినిమా ఇచ్చారు. నిర్మాతలు రవి, నవీన్ లేకుంటే పుష్ప సాధ్యమయ్యేది కాదు. ప్రతి డిపార్ట్‌మెంట్‌కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. దేవిశ్రీప్రసాద్ నా సాంగ్స్‌ను బిలియన్స్‌ల్లో చూపించాడు. దేవిశ్రీ ప్రసాద్ తన అద్భుతమైన సంగీతంతో సినిమాకు ఎనర్జీ ఇచ్చాడు. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఆదరించిన పుష్ప అభిమానులకు నా థ్యాంక్స్. నేను సుకుమార్‌కు థ్యాంక్స్ చెప్పి వదిలేయలేను. ఎందుకంటే అందరికి హిట్ ఇచ్చేది దర్శకుడే. ఈ సినిమా విషయంలో అందరూ సుకుమార్‌కు థ్యాంక్స్ చెప్పాలి. సుకుమార్ మాత్రం ఈ సినిమా విజయంలో అందరికి క్రెడిట్ ఇస్తాడు. కానీ అందరికి క్రెడిట్ ఇవ్వడానికి కారణం దర్శకుడు సుకుమారే. నా నటనకు ఎంతో మంచి పేరు వచ్చింది. దీనికి కారణం దర్శకుడు సుకుమారే. సుకుమార్‌కు నేను బిగ్గెస్ట్ ఫ్యాన్‌ని, ఆయన సీన్ చెబుతుంటే నాకు పిచ్చెక్కిపోతుంది. జీనియస్ దర్శకుడు సుకుమార్. నేను 'పుష్ప 2 షూటింగ్ అయిపోయిన తరువాత ఎంతో ఎమోషనల్ అయ్యాను. పుష్ప అనేది ఓ ఎమోషన్. ఈ సినిమా జరుగుతున్నప్పుడు ఐదు సంవత్సరాలు సుకుమార్ ఏది చెబితే అది చేశాం. ఈ సినిమాకు వెచ్చించిన ఐదు సంవత్సరాలు అందరికి జీవితాంతం గుర్తుండిపోతుంది. ఈ ఐదేళ్లు ప్రతి ఒక్కరికి ప్రతి సెకనుకు ఎంతో ఉపయోగపడింది. ఈ సినిమా సక్సెస్‌ను నా అభిమానులకు అంకితం చేస్తున్నాం. పుష్ప3 ఏంటో తెలియదు కాదు కానీ ఓ అద్భుతంలా కనిపిస్తుంది అన్నారు. దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ, మైత్రీ మూవీస్ చెర్రీ సలహాతోనే పుష్పను రెండు భాగాలుగా చేశాను. నాకు రంగస్థలం నుంచి ఇప్పటి వరకు వరుస హిట్స్ రావడానికి మైత్రీ మూవీస్ కారణం. నాపేరు సుకుమార్ కాదు. సుకుమార్ దేవిశ్రీ ప్రసాద్. దేవి లేకుండా నేను సినిమా చేయలేను. భవిష్యత్‌లో కూడా చేయలేను. ఇక అల్లు అర్జున్ నాకు ఎంతో ఎనర్జీ ఇస్తాడు. నా దగ్గర సరైన కథ లేకుండా బన్నీ ఒకే అన్నాడు. ఈ సక్సెస్ క్రెడిట్ మొత్తం అల్లు అర్జున్‌దే. నేషనల్ అవార్డ్ విన్నర్ పర్‌ఫార్మె చేస్తే ఎలా ఉంటుందో ఈ సినిమా అలా ఉంటుంది అని ప్రతి సన్నివేశం ముందు చెప్పేవాడిని. ఈరోజు ఆయన నటనకు ఎంతో మంది నుంచి ప్రశంసలు వస్తున్నాయి. ఈ సినిమా సక్సెస్‌లో భాగం అయిన అందరికి నా కృతజ్ఞతలు అన్నారు.

నిర్మాత రవిశంకర్, మాట్లాడుతూ 'పుష్ప2 కు పనిచేసిన అందరికి మా థ్యాంక్స్. ఇంత మంచి సినిమాలో పార్ట్ అయినందుకు హ్యాపీ. ఈ సినిమాకు హీరో, దర్శకుడు ఎంతో కష్టపడ్డారు. దేవి బ్యాక్‌బోన్ ఆఫ్ ది ఫిలిం. ఈ సినిమాకు పనిచేసిన అందరికి కృతజ్ఞతలు. అన్నారు.

నిర్మాత నవీన్ మాట్లాడుతూ, అంచనాలు మంచి కలెక్ట్ చేస్తుందని అనుకున్నాం కానీ. ఇంత పెద్ద బ్లాక్‌బస్టర్ అవుతుందని ఊహించలేదు. ఇంత మంచి సినిమా మా బ్యానర్‌కు ఇచ్చినందుకు హీరో, దర్శకుడికి కృతజ్ఞతలు అన్నారు.

దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ, ఎన్ని మాటలతో వర్ణించిన చెప్పలేం, పుష్ప అనేది ఓ మ్యాజిక్. ఈ మ్యాజిక్ క్రియేట్ చేసిన హీరో, దర్శకుడు, మైత్రీ మూవీ మేకర్స్ కృతజ్ఞతలు. కష్టపడితే యూనివర్స్ మనకు ఇవ్వాల్సింది ఇచ్చేస్తుంది దీనికి నిదర్శనం ఈ సక్సెస్. అందరి కష్టం, నిజాయితీకి ఈ పెద్ద బ్లాక్‌బస్టర్ అనేది నిదర్శనం. సుకుమార్ విజన్ 'పుష్ప2 ప్రపంచవ్యాప్తంగా ఎంతో గుర్తింపు వచ్చింది అన్నారు.



**అంతర్జాతీయస్థాయిలో**

భారత్‌ను గ్లోబల్ ఎంటర్టైన్మెంట్ హబ్‌గా మార్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది చివర్లో వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ (వేవ్స్)ను నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో ఇండియన్ సినీ, పారిశ్రామిక ప్రముఖులందరితోనూ ప్రధాని నరేంద్ర మోడీ వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. ఈ క్రమంలో మెగాస్టార్ చిరంజీవిని వేవ్స్ అడ్వైజరీ బోర్డులో భాగం చేశారు. ఈ మేరకు చిరంజీవి తాజాగా తన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ప్రధాని మోడీ నాడు వేవ్స్ అడ్వైజరీ బోర్డు మెంబర్లతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. ఇందులో చిరంజీవి, సుందర్ పిచాయ్, సత్య నాదేళ్ల, ముఖేష్ అంబానీ, ఆనంద్ మహీంద్రా, అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్, మోహన్ లాల్, రజినీకాంత్, ఆమీర్ ఖాన్, ఏఆర్ రెహమాన్, అక్షయ కుమార్, రణ్ బీర్ కపూర్, దీపిక పదుకొణె వంటి వారు పాల్గొన్నారు.

## 'వేవ్స్' కమిటీలో భాగమైనందుకు సంతోషంగా ఉంది

## ప్రధాని మోడీకి మెగాస్టార్ చిరంజీవి ధన్యవాదాలు

ఆర్థికరంగం కోసం దావోస్‌లోని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఎలా జరుగుతుందో.. వినోద పరిశ్రమ కోసం అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సుగా వేవ్స్‌ను రూపొందిస్తున్నారు. వినోదం, సృజనాత్మకత, సంస్కృతిలో భారతదేశాన్ని ప్రపంచ అగ్రగామిగా అభివృద్ధి చేయడం దీని లక్ష్యం. ఈ మేరకు మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఇంతటి మహోత్తరమైన కార్యక్రమంలో భాగం చేసిన గౌరవనీయులైన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారికి ధన్యవాదాలు. వేవ్స్ అడ్వైజరీ బోర్డ్‌లో భాగం కావడం, ఇతర గౌరవనీయమైన సభ్యులతో పాటుగా నా ఆలోచనల్ని పంచుకోవడం ఆనందంగా ఉంది. మోడీ మానస పుత్రిక అయిన వేవ్స్ భారతదేశాన్ని ప్రపంచ వేదికలపై సగర్వంగా చాటుకునేలా చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. త్వరలో జరగనున్న అద్భుతాల కోసం మనమంతా ఎదురుచూస్తుండాలి అని అన్నారు. ఈ భేటీ మీద ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందిస్తూ.. వినోదం, సృజనాత్మకత, సంస్కృతి ప్రపంచాన్ని ఒకచోట చేర్చే ప్రపంచ శిఖరాగ్ర సదస్సు అయిన వేవ్స్ అడ్వైజరీ బోర్డ్ విస్తృతమైన సమావేశం ఇప్పుడే ముగిసింది. అడ్వైజరీ బోర్డు సభ్యులు వివిధ రంగాలకు చెందిన ప్రముఖ వ్యక్తులు, వారు తమ మద్దతును పునరుద్ఘాటించడమే కాకుండా భారతదేశాన్ని గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా మార్చడానికి మా ప్రయత్నాలను ఎలా మరింత మెరుగుపరచాలనే దానిపై విలువైన సలహాలు, సూచనల్ని పంచుకున్నారు అని అన్నారు.

## పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి చేసుకున్న 'చంద్రేశ్వర'



**శివ బాలాజీ** ఫిలింస్ పతాకంపై బేబీ అఖిల సమర్పణలో సురేష్ రవి ,ఆశా వెంకటేష్ హీరో హీరోయిన్లుగా జీవి పెరుమాళ్ వర్ధన్ దర్శకత్వంలో డాక్టర్ రవీంద్ర చారి నిర్మించిన ఎమోషనల్ ఎంటర్టైనర్ 'చంద్రేశ్వర. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్ర చారి మాట్లాడుతూ ఇదొక ఆర్కియాలజీ నేపథ్యంలో ఎమోషనల్ తో కూడిన సస్పెన్స్ థ్రిల్లర్. ఈ సినిమాలో మంచి డివోషనల్ టచ్ కూడ వుంటుంది . ఈ చిత్రంలో శివుని నేపథ్యంలో ఉండే సాంగ్ ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుంది. జరార్డ్ ఫెలిక్స్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా ఈ చిత్రం ప్రతి ఒక్కరిని ఆకట్టుకునేలా తీర్చిదిద్దడం జరిగింది. అలాగే సీనియర్ నటులు ఎంతోమంది ఈ చిత్రంలో నటించారు. ఈ చిత్రాన్ని అన్ని కమర్షియల్ హంగులతో ఫిబ్రవరి నెల ఆఖరుకు విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం అని అన్నారు. సురేష్ రవి, ఆశ వెంకటేష్, నిలగల్ రవి, బోసే వెంకట్, అడుకులం మురుగదాస్ గజరాజ్, జె ఎస్ కే గోపి, తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: జెరాడ్ ఫిలిక్స్, డిఓపి: ఆర్వి సీయోన్ ముత్తు, సింగర్స్: సాయి చరణ్, లిరిక్స్: వెంకట్, జ్యోతి, డిటిఎస్: శ్యామ్, ఎడిటర్: నందమూరి హరి, పిఆర్వో: బి. వీరబాబు, కో ప్రొడ్యూసర్ పి.సరిత , వి. బాలకృష్ణ,ప్రొడ్యూసర్: డాక్టర్ రవీంద్ర చారి, డైరెక్టర్: జీవి పెరుమాళ్ వర్ధన్

## కంటెంట్ బేస్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్..



**ఎటువంటి** బ్యాగ్రౌండ్ లేకుండా తెలుగు ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న విలక్షణమైన నటులలో రాగ్ మయూర్ ఒకరు. "సినిమా బండ్డి సినిమా తోనే విలక్షణమైన హీరోగా మంచి పేరు సంపాదించుకుంటున్నాడు. అద్భుతమైన పాత్రలకు కేరాఫ్ అడ్రస్ అవుతున్నాడు. వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకోకుండా నచ్చిన పాత్రలను మాత్రమే చేస్తూ కెరియర్‌లో ఆచితూచి ముందడుగు వేస్తున్నాడు. తను ఏ పాత్ర చేసిన చాలా సహజంగా నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నాడు.

'సినిమా బండ్డి సినిమా ఎంత పెద్ద హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా ఆ సినిమాలో మరిడేష్ బాబు అనే పాత్రలో కనిపించిన రాగ్ మాయూర్ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. మరిడేష్ బాబు పాత్రలో రాగ్ మయూర్ నటించాడు అనేకంటే ప్రవర్తించాడు అని చెప్పాలి. ఆ సినిమాతోనే మంచి గుర్తింపు రావడంతో పాటు వరుసగా అవకాశాలు కూడా వచ్చాయి. రీసెంట్‌గా పంచాయత్ సినిమాకి రీమేక్ గా తెరకెక్కిన సివరపల్లి వెబ్ సిరీస్ ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో ట్రెండింగ్ లో ఉంది. ఈ సినిమాలో శ్యామ్ అనే పాత్రలో కనిపించాడు రాగ్ మయూర్. ఇంజనీరింగ్ చదువుకొని అమెరికా వెళ్లాలి అనుకునే ఒక కుర్రోడు సివరిపల్లి అనే ఒక ఊరికి పంచాయతీ సెక్రటరీగా వెళ్లడం, అక్కడ జరిగే కొన్ని పరిణామాలు ఆసక్తికరంగా, సహజంగా అనిపిస్తాయి. కొన్ని ఎమోషనల్ సీన్స్ లో రాగ్ మయూర్ నటించిన విధానం వర్ణనాతీతం అని చెప్పాలి. అందుకే ఈ వెబ్ సిరీస్ చాలామందికి విపరీతంగా నచ్చింది. సుకుమార్ కూతురు సుకృతి నటించిన గాంధీ తాత చెట్టు సినిమాకు కూడా మంచి ప్రశంసలు వచ్చాయి. ఈ సినిమాలో విలన్ పాత్రలో నటించాడు రాగ్ మయూర్. సూపర్ స్టార్ మహేష్ బాబు ఈ సినిమా గురించి ట్విట్టర్ వేదికగా రాసుకొచ్చారు. ఒకే రోజు రెండు వైవిధ్యమైన పాత్రల్లో నటించిన సినిమాలు రిలీజ్ అవ్వడం కూడా రాగ్ కెరియర్ లో ఒక అరుదైన అంశం. ప్రస్తుతం రాగ్ మయూర్ గరివిడి లక్ష్మి అనే సినిమాలో హీరోగా నటిస్తున్నాడు. ఈ సినిమాలో ఉత్తరాంధ్ర యాసను రాగ్ మయూర్ మాట్లాడబోతున్నట్లు సమాచారం వినిపిస్తుంది. ఈ సినిమా కూడా రాగ్ కెరియర్‌కు ప్లస్ కాబోతోంది అన్నారు.

## 'శంబాల్ల' నుంచి స్వాసిక ఫస్ట్ లుక్ పోస్టర్..



**లబ్బర్ పందు,** పోరింజు మరియం జోస్, సత్తై, అయలుం నానుమ్ తమ్మిల్, ఇష్క్,సీబీఐ 5, కుమారి మొదలైన తమిళ, మలయాళ భాషల్లో నటించి స్వాసిక మంచి గుర్తింపును సంపాదించుకున్నారు. ఎన్నో కమర్షియల్ బ్లాక్‌బస్టర్‌లను తన ఖాతాలో వేసుకున్న స్వాసిక ప్రస్తుతం తెలుగు ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. ఆది సాయి కుమార్ హీరోగా సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్ శంబాల ఏ మిస్టిక్ వరల్‌లో స్వాసిక హీరోయిన్‌గా నటించారు. ఈసినిమాను రాజశేఖర్ అన్న భీమోజు, మహీధర్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తుండగా.. యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్నారు. వసంత పాత్రలో స్వాసిక శంబాల చిత్రంలో కనిపించనున్నారు. తాజాగా రిలీజ్ చేసిన ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఎరుపు రంగు చీరలో స్వాసిక కనిపించిన తీరు.. ఆమె చూపులు, చుట్టూ ఉన్న వాతావరణం, ఆ పక్షి, దిష్టిబొమ్మ ఇలా అన్నింటినీ చూస్తుంటే సినిమా మీద మరింత ఆసక్తి పెరిగేలా ఉంది. శంబాల చిత్రం ఓ సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో రాబోతోంది. ఈ మూవీలో ఆది సాయి కుమార్ భౌగోళిక శాస్త్రవేత్తగా ఓ ఛాలెంజింగ్ రోల్‌లో కనిపించనున్నారు.




## 'మదం' చూడాలంటే గుండె ధైర్యం కావాలి..

**హర్ష గంగవరపు,** లతా విశ్వనాథ్, ఇనయ సుల్తాన ప్రధాన పాత్రల్లో ఏకైవ హోమ్స్ ప్రై.లి. బ్యానర్ మీద సూర్యదేవర రవీంద్రనాథ్ (చిన్న బాబు), రమేష్ బాబు కోయ నిర్మించిన చిత్రం 'మదం. ఈ చిత్రానికి వంశీ కృష్ణ మల్లా దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని మార్చి 14న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో మూవీకి సంబంధించిన టీజర్‌ను తండేల్ సినిమాతో పాటుగా థియేటర్లలో యాడ్ చేశారు. ప్రస్తుతం మదం మూవీ టీజర్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. దీంతో చిత్రయూనిట్ మీడియా ముందుకు వచ్చింది. ఈ టీజర్ సక్సెస్ అయిన సందర్భంగా డైరెక్టర్ వంశీకృష్ణ మల్లా మాట్లాడుతూ, మా మదం సినిమా మార్చి 14న రిలీజ్ కాబోతోంది. ఈ చిత్రానికి పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా నిర్మాత రమేష్ ఇచ్చిన కథను చూసినప్పుడు నాకు చాలా భయమేసింది. ఇంతటి రా, రస్టిక్ సినిమా తెలుగులో రావడం అరుదు. తమిళ్, మలయాళీ భాషల్లో ఇలాంటి కంటెంట్ వస్తుంటుంది. మదం కథ నాకు చాలా నచ్చింది. ఇలాంటి క్లైమాక్స్ ఇప్పటి వరకు ఇండియన్ సినీ హిస్టరీలో రాలేదు. ఈ మూవీని చూడాలంటే చాలా గుండె ధైర్యం కావాలి అని అన్నారు. రైటర్ రమేష్ బాబు కోయ మాట్లాడుతూ,నా కథను ఇంత అద్భుతంగా తీసిన వంశీకృష్ణకు థాంక్స్. మాకు ఈ ప్రయాణంలో సహకరించిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. టీజర్‌ను ఇంత బాగా ఆదరిస్తున్న ఆడియెన్స్‌కు ధన్యవాదాలు అని అన్నారు.

ఇనయ సుల్తానా మాట్లాడుతూ,నాకు నెగెటివ్ పాత్రలు చేయడమంటే ఇష్టం. మదం చిత్రంలో నేను చాలా ఇంపార్టెంట్ కారెక్టర్‌ను చేశాను. మా డైరెక్టర్ వంశీ గారు సినిమాను అద్భుతంగా తీశారు. నా క్లిష్ట పరిస్థితుల్లో వంశీ గారు సపోర్ట్‌గా నిలిచారు. నేను బాగా నటించడానికి ఆయనే కారణం. లత నాకు మంచి స్నేహితురాలు. హర్ష చాలా రియలిస్టిక్‌గా నటించాడు. సినిమా అద్భుతంగా వచ్చింది. మార్చి 14న సినిమా రాబోతోంది. అందరూ చూడండి అని అన్నారు.



హర్ష గంగవరపు మాట్లాడుతూ, మదం సినిమాకు కథే హీరో. ఇందులో హై ఎమోషన్స్ ఉంటాయి. కథ చాలా బాగుంటుంది. దానికి తగ్గ పాత్రలు అందరికీ పడ్డాయి. అన్ని కారెక్టర్స్ బాగుంటాయి. నటించే స్కోప్ అందరికీ దొరికింది. మా రమేష్ కథ, వంశీ మేకింగ్ అద్భుతంగా ఉంటుంది. అందరికీ మా సినిమా నచ్చుతుందని భావిస్తున్నాను అని అన్నారు.

లతా విశ్వనాథ్ మాట్లాడుతూ,నా నిజ జీవితంలో దగ్గరగా ఉండే పాత్రను పోషించాను. అందుకే నాకు ఎక్కడా కష్టంగా అనిపించలేదు. నాకు ఇంత మంచి పాత్రను ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. నా ఫ్రెండ్ ఇనయతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. హర్షతో నటించడం సంతోషంగా ఉంది. మా సినిమా మార్చి 14న రాబోతోంది. అందరూ సపోర్ట్ చేయండి అని అన్నారు.

# 'లైలా' ఫన్ రైడ్ లా ఉంటుంది

**- నిర్మాత సాహు గారపాటి**



**మాస్ కా దాస్** విశ్వక్సేన్ యూనిక్ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్టైనర్ 'లైలా'ఎక్సయిటింగ్ ప్రమోషనల్ కంటెంట్‌తో స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రానికి రామ్ నారాయణ్ దర్శకత్వం వహించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించారు. ఆకాంక్ష శర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. పాటలు చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. లేటెస్ట్ గా విడుదలైన ట్రైలర్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. లైలా ఫిబ్రవరి 14న బిగ్ స్క్రీన్స్ లో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత సాహు గారపాటి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

**లైలా సినిమా నిర్మించడానికి మిమ్మల్ని ఎట్రాక్ట్ చేసిన ఎలిమెంట్స్ ఏమిటి ?**

మెయిన్ కామెడీ. దీంతో పాటు ఒక హీరో ఇలాంటి కథని చేస్తానని యాక్సప్ట్ చేయడం నాకు చాలా నచ్చింది. అంతకుముందు కొందరు హీరోలని సంప్రదించాం. లేడి గెటప్ చేయడం అంత ఈజీ కాదు. విశ్వక్ చేస్తానని చెప్పడంతో నాకూ ఇంట్రస్ట్ కలిగి ముందుకు తీసుకెళ్ళాం. ఇలాంటి కథలు వచ్చి చాలా కాలమైయింది. విశ్వక్ చాలా జీల్ వున్న యాక్టర్. ఈ కథ విన్నవెంటనే అన్న ఇది నేనుచేయాల్సిన క్యారెక్టర్ అని చెప్పారు. ఇందులో లవ్ స్టోరీతో పాటు ఫన్ ఎంటర్ టైన్మెంట్ వుంటుంది.

**లైలా, సోను క్యారెక్టర్స్ బ్యాలెన్స్ ఎలా వుంటుంది ?**

ఫస్ట్ హాఫ్ అంతా సోను వుంటాడు. తన లవ్ స్టోరీ ఫస్ట్ హాఫ్ లో వుంటుంది. అనుకోని కారణంగా తనని లైలా గా మార్చుకొని ఇన్నోసెన్స్ ని ప్రూవ్ చేసుకుంటాడు. ఆ రీజన్ చాలా ఎమోషనల్ గా వుంటుంది. విశ్వక్ లైలా గెటప్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది, అందరూ లుక్ పర్ఫెక్ట్‌గా సెట్ అయ్యిందని అంటున్నారు. నా వరకూ లైలాకే ఎక్కువ మార్కులు వేస్తాను. ట్రైలర్ చూస్తుంటే అడల్ట్ కామెడీ అనిపిస్తోంది.

**ఇలాంటివి బాలీవుడ్‌లో ఎక్కువగా వర్క్ అవుతాయి కదా ?**

అడల్ట్ కామెడీ అన్ని చోట్ల వుంది. ట్విట్టర్ ఓపెన్ చేస్తే కనిపించేదంతా అదే కదా. దానితో పోల్చుకుంటే ఇది చాలా తక్కువ. హీరో లేడీ క్యారెక్టర్, కొందరికి అర్థం కాని డెక్కన్ లాంగ్వేజ్ మాట్లాడటం వలన 'ఏ' సర్టిఫికేట్ ఇచ్చారు కానీ సినిమాలో ఆడల్ట్ కామెడీ అంటూ ఏమీ లేదు. రెగ్యులర్‌గా మనం మాట్లాడుకున్నట్లే ఉంటుంది.

**యూత్ ని టార్గెట్ చేసినట్లుగా అనిపిస్తోంది ?**

యూత్ ని టార్గెట్ చేశాం. అయితే ఫ్యామిలీ ఆడియన్స్ కూడా ఎంజాయ్ చేస్తారు. నవ్వించాలనే ప్రయత్నంతో చేసిన సినిమా ఇది. అందులో సక్సెస్ అయ్యామని నమ్ముతున్నాం.

**రేపు మెగాస్టార్ చిరంజీవి ఈవెంట్ కి వస్తున్నారు కదా.. ఆయన ట్రైలర్ చూశారా ?**

ట్రైలర్ చూశారు. కొత్త ప్రయత్నం చేశామని విశ్వక్‌ని మెచ్చుకున్నారు. ఆయనకి ట్రైలర్ చాలా నచ్చింది. మమ్మల్ని ఎంకరేజ్ చేయడానికి ఆయన రావడం మా అదృష్టం.

**చిరంజీవితో సినిమా ఎప్పుడు స్టార్ట్ చేస్తున్నారు?**

మే, జూన్‌లో స్టార్ట్ అవుతుంది. నెక్స్ట్ సంక్రాంతికి రిలీజ్ చేస్తాం. అనిల్ రావిపూడి మార్క్‌లో పర్ఫెక్ట్ కమర్షియల్ సినిమాలా వుంటుంది. వింటేజ్ చిరంజీవిలా ఆయన రోల్ ఉంటుంది.

**డైరెక్టర్ రామ్ నారాయణ్ గురించి ?**

తన కథకు తగ్గట్టుగా విశ్వక్‌ని చూపించడంలో డైరెక్టర్ వందశాతం సక్సెస్ అయ్యాడు. సినిమాని చాలా అద్భుతంగా తీశాడు. లైలా అనే టైటిల్ దర్శకుడు స్క్రిప్ట్ రాసుకున్నప్పుడే ఫిక్స్ చేసుకున్నాడు. తను అనుకున్నది పెర్ఫెక్ట్ గా ప్రజెంట్ చేశాడు.

**లైలాలో ఎమోషనల్ పాయింట్ ఏమిటి ?**

లైలా కంప్లీట్ ఎంటర్ టైనర్. హైదరాబాద్ బ్యాక్ డ్రాప్ లో వుంటుంది. అందులో మదర్ ఎమోషన్ కూడా హత్తుకునేలా వుంటుంది. సినిమా అంతా ఫన్ రైడ్ లా వుంటుంది. రెండు గంటల పాటు హాయిగా నవ్వుకుందామని తీసిన సినిమా లైలా.

**ఒక నిర్మాత కావాలని వచ్చిన వారికి మీరు ఏం చెప్తారు ?**

ఫ్రాంక్ గా చెప్పాలంటే మార్కెట్ కొంచెం ఇబ్బంది గానే వుంది. మనం అనుకున్న బడ్జెట్‌లో చూసుకుంటే హ్యాపీ. పెరిగితే ఎవరికైనా ఇబ్బందే.

# ఆ ఊరు ప్రపంచానికి పరిచయమైంది!

ఊరు, ఊళ్లోని ప్రజలు... ఇదే మా ప్రపంచం. ఝార్ఖండ్ 'బుండూ' అంటే ఒక పల్లె ఉందన్న సంగతి ఆ రాష్ట్ర ప్రజలకే తెలిసుండదు. కానీ ఇప్పుడు మా ఊరి పేరునీ, మా నాయకుడి గొప్పతనాన్ని ఇంత పెద్ద వేదిక మీద పొగుడుతోంటే ఆనందంగా ఉంది. ఇప్పుడు మా ఊరు ప్రపంచానికి పరిచయమైంది అంటోంది పూన్. 'ప్రధానమంత్రిని అల్లంత దూరం నుంచి చూస్తామను కున్నాం. కానీ ఆయన మాటతో మాట్లాడతారని అనుకో లేదు. ప్రధాని నివాసం, పార్లమెంట్ చూస్తామని కల లోనైనా ఊహించలేదు. ఇవన్నీ నిజంగా జరుగుతోంటే కలలో ఉన్నట్లుగానే ఉంది' అని తమ అనుభవాలను చెప్పారు. ఛత్తీస్గఢ్ నుంచి వచ్చిన 'బైగా' మహిళలు. ఇంట్లో ఒక టీవీ ఉంటే బాగుండు. ప్రపంచాన్ని తెలుసుకోవచ్చు. జెండా వందనం, పరేడ్ స్టేజ్ ఎలా జరుగుతాయో చూడొచ్చు అనుకునేదాన్ని. కానీ ఇంత దగ్గరగా నా కళ్లారా చూసిన అనుభూతి ముందు అదెం? ఆ అర్హత మాకుందన్న భావనే కొత్తగా ఉంది అంటోంది లద్దానికి చెందిన జుబేదా. ఎవరు వీళ్లంతా అంటే.. ఈ



గణతంత్ర వేడుకలకు సామాన్యులకూ ఆహ్వానాలు అందా యని తెలుసుగా! ఆ జాబితాలో ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందిన వివిధ రాష్ట్రాలకు చెందిన 550 మంది= గిరిజనులు ఉన్నారు. వీళ్లంతా వాళ్లే. 19 ఏళ్ల నుంచి 50కి పైగా వయసున్న వారు ఈ ఆహ్వానా లను అందుకున్నారు. కానీ వీరిలో జీవితంలో ఒక్క సారి కూడా ఊరు దాటనివారే ఎక్కువ. కాక పోతే ప్రభుత్వ ఆసరాని అందుకు బతుకుల్ని మార్చు కున్నారు. రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనే అవకాశం వచ్చింది. అలా వాళ్ల జీవితాల్లో ఇది ఓ అరుదైన సంఘటన మాత్రమే కాదు... మేమూ ఎవరికీ తీసి పోము. తలుచుకుంటే ఏదైనా సాధించగలమన్న ఆత్మవిశ్వాసాన్ని వాళ్లలో పెంచిన సందర్భం కూడా.



# ఆమె పెళ్లి రాష్ట్రపతి నిలయంలో..





**రాజుల కాలం నాటి కోట్లు, ప్రకృతి అందాలతో అలరారే ప్యాలస్‌లు, సముద్రపు అలల హోరుతో ఆహ్లాదాన్నిచ్చే బీచ్‌లు.. పెళ్లి వేదికలుగా మారుతున్న రోజులివి. కొన్ని సెలబ్రిటీలు, సంపన్నులు ఈ ప్రాంతాలనే తమ పెళ్లి మండపాలుగా ఎంచుకొంటున్నారు. అందుకే వీళ్ల వివా హాలు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారుతుంటాయి. అయితే వృత్తినే దైవంగా భావించే సీఆర్పీఎఫ్ అధికారిణి పూనమ్ గుప్తా కూడా తన పెళ్లి ఇలాగే అందరి దృష్టిని ఆకర్షిం చేలా జరగాలి.** అలాగని గోవా లాంటి బీచుల్ని, రాజ స్థానంలో కొలువైన కోటల్ని తన పెళ్లి వేదికగా చేసుకోవా లనుకోలేదామె. అంతకుమించి.. భారతీయ సంస్కృతికి, వారసత్వానికి ప్రతీకగా నిలిచే రాష్ట్రపతి నిలయంలో పెళ్లి పీటలెక్కేందుకు రడీ అయింది. ఇలా రాష్ట్రపతి భవనం లో జరగనున్న తొలి వివాహం ఇదే కావడం విశేషం! అందుకే ప్రస్తుతం పూనమ్ పేరు దేశవ్యాప్తంగా మార్మోగు తోంది. అసలు ఈ అధికారికి ఈ అవకాశం ఎలా వచ్చింది!

**ముర్ము మనసు గెలుచుకొని:** వివాహం... ప్రతిఒక్కరి జీవితంలో ఓ మధుర ఘట్టం. అందుకే ఈ వేడుకను ఆత్మీయుల సమక్షంలో ఘనంగా జరుపుకుంటారు. సీఆర్పీ ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అయిన పూనమ్ గుప్తా కూడా ఇలాగే ఆలోచించింది. ప్రస్తుతం రాష్ట్రపతి భవన్ 'వ్యక్తిగత భద్రతా అధికారిణి (PSO)'గా విధులు నిర్వర్తిస్తున్న ఆమె.. తాను పనిచేసే చోటే వివాహం చేసుకోవాల్సి ఉంది. అయితే అదంతా సులభం కాదు. రాష్ట్రపతి భవనంలో వివాహమంటే దేశ రాష్ట్రపతి అనుమతి కావాలి. విధి నిర్వహణలో తాను చూపిన నిబద్ధత, అంకితభావంతోనే ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మనసు గెలుచుకుంది పూనమ్. దీనితో పూనమ్ కోరిక ప్రకారం రాష్ట్రపతి భవనంలో వివాహం చేసుకునేం దుకు ఆమె అనుమతించారు. అందుకే పెళ్లికి ముందే ఈ అధికారికి జీవితాంతం మర్చి పోలేని కానుకను అందిం చారు. ముర్ము ఇలా రాష్ట్రపతి నిలయంలో మనువాడ నున్న తొలి వ్యక్తిగా పూనమ్ పేరు చిరస్థాయిగా నిలిచి పోనుంది. ఫిబ్రవరి 12న ఇక్కడి మదర్ థెరిసా క్రాస్ కాంప్లెక్స్‌లో తన కుటుంబ సభ్యులు, అతి కొద్దిమంది బంధువుల సమక్షంలో వివాహ బంధంలోకి అడుగు పెట్టనున్నారు డేరింగ్ ఆఫీసర్.

**లేఖ రాసి.. అమమతి కోరి!** సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అయిన పూనమ్ విధి నిర్వహణలో అడుగ డుగునా తన అంకితభావాన్ని ప్రదర్శిస్తుంది. ఈ చెల్లింపునే రెండేళ్ల క్రితం గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో మహిళా బృందానికి నాయకత్వం వహించి వార్తల్లో నిలి చింది. ప్రస్తుత రాష్ట్రపతి నిలయంలో వ్యక్తిగత భద్రతా అధికారిణి (పీఎస్ఓ)గా సేవలందిస్తున్న ఆమె.. గతంలో బీహార్‌లోని నక్సల్స్ ప్రభావిత విభాగాలనూ పనిచేసి.. ధైర్యసాహసాలు ప్రదర్శించారు. ఇలా తన వృత్తిలో భాగంగా ఎలాంటి సవాలుకైనా వెనకాడని ఆమెకు.. జమ్మూకశ్మీర్‌లో సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాం డెంట్‌గా పనిచేస్తున్న అవినాశ్ కుమార్‌తో ఇటీవలే పెళ్లి నిశ్చయ మైంది. ఈ జంట రాష్ట్రపతి భవన్‌లోనే వివాహం చేసుకోవాలనుకున్నారు. అయితే ఇందుకు అనుమతి కోరుతూ రాష్ట్రపతికి లేఖ రాసినట్లు చెబుతోంది పూనమ్. **రాష్ట్రపతి అధికారిక నివాసం..** భారతీయ సంస్కృతి, సంప్ర



దాయాలు, చారిత్రక వార సత్వానికి ప్రతీక ఇక్కడ విధులు నిర్వహించడం గౌరవంగా భావించాను. అందుకే.. ఇక్కడే పెళ్లి చేసుకోవాల నుకున్నా. కానీ అం దుకు ముర్ము జీ ఆమోదం కావాలి. కాబట్టి.. మేడమ్ అనుమతి కోరుతూ లేఖ రాశాను. ఆమె పెద్ద మనసుతో నా విన్నపాన్ని అంగీకరిస్తూ.. మా వివాహానికి ప్రత్యేక అనుమతి ఇచ్చారు. దీంతో రాష్ట్రపతి నిలయంలో మను వాడనున్న తొలి జంటగా మా పేరు మార్మోగ నుంది... అంటూ సంబరపడిపోతోంది మహిళా అధికారిణి.

**చిన్ననాటి కల..** మధ్యప్రదేశ్‌కు చెందిన పూనమ్‌కు చిన్నప్పట్నుంచీ సైన్యంలో చేరాలని కోరిక, గణిత డిగ్రీ డిగ్రీ పూర్తిచేసిన ఆమె.. ఆపై ఆంగ్ల సాహిత్యంలో చదివింది. తర్వాత ప్రభుత్వ పోటీలపై దృష్టిసారించిన పూనమ్.. 2018లో యూపీఎస్సీ సీఏపీఎఫ్ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభకనబరుస్తూ ఆలిండియా 81వ ర్యాంక్‌ని సాధించింది. సీఆర్పీఎఫ్ ఉద్యోగం రావడంతో నా కల నెరవేరింది. బిహార్‌లోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతంలో తొలి పోస్టింగ్ అందుకుంది. ఇదెంతోగా సవాలు, సాహ సోపేతంగా అనిపించింది. అనుక్షణం. అప్రమత్తంగా ఉం టూనే, ధైర్యసాహసాలు ప్రదర్శిస్తూ విధులు నిర్వర్తిం చాను. దీనితో రాష్ట్రపతి నిలయంలో వ్యక్తిగత భద్రతా అధికారిగా ప్రమోషన్ అందుకున్నారు. ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భద్రతను పర్యవేక్షించే బృందంలో భాగమయ్యాను. ఈ అవకాశం రావడం నా అదృష్టం.. అని చెబుతోన్న పూనమ్ సోషల్మీడియాలోనూ చురుగ్గా ఉంటుంది. ఇన్స్టా వేదికగా తన వృత్తికి సంబంధించిన విషయాలు పంచుకుంటూ విద్యార్థుల్లో, ఈ తరం అమ్మాయిల్లో స్ఫూర్తిఖి నింపుతోంది లేడీ ఆఫీసర్.

# అందానికి చెరకు

రుచితో పాటు పోషకాలు నిండి ఉన్న చెరకు రసం ఆరోగ్యానికే కాదు.. అందానికి, కేశ సౌందర్యానికి మేలు చేస్తుందంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందాం రండి..

**చర్మకాంతికి..** చెరకురసంలో కొద్దిగా ముల్తానీ మట్టిని కలిపి



పేస్ట్ చేసుకుని ముఖానికి పట్టిస్తే చర్మంపై ఉన్న నల్ల మచ్చలు తొలగిపోతాయి. ఇందులో ఉండే సమ్మేళనాలు చర్మకణాలను పునరుత్తేజితం చేస్తాయి. చెరకు రసంలో తేనె కలిపి.. ఈ మిశ్రమంతో పావుగంట పాటు చర్మానికి మర్దన చేయాలి. తర్వాత ఇరవై నిమిషాల పాటు ఉంచి కడిగేయాలి. వారానికి రెండుసార్లు ఇలా చేయడం వల్ల చర్మం మృదువుగా మారుతుంది.

.కాఫీపొడికి కాస్త చెరకురసాన్ని చేర్చి స్క్రాబ్‌లో ఉపయోగిస్తే చర్మం కాంతులీనుతుంది.


నిమ్మరసం, యాపిల్ జ్యూస్, ద్రాక్ష రసం, కొబ్బరి పాలు, చెరకు రసం.. వీటని సమపాళ్లలో తీసుకొని బాగా కలుపు కోవాలి. ఈ మిశ్రమాన్ని చర్మానికి పట్టించాలి. ఇలా చేయడం వల్ల చర్మంపై ఉన్న మొటిమలు, మచ్చలు తొలగిపోయి మేనికి మెరుపు వస్తుంది. చర్మాన్ని యవ్వనంగా, బిగుతుగా ఉంచడానికి మామూలు ఐస్క్యూబ్ల కన్నా చెరకు రసంతో తయారు చేసుకున్న ఐస్ క్యూబ్‌ను వాడితే రెట్టింపు ఫలితాలుంటాయని నిపుణులు భావిస్తున్నారు. బొప్పాయి గుజ్జులో చెరకు రసాన్ని కలిపి పట్టించడం వల్ల చర్మం బిగుతుగా మారుతుంది.

.. నాలుగు చెంచాల చెరకు రసానికి రెండు చెంచాల నెయ్యి చేర్చి.. ఈ మిశ్రమంతో చర్మానికి మర్దన చేస్తే ఎండ వల్ల



కమిలిన చర్మం తిరిగి కొత్త నిగారింపును సంత రించుకుంటుంది. లీటరు నీటిలో గుప్పెడు పుదీనా ఆకులు, పావు లీటరు చెరకు రసం కలిపి, మరిగించి ఆవిరి పట్టుకుంటే చర్మం తేటగా తయారవుతుంది. ఎటువంటి పదార్థాలూ కలపకుండా స్వచ్ఛమైన చెరకు రసాన్ని ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు చర్మానికి పట్టిస్తే చర్మం ఆరోగ్యంగా, మృదువుగా మారుతుంది. కురులకు కొత్త కళ.. చెరకు రసాన్ని కుదుళ్లకు పట్టించి గంట తర్వాత గోరు వెచ్చని నీటితో తలస్నానం చేస్తే పొడిబారిన జుట్టు తిరిగి పట్టులా మెరుస్తుంది. చెరకు రసం జుట్టుకు సహజ సిద్ధమైన కండిషనర్గా ఉపయోగపడు తుంది.

# అరటిపండు అందాలు




ఇతర ఏ పండ్లలోనూ లేనన్ని సుగుణాలు అరటిపండ్లలో ఉన్నాయంటే అతిశయం కాదు. ఇవి రుచీ, బలమే కాదు ధర కూడా స్వల్పం. ఈ తియ్యటి పండ్ల మీది ప్రేమతో చూడముచ్చటైన ఆకృతులిచ్చి, పళ్లేల్లో అమర్చారు. ఇక పిల్లలు తినకుండా ఉండగలరా చెప్పండి.









# అందుకే రోటి పచ్చళ్లే మంచివట !



**పల్లీ చట్నీ, నువ్వుల చట్నీ, కొబ్బరి చట్నీ, కరివేపాకు చట్నీ, వివిధ రకాల కాయ గూరలుఆకుకూరలతో చేసుకునే చట్నీలు..** ఇలా ఏదో ఒక పచ్చడి లేనిదే మన భోజనం పూర్తి కాదు. బయట హోటల్‌లో భోంచేసినప్పుడు కూడా ఏదో ఒక చట్నీ వడ్డించడం మనం చూస్తూనే ఉంటాం. మన ఆహారపుటలవాట్లలో చట్నీకి ప్రాధాన్యత ఉంటే మరి, అలాంటి చట్నీని తయారు చేసుకోవడానికి మనం ఏం ఉపయోగిస్తాం..? మిక్సీ లేదంటే వెట్ గ్రైండర్ కాదు! సులభంగా, త్వరగా చట్నీ చేయడం పూర్తవుతుంది కాబట్టే అందరూ వీటి పైనే ఆధారపడతారు. కానీ అదే సమయంలో రోట్లో రుబ్బుకున్న పచ్చడి రుచిని ఇది అందించలేదని కూడా అంటుంటారు మన పెద్దవాళ్లు, మరి, మిక్సీలో రుబ్బుకున్న పచ్చడి కంటే రోట్లో చేసుకున్న పచ్చడికి ఎందుకంత రుచి వస్తుంది? దానివల్ల మన ఆరోగ్యానికి చేకూరే ప్రయోజనాలేంటి? తెలుసుకుందాం రండి.. ఇడ్లీ, దోసె, వడ, వంటి టిఫిన్స్‌లోకే కాదు.. భోజనంలోకీ రకరకాల పచ్చళ్లను తినడం మనలో చాలామందికి అలవాటు! అయితే మిక్సీz వెట్ గ్రైండర్ వంటి గ్యాడ్జెట్స్ వచ్చాక మనకు ఆ పని మరింత తేలికైంది. కానీ ఇలాంటి పరికరాల్లో రుబ్బుకున్న పచ్చళ్ల రోట్లో నూరుకున్న పచ్చడిలోనే ఎక్కువ పోషకాలు ఉంటాయంటున్నారు పోషకాహార నిపుణులు. వారానికి మూడుసార్లు! మన భారతీయ పాకశాస్త్రంలో పచ్చళ్లది ప్రత్యేక స్థానం. మసాలాలు, ఫైబర్, ఫైటోన్యూట్రియంట్స్ వంటి పోషకాలన్నీ వీటి ద్వారా మన శరీరానికి అందుతాయి. వారానికి కనీసం మూడు సార్లు ఏదో ఒక పచ్చడిని ఆహారంలో భాగంగా తీసుకోవడం మంచిది. మీకు మరో విషయం తెలుసా? పచ్చళ్లను భోజనంలో.. అది కూడా లంచ్‌లో భాగంగా తీసుకోవడం వల్ల మధ్యాహ్నం భోంచేశాక వచ్చే ఒక రకమైన నిద్ర మత్తు, అలసటకు దూరంగా ఉండొచ్చు. ఇక చట్నీ చేసే వీటిని వాడే పదార్థాలన్నీ పచ్చడి బండతో ముక్కలు ముక్కలు చేయడం వల్ల వాటిలోని సూక్ష్మ పోషకాలు, స్టెరోల్స్, ఫ్లేవనాయిడ్స్.నన మొదలైనవన్నీ బయటికి విడుదలవుతాయి. ఆ చట్నీని తినడం వల్ల అవన్నీ మన శరీరానికి బాగా పడతా యంటున్నారు పోషకాహార నిపుణులు. చాలామంది చట్నీ అనగానే మిక్సీ/వెట్ గ్రైండర్లో చేసేస్తుంటారు. పని పూర్తవడంతో పాటు ఎలాంటి త్వరగా లేకుండా సులభంగా చట్నీ చేసేయచ్చని వారు భావిస్తున్నారు. నిజానికి ఇలా మిక్సీలో చట్నీ చేయడం వల్ల వాటిలోని పోషకాలన్నీ నశించిపోతాయి. అదేలాగంటే.. మనం పచ్చడి కోసం వాడే పదార్థాల్లో ఉండే కొన్ని సూక్ష్మ పోషకాలు వేడికి తట్టుకోలేవు. కాబట్టి మిక్సీ/గ్రైండర్‌లో పచ్చడి చేసే వేడి ఉత్పత్తయ్యే వల్ల ఇవన్నీ నశించిపోతాయి. అదే రోట్లో రుబ్బుకునే పచ్చళ్ల కోసం పచ్చడి బండను ఉపయోగిస్తాం. ఇది ఉష్ణ నిరోధకం కాబట్టి పచ్చడి చేసే వేడి పుట్టకుండా అందు లోని పోషకాలన్నీ అలాగే నిక్షిప్తమై ఉంటాయి. ఇలా రోట్లో చేసే పచ్చడి వల్ల ఆయా పదార్థాల్లోని సుగుణాలన్నీ మన శరీరానికి అందుతాయి.. అలాగే చక్కటి రుచిని ఆస్వాదించవచ్చు.



**ప్రయోజనాలెన్నో!.** ◆ ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. శరీరంలోని కణాల రక్తంలోని గ్లూకోజు మరింత సమర్థంగా ఉపయోగించుకుంటుంది. ◆ థైరాయిడ్ సమస్యతో బాధపడే వారు విపరీతమైన అలసటకు గురవుతారు. అలాంటి వారు రోజూ తప్పనిసరిగా చట్నీ తీసుకోవడం మంచిది. ఆ అలసటను దూరం చేసుకోవచ్చు. ◆అజీర్తి వంటి జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడే వారికి రోటి పచ్చళ్లు మంచి ప్రత్యామ్నాయం. ఎందుకంటే ఇవి జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తాయి. 'సి ' డి', 'బి12 '.. వంటి విటమిన్ల లోపం ఉన్న వారు రోజూ తీసుకునే ఆహారంలో చట్నీని తప్పనిసరిగా భాగం చేసుకోవాలి.

# దానిమ్మ జ్యూస్ ఇక సులువు!



ఎర్రటి దానిమ్మ గింజలు చూడ డానికి భలే ఆకర్షణీ యంగా ఉం టాయి కదా. తినడానికి రుచిగానూ ఉంటాయి. కానీ ఒలుచుకుని తినాలంటేనే ఎక్కడలేని నీరసం ముంచుకొస్తుంది. పోనీ మిక్సీలో వేసి జ్యూస్ తీసుకోవాలంటే జార్ సిద్ధం చేసుకోవాలి. సమయానికి కరెంటు లేకపోతే మరో ఇబ్బంది. కానీ ఇలాంటి జ్యూసర్ ఒకటి ఉంటే ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. గింజలను దీంట్లో వేసి చేత్తో ఒత్తుతూ పైభాగాన్ని తిప్పితే చాలు జ్యూస్ కింది పాత్రలోకి దిగుతుంది. తర్వాత దీన్ని సులువుగా శుభ్రం చేసుకోవచ్చు కూడా. మీకు నచ్చిందా మరి...

# పరమాత్ముడి కృతజ్ఞత

ఆధ్యాత్మికం



**దేవకీపుత్రుడు ఓ రోజు** ద్వారకలోని తన నందనవనం లో ఆత్మీయులతో కలిసి విహరి స్తున్నాడు. అర్ధాంగి రుణ్మిని ఓ వైపు, అనుంగు సోదరి ద్రౌపది మరో వైపు, వెంట పరిచారికలతో ఆహ్లాదకరంగా కబుర్లాడుతూ గులాబీతోట దిశగా సాగుతోంది. సోదరికి, అర్ధాంగికి బహుకరించేందుకు అందంగా అర విరిసిన గులాబీలను స్వయంగా కోయటానికి సిద్ధమయ్యాడు వాసుదేవుడు. హడా వుడిగా కొమ్మపై చేయి పెట్టిన కృష్ణుడి వేళ్లకు ముళ్ల గుచ్చుకున్నాయి. చేతికి రక్తం కారుతోంది. రుక్మిణీదేవి, పరిచారికలు కట్టుకట్టేందుకు వస్త్రం కోసం భవనం దిశగా పరు గులు పెట్టారు. పక్కనే ఉన్న సోదరి. ద్రౌపదీ మాత్రం తన పట్టుచీర కొంగును చింపి సోదరుడి చేతికి కట్టు కట్టింది. ఆ ఆలోచన వారికి రానందుకు రుక్మిణీదేవి, పరిచారికలు కొంచెం సిగ్గుపడ్డారు. చెల్లెలి స్పందనకు కృష్ణుడు కదిలిపోయాడు. ఆ సంఘటనను మనసులో ముద్రించుకున్నాడు. అలా కాలం గడిచిపోయింది. కౌరవసభలో పాండవులకు పరాభవం ఎదురైంది. దుశ్శాసనుడు ద్రౌపదిని నిండు సభలో అవమానిస్తున్న సందర్భమది. అర్తజన రక్షకుడికి 'అన్న' అన్న సోదరి పిలుపు వినిపించింది. తక్షణం ఆమె తన గాయానికి కట్టిన పట్టుపీలిక గుర్తొచ్చింది. ఆ అనురాగానికి ప్రతిఫలంగా అనంతమైన వస్త్రాన్ని ప్రసాదించి ఆమె మానాన్ని కాపాడాడు. తన కృతజ్ఞతను చాటుకున్నాడు. గోరంత మేలు చేసినా, కొండంత కృతజ్ఞతలు చెల్లించుకోవటం భగవంతుని లక్షణం అని నిరూపించాడు. శ్రీకృష్ణపరమాత్ముడికి సంబంధించి జానపదుల్లో ప్రచారంలో ఉన్న కథ ఇది.

# ఊదలుతో ఊబకాయం దూరం..

రాగులు, సజ్జల్లాంటివి తింటుంటాం కానీ ఊదల గురించి మనకు పెద్దగా తెలీదు. వీటిలో పీచు, ప్రొటీన్లు, క్యాల్షియం, ఐరన్, భాస్వరం, మెగ్నీషియం విస్తారం. ఊదల వల్ల ఎన్నో ప్రయోజాలు ఉన్నాయి

- ★ ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. ఊబకాయం రాదు.
- ★ రక్తహీనత నుంచి బయటపడొచ్చు. బ్లడ్ షుగర్ స్థాయి క్రమబద్ధమవుతుంది.
- ★ గుండెజబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుంది.
- ★ ఊదలతో జావ, అన్నం, ఇడ్లీ, ఖీర్, రొట్టెలు, పరోటా, ఉప్మా, ధోక్లా, టిక్కీ, కిచిడీ, పులావ్ ఇలా . ఎన్నో చేసుకోవచ్చు.

ఊదల పులావ్ ఇలా... ఒక కప్పు ఊదలకు రెండు టేబుల్ స్పూన్ల నెయ్యి, రుచికి సరిపడా ఉప్పు, చారెడు జీడిపప్పు, లవంగాలు, యాలకులు రెండేసి, దాల్చినచెక్క అంగుళం ముక్క, సోంపు, జీలకర్ర, అల్లం వెల్లుల్లి ముద్ద చెంచా చొప్పున, మూడు పచ్చిమిర్చి, నిమ్మ ఉల్లి, టొమాటో, బంగాళాదుంప, బంగాళాదుంపల పొడి చారెడు, కొత్తిమీర తరుగు, రెండు ఉల్లికాడలు తీసుకోవాలి. ఊదలను కడిగి నానబెట్టాలి, ఈలోగా.. ఉల్లి, బంగాళదుంప మొదలైనవాటిని తరగలి. ప్యాన్‌లో నెయ్యి వేడయ్యాక మసాలా దినుసులు, అల్లం వెల్లుల్లి ముద్ద, జీడిపప్పు వేయాలి. అవి వేగాక మిరియాల పొడి, ఉల్లి, పచ్చిమిర్చి, టొమాటో, బంగాళ దుంప, తరిగిన ఉల్లికాడలు, ఉప్పు జతచేసి వేయించాలి. వాటిని కాస్త ఊడకనిచ్చి.. నాన బెట్టిన ఊడలు, రెండు కప్పుల నీళ్ల, నిమ్మరసం వేసి కలియతిప్పి మూత పెట్టాలి. మూడు నిమిషాల తర్వాత దించేసి కొత్తిమీర తరుగు చల్లితే సరిపోతుంది.



# ఛాంపియన్స్ ట్రోఫీ.. స్క్వాడ్‌లకు టెర్రర్


బుమ్రా


జామీ స్మిత్


లాకీ ఫెర్గూసన్


పాట్ కమిన్స్

## గాయాల బారిన ప్లేయర్స్
### పలువురు స్టార్లు దూరం

**న్యూఢిల్లీ:** ప్రతిష్ఠాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ-2025 దగ్గర పడుతున్న కొద్దీ వివిధ జట్లు భయాలతో కారొత్తుతున్నాయి. ఈ టోర్నమెంట్‌లో ఆడుతున్న చాలా మంది ఆటగాళ్లపై సస్పెన్స్ నెలకొంది. ప్రధానంగా గాయాల పాలైన పలువురు స్టార్లు ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యే అవకాశాలు ఉత్పన్నమయ్యాయి. ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ముందు చాలా మంది ఆటగాళ్లు గాయాల కారణంగా ఆటకు దూరంగా ఉన్నారు. 2025 సంవత్సరంలో క్రికెట్ ప్రపంచంలో మొట్టమొదటి, అతిపెద్ద టోర్నమెంట్ ఛాంపియన్స్ ట్రోఫీ అవుతుంది. ఈ ఐసిసి టోర్నమెంట్ ఈ నెల 19 నుంచి ప్రారంభమవుతుంది. ఫైనల్ మ్యాచ్ మార్చి 9 న జరుగుతుంది. ఈ ట్రోఫీకి ఇప్పటికే అన్ని జట్లు తమ స్క్వాడ్లను ప్రకటించాయి. అయితే, స్క్వాడ్ ప్రకటన తర్వాత, చాలా జట్లు పెద్ద షాక్‌కు గురయ్యాయి. ప్రతి జట్టులోని కొంతమంది ప్లేయర్లు గాయాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ కారణంగా కొంతమంది ఆటగాళ్లను టోర్నమెంట్ నుంచి తొలగించేందుకు సిద్ధమవుతున్నాయి. ఓ జట్టులో అయితే ఏకంగా 9 మంది ఆటగాళ్లు గాయాలపాలయ్యారు. భారత విషయానికి వస్తే జట్టులో గాయపడిన జస్ప్రీత్ బుమ్రాను చేర్చుకుంది. ఆస్ట్రేలియా పర్యటనలో బుమ్రా వెన్ను నొప్పితో బాధపడాల్సి వచ్చింది. బుమ్రాకు స్కాన్, అసెస్‌మెంట్ పరీక్ష రెండు రోజుల క్రితం జరిగింది. నివేదిక అందిన తర్వాత అతడిని ఛాంపియన్స్ ట్రోఫీలో ఉంచాలా లేదా అనే దానిపై నిర్ణయం తీసుకోనున్నారు. ఇక బుమ్రాతో పాటు, ఇంగ్లాండ్ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ జామీ స్మిత్ కూడా గాయపడ్డాడు. అతను ఛాంపియన్స్ ట్రోఫీలో ఇంగ్లాండ్ జట్టులో భాగం. రాజ్‌కోట్‌లో భారత్‌తో జరిగిన మూడో టీ20లో అతని కాలికి గాయమైంది. ఈ గాయం నుంచి స్మిత్ ఇంకా కోలుకోలేదు. న్యూజిలాండ్‌కు చెందిన స్టార్ బౌలర్ లాకీ ఫెర్గూసన్ తొడ కండరాల గాయం కారణంగా ఈ ట్రోఫీతో పాటు, పాకిస్తాన్‌లో జరగనున్న ట్రై నేషన్ సిరీస్‌కు దూరంగా ఉండే అవకాశం ఉంది. దీంతో న్యూజిలాండ్ టీమ్‌కు తీవ్ర నష్టం ఏర్పడనుంది. ఇక పాకిస్తాన్ వర్ధమాన బ్యాట్స్‌మన్ సామ్ అయూబ్‌ను కూడా ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి తొలగించాల్సి వచ్చింది. అతను చీలమండ గాయంతో బాధపడుతున్నాడు. ఈ ఏడాది ప్రారంభంలో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు శామ్ అయూబ్ తీవ్ర గాయపడ్డాడు. అయూబ్ ఫిట్‌గా ఉండి ఉంటే, అతనికి ఖచ్చితంగా పాకిస్తాన్ జట్టులో అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. ఇక ఈ ట్రోఫీ ప్రారంభానికి ముందు ఆస్ట్రేలియాకు అతిపెద్ద దెబ్బ తగిలింది. ఛాంపియన్స్ ట్రోఫీ టీమ్‌లో చేరిన 3 ఆస్ట్రేలియా ఆటగాళ్లను తొలగించారు. ఒకరు పదవీ విరమణ చేశారు. వెన్ను గాయం కారణంగా మిచెల్ మార్ష్ ఇప్పటికే జట్టుకు దూరమయ్యాడు. ఆ తర్వాత, కెప్టెన్ పాట్ కమ్మిన్స్ చీలమండ, జోష్ హాజిల్‌వుడ్ తుంటి గాయం కారణంగా టోర్నమెంట్‌కు దూరమయ్యారు. ఇంతలో, ఆస్ట్రేలియా స్టార్ ఆల్ రౌండర్ మార్కస్ స్టోయినిస్ ఆకస్మాత్తుగా రిటైర్ అయ్యాడు. స్టోయినిస్ కూడా గాయాలతో బాధ పడుతున్నాడు. కాగా ట్రోఫీకి దక్షిణాఫ్రికా జట్టులో భాగమైన ఇద్దరు ఫాస్ట్ బౌలర్లకూడా పెద్ద ఎదురు దెబ్బ తగిలారు. గజ్జల్లో గాయం, అన్రిచ్ నోర్కియా వెన్ను గాయం కారణంగా జెరాల్డ్ కోయెట్జీ ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు.




# సౌతాఫ్రికా టీ20 ఫైనల్లో.. ఛాంపియన్‌గా ముంబై
## రెండు సార్లు విజేత సన్‌రైజర్స్‌కు ఎదురు దెబ్బ

**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికా టీ20 టోర్నమెంట్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్‌కు ఎదురు దెబ్బ తగిలింది. 20 టోర్నమెంట్‌లో గ్రాండ్ విక్టరీ కొట్టి ముంబై కేప్ టౌన్‌ఛాంపియన్‌గా నిలిచింది. ఇప్పటికే రెండుసార్లు విజేతగా నిలిచిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టును చిత్తు చిత్తుగా ఓడించింది. ఈ ఫైనల్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు చెందిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టును 76 పరుగుల తేడాతో ముంబై మట్టికరిపించింది. ఈ మ్యాచ్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసిన ముంబై బౌలర్ ట్రెంట్ బోల్ట్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ లభించింది. ఈ మ్యాచ్‌లో నాలుగు ఓవర్లు వేసిన బోల్ట్ 9 పరుగులే ఇచ్చి రెండు వికెట్లు తీయడం విశేషం. దీంతో ఫైనల్‌లో సన్‌రైజర్స్ జట్టు కకావికలమైంది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ముంబై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 181 పరుగులు చేసింది. సన్‌రైజర్స్ బౌలర్లు సరైన లెంత్‌తో బౌలింగ్ చేయకపోవడంతో ముంబై భారీ స్కోర్ చేయగలిగింది. ఇక ముంబై ఇన్నింగ్స్‌లో ఏ ఒక్క ప్లేయర్ 40 పరుగులు చేయలేకపోయినా, సమిష్టిగా ఆడటంతో కొన్ని పరుగులు చేశారు. కోనార్ 39 పరుగులు చేయగా, డెవాల్డ్ బ్రెవిస్ 38 పరుగులు చేసి రాణించాడు. వికెట్ కీపర్ రికెల్టన్ 33 పరుగులు చేసి జట్టుకు అమూల్యమైన పరుగులు అందించాడు. లిండే 20 పరుగులు, డుస్సేన్ 23 పరుగులు చేశారు. ఇక ముంబై కెప్టెన్ రషీద్ ఖాన్, హెన్రిక్స్, కోరబిన్ కూడా డకౌట్ అయ్యారు. ముంబై కేప్ టౌన్ ఉంచిన 182 పరుగుల లక్ష్యాన్ని చేధించే క్రమంలో సన్‌రైజర్స్ దారుణంగా విఫలమైంది. ఈ ఫైనల్ మ్యాచ్‌లో 18.4 ఓవర్లు ఆడిన సన్‌రైజర్స్... 105 పరుగులకే ఆల్ అవుట్ అయింది. టామ్ అబెల్ ఒక్కడే 30 పరుగులు చేయగా టోనీ 26 పరుగులు చేయగలిగాడు. ఇక సన్‌రైజర్స్ కెప్టెన్ ఐడెన్ మార్క్రమ్ దారుణంగా విఫలమై ఆరు పరుగులకే అవుట్ అయ్యాడు. ఇలా టాప్ ఆర్డర్ బ్యాటర్లు ఎవరూ కూడా రాణించకపోవడంతో సన్‌రైజర్స్ 105 పరుగులకే కుప్పకూలింది. కాగా ఇప్పటికే రెండు సార్లు ఛాంపియన్ గా నిలిచిన సన్‌రైజర్స్ ఈసారి ఫైనల్ పరాజయం పాలవగా, మొదటిసారి సౌతాఫ్రికా టీ20 టోర్నమెంట్ ఛాంపియన్‌గా ముంబై కేప్ టౌన్ నిలిచింది.

## గ్రాండ్‌స్లామ్ చెస్‌లో నాకౌట్‌కు గుకేశ్

**న్యూఢిల్లీ:** ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్ టూర్‌లో భారత యువ గ్రాండ్ మాస్టర్, ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ నాకౌట్‌కు అర్హత సాధించాడు. జర్మనీలోని హాంబర్గ్‌లో జరిగిన క్వాలిఫయర్స్ చివరి మ్యాచ్‌లో స్టార్ ప్లేయర్ మాగ్నస్ కార్ల్‌సన్ చేతిలో ఓటమి పాలైనప్పటికీ గుకేశ్ ముందంజ వేశాడు. ఈ టోర్నీ మొత్తంలో 9మ్యాచులు ఆడిన గుకేశ్‌స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోయాడు. ఒక్క మ్యాచ్ లోనూ విజయం సాధించని భారత గ్రాండ్‌మాస్టర్, ఏడు మ్యాచులను డ్రాచేసుకుని, మరోరెండు మ్యాచ్‌ల్లో ఓటమి పాలయ్యాడు. ఫలితంగా గుకేశ్ ఖాతాలో 3.5పాయింట్లు చేరాయి. పదిమంది ప్లేయర్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో ఎనిమిదో స్థానంలో నిలవడం ద్వారా గుకేశ్ నాకౌట్‌లో అడుగుపెట్టాడు. క్వాలిఫయింగ్ దశ ముగిసే సరికి ఫ్రాన్స్ గ్రాండ్ మాస్టర్ అలిరెజా ఫిరోజా, ఉజ్బెకిస్తాన్‌కు చెందిన జవోకిర్ సిందరోవ్ చెరో 6.5 పాయింట్లతో తొలి రెండు స్థానాల్లో నిలిచారు. ఇక అమెరికా గ్రాండ్ మాస్టర్ ఫాబియానో కరువా (6 పాయింట్లు) మూడోస్థానం దక్కించుకోగా, మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే), హికారు నకమురా (అమెరికా) చెరో 5.5 పాయింట్లతో వరుసగా నాలుగో, ఐదో స్థానాల్లో నిలిచారు. జర్మనీకి చెందిన విన్సెంట్ కైమెర్ 4 పాయింట్లతో ఆరో ప్లేస్ దక్కించుకున్నాడు. ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నొదిర్‌బెక్ అబ్దుసత్తోరోవ్, గుకేశ్ చెరో 3.5 పాయింట్లతో వరుసగా ఏడు, ఎనిమిదో స్థానాల్లో నిలిచారు.

## ముగిసిన టెన్నిస్ స్టార్ 'మాయ' పోరు



**న్యూఢిల్లీ:** ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ-125 టోర్నీలో సంచలన ప్రదర్శన కొనసాగిస్తూ వచ్చిన భారత టీనేజ్ టెన్నిస్ స్టార్ మాయ రాజేశ్వరన్ రేవతి పోరు సెమీ ఫైనల్లో ముగిసింది. ముంబై ఓపెన్ డబ్ల్యూ టీఏ-125 టోర్నీలో వైల్డ్ కార్డ్ ఎంట్రీతో బరిలో దిగిన ఆమె అద్భుత ప్రదర్శనతో పలువురు అంతర్జాతీయ క్రీడాకారిణులను కంగుతినిపించి ఒక్క సారిగా వార్తల్లో నిలిచింది. కానీ ఆమె జోరుకు సెమీస్‌లో బ్రేక్ పడింది. ఈ మ్యాచ్‌లో 15 ఏళ్ల భారత ప్లేయర్ 3-6, 1-6తో స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రపంచ 117వ ర్యాంకర్ జిల్ టెచ్‌మన్ చేతిలో పరాజయం చవి చూసింది. మొత్తానికి బరిలోకి దిగిన తొలి సీనియర్ స్థాయి టోర్నీలో మాయ చేసిన పోరాటం అందర్ని ఆకట్టుకుంది. రెండో సెమీస్‌లో ఎనిమిదో సీడ్ మనంచయ సవాంగ్‌కావ్ (థాయ్‌లాండ్) 6-2, 6-2తో రెండో సీడ్ రెబెక్కా మరినో (కెనడా)పై గెలిచి ఫైనల్ చేరింది.

# రెండో టెస్టులో..ఆస్ట్రేలియా సూపర్ విక్టరీ



## శ్రీలంక 9 వికెట్ల తేడాతో ఓటమి

**న్యూఢిల్లీ:** వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ సైకిల్ 2023-25ను ఆస్ట్రేలియా సూపర్ విక్టరీతో ముగించింది. గాలే వేదికగా శ్రీలంకతో జరిగిన రెండో టెస్టులో 9 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా ఘనవిజయం సాధించింది. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0 తేడాతో ఆసీస్ క్లీన్ స్వీప్ చేసింది. ఇక రెండో టెస్టులో శ్రీలంక నిర్దేశించిన 75 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కంగారులు కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఉస్మాన్ ఖవాజా (27), మార్నస్ లబుషేన్ (26) ఆజేయంగా నిలిచి మ్యాచ్‌ను ముగించారు. అంతకుముందు 8 వికెట్ల నష్టానికి 211 ఓవర్‌నైట్ స్కోరుతో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక తమ రెండో ఇన్నింగ్స్‌లో 231 పరుగులకే ఆలౌటైంది. దీంతో పర్యాటక ఆసీస్ ముందు కేవలం 75 పరుగుల లక్ష్యాన్ని మాత్రమే శ్రీలంక ఉంచగలిగింది. కాగా లంక బ్యాటర్లలో సీనియర్ ఆల్‌రౌండర్ ఏంజెలో మాథ్యూస్ (149 బంతుల్లో 76; 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా, వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ (50 బంతుల్లో 48 బ్యాటింగ్; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఈ మ్యాచ్ అనంతరం అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకనున్న సీనియర్ బ్యాటర్ దిముత్ కరుణరత్నే (14) ఎక్కువసేపు నిలువలేకపోగా, పతుమ్ నిస్సాంక (8), దినేశ్ చండిమాల్ (12), కమిందు మెండిస్ (14), కెప్టెన్ ధనంజయ డిసిల్వ (23) విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మాథ్యూ కునేమన్, నాథన్ లియోన్ తలా 4 వికెట్లు పడగొట్టగా, వెబ్‌స్టర్ రెండు వికెట్లు సాధించాడు. ఇక ఆస్ట్రేలియా తమ తొలి ఇన్నింగ్స్‌లో 414 పరుగుల భారీ స్కోర్ చేయగా, శ్రీలంక తమ మొదటి ఇన్నింగ్స్‌లో 257 పరుగులకే ఆలౌటైంది. ఈ మ్యాచ్‌లో ఆసీస్ స్పిన్నర్లు మాథ్యూ కునేమన్, నాథన్ లియోన్ సత్తా చాటారు. రెండు ఇన్నింగ్స్‌ల కలిపి కునేమన్, లియోన్ చెరో 7 వికెట్లు పడగొట్టారు. కాగా ఆస్ట్రేలియా ఇప్పటికే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించింది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత్‌ను ఓడించి ఆసీస్ తమ డబ్ల్యూటీసీ బెర్త్ ఖారారు చేసుకుంది.

# వాణిజ్యం

# డీప్ సీక్ ఎఐపై హ్యాకర్ల ఫోకస్

**ముంబై, ఫిబ్రవరి 9:** ఇప్పటికే చైనా ఎఐపై అనేక విమర్శలు వచ్చాయి. దాని వల్ల దేశ భద్రతకు ప్రమాదం కలుగుతుందంటూ పలు దేశాలు నిషేధం విధించాయి. ఇప్పుడు మరో కొత్త విషయం ప్రపంచాన్ని షాక్‌కు గురి చేస్తోంది. డీప్ సీక్ ఏఐని వాడుకుని హ్యాకర్లు అనేక దారుణాలకు పాల్పడే అవకాశం ఉందని చెబుతున్నారు. తాజా చెక్ పాయింట్ నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించారు. డీప్ సీక్ తన కొత్త ఆర్ఐ ఎఐ మోడల్‌ను ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసింది. దీన్ని అనేక మంది యూజర్లు ఇన్ స్టాల్ చేసుకున్నారు. డీప్ సీక్ ఎఐ సేవలను ప్రశంసించారు. ఇదే సమయంలో హ్యాకర్ల కన్ను డీప్ సీక్ ఎఐపై పడింది. వారు దాని సేవలను పూర్తిగా దుర్వినియోగం చేసే అవకాశం ఉందని సమాచారం. ఎందుకంటే హ్యాకర్ కమ్యూనిటీ ప్రస్తుతం డీప్ సీక్, క్వెన్ ద్వారా హానికరమైన కంటెంట్‌ను డెవలప్ చేయడానికి ఎఐ సాధనాలను ఉపయోగిస్తున్నారు. ఎఐ టెక్నాలజీ కారణంగా అన్ని రంగాలలో పనులు మరింత సులభమయ్యాయి. ఏ సమస్యకైనా చిటికెలో పరిష్కారం చూపుతున్నాయి. దీనితో అనేక కంపెనీలు ఏఐ సేవలపై ఆధారపడుతున్నాయి. మనుషుల కంటే వేగంగా, తప్పులు లేకుండా సమస్యలను పరిష్కరించడం దీని ప్రత్యేకత. అయితే కొత్త ఎఐ మోడళ్లపై అప్రమత్తంగా ఉండాలని భద్రతా నిపుణులు చెబుతున్నారు. చెక్ పాయింట్ సాఫ్ట్‌వేర్ టెక్నా లజీస్ లిమిటెడ్ విడుదల చేసే వార్షిక నివేదికను చెక్ పాయింట్ నివేదిక అంటారు. సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన అనేక విషయాలను దీనిలో ఉంటాయి. ప్రపంచ వ్యాప్తంగా సైబర్ దాడులలో 44 శాతం పెరుగుదల నమోదైందని తాజా నివేదికలో తెలిసింది. డీప్ సీక్ మార్కెట్‌లోకి రావడంతోనే సంచలనం రేపింది. వస్తూనే అమెరికా స్టాక్ మార్కెట్‌ను గడగడలాడించింది. దీంతో యూఎస్ టెక్ స్టాక్‌లను భారీగా అమ్ముకోవాల్సి వచ్చింది. డీప్ సీక్ దెబ్బకు ఎన్విడియా, ఒరాకిల్‌తో సహా అనేక మంది బిలియనీర్లు భారీ నష్టాల బారిన పడ్డారు. ఒక రకంగా చెప్పాలంటే చైనాకు చెందిన డీప్ సీక్ ఏఐని చూసి అమెరికా కూడా భయపడింది. చైనాకు చెందిన లియాంగ్ వెన్ ఫెంగ్ అనే వ్యాపారవేత్త ఏఐ కంపెనీ డీప్ సీక్ ఏర్పాటు చేశారు. అమెరికాకు ధీటుగా చైనాను నిలిపేందుకే కొత్త చాట్ బాట్ రూపొందించినట్టు చెప్పాడు. డీప్ సీక్ ఉత్పాదక ఎఐ మోడల్ రిలీజ్ వల్ల అమెరికాలోని టెక్ స్టాక్‌లలో భారీ అమ్మకాలు జరిగాయి. ప్రముఖ చిప్ కంపెనీ అయిన ఎన్విడియా దాదాపు 600 బిలియన్లు నష్టపోయింది. ఒరాకిల్ ఛైరమ్ లారీ ఎల్లిసన్ కు 27.6 డాలర్లు, ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్‌కు 20.8 బిలియన్ డాలర్ల నష్టం కలిగింది.




# భారీగా పెరిగిన విదేశీ మారకద్రవ్యం..

**ముంబై, ఫిబ్రవరి 9:** జనవరి 31తో ముగిసిన వారానికి భారతదేశ ఫారెక్స్ నిల్వలు 1.05 బిలియన్ డాలర్లు పెరిగి 630.607 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్‌బీఐ ఇటీవల తెలిపింది. గత నివేదికలో మొత్తం నిల్వలు 5.574 బిలియన్ల డాలర్ల నుంచి పెరిగి 629.557 బిలియన్ల డాలర్లకు చేరుకున్నాయి. రూపాయిలో అస్థిరతలను తగ్గించడంలో ఆర్‌బీఐ కీలక చర్యలు తీసుకుంటుంది. ముఖ్యంగా ఫారెక్స్ మార్కెట్ జోక్యాలతో పాటు పునఃమూల్యాంకనం వంటి చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఆర్‌బీఐ చర్యల కారణంగా గత కొన్ని వారాలుగా వాల్యూ పరంగా తగ్గుతున్న నిల్వలు వరుసగా రెండవ వారంలో పెరిగాయి. 2024 సెప్టెంబర్ చివరి నాటికి ఫారెక్స్ నిల్వలు ఆల్ టైమ్ గరిష్ట స్థాయికు చేరాయి. అంటే ఫారెక్స్ నిల్వలు 704.885 బిలియన్ల డాలర్లకు పెరిగాయి. జనవరి 31తో ముగిసిన వారానికి నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 207 మిలియన్ డాలర్లు తగ్గి 537.684 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని శుక్రవారం విడుదల చేసిన డేటా ప్రకారం వెల్లడైంది. డాలర్ పరంగా వ్యక్తీకరించిన విదేశీ కరెన్సీ ఆస్తులలో విదేశీ మారక నిల్వలలో ఉన్న యూరో, పౌండ్, యెన్ వంటి యూఎస్ యేతర యూనిట్ల పెరుగుదల లేదా తరుగుదల ప్రభావం ఉంటుంది. ఈ వారంలో బంగారం నిల్వలు 1.242 బిలియన్ డాలర్లు పెరిగి 70.893 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 29 మిలియన్ల డాలర్లు పెరిగి 17.889 బిలియన్ల డాలర్లకు చేరుకున్నాయని అపెక్స్ బ్యాంక్ తెలిపింది. ఈ బ్యాంక్ గత వారం తెలిపిన వివరాల ప్రకారం భారతదేశం యొక్క నిల్వ స్థానం 14 మిలియన్ల డాలర్లకు తగ్గి 4.141 బిలియన్ల డాలర్లకు చేరుకుంది.



# బెంగళూరులో ఇల్లు కొంటున్న తెలుగు టెక్కీలకు అలర్ట్!

**బెంగళూరు, ఫిబ్రవరి 9:** ఇండియన్ సిలికాన్ వ్యాలీగా ఉన్న బెంగళూరుకు దేశంలోని అనేక ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు పనిచేసేందుకు వస్తూనే ఉంటారు. అయితే ఆ నగరంలో ఎక్కువగా స్థిరపడిన వారిలో ఎక్కువ శాతం రెండు తెలుగురాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు, టెక్కీలు, వ్యాపారులు ఉన్నారు. ఈ క్రమంలోనే ఉద్యోగం కోసం నగరానికి వెళుతున్న వారు క్రమంగా అక్కడే స్థిరపడాలని ఇల్లు కూడా కొనాలని ప్లాన్ చేసుకుంటున్నారు. బెంగళూరును దశాబ్ధాలుగా వెంటాడుతున్న రెండు సమస్యల్లో ఒకటి ట్రాఫిక్ ఇబ్బందులు కాగా రెండవది నీటిఎద్దడి సమస్య. అయితే నిరంతరం నగరంలో పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా కర్ణాటక ప్రభుత్వం ఫ్లైఓవర్లను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. దాదాపు రూ.9,800 కోట్లను కొత్త ఫ్లైఓవర్ల నిర్మాణానికి ఉపయోగించటం వ్యర్థమని ప్లానర్లు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం లాస్ట్ మైల్ కనెక్టివిటీపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం నగరంలోని జేపీ నగర్ నుంచి హెబ్బల్ మధ్య నిర్మిస్తున్న పొడవైన డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణంపై ప్రస్తుతం నిపుణుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రతిపాదిత రోడ్ కమ్ మెట్రో కారిడార్ ప్రాజెక్ట్ తప్పుడు దిశలో ఒక అడుగని మొబిలిటీ నిపుణులు చెబుతున్నారు. టన్నెల్ రోడ్లు,డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లు వంటి మౌలిక సదుపాయ ప్రాజెక్టులు ప్రజా రవాణా నెట్‌వర్క్‌లో ప్రయాణికుల సంఖ్యను, వాటాను తగ్గిస్తాయని వారు వాదిస్తున్నారు. రూ.9,800కోట్ల ప్రాజెక్టు కేవలం తాత్కాలిక ఉపశమనం మాత్రమే అందిస్తుందని రద్దీ పాయింట్‌ను మారుస్తుందని నిపుణులు సూచిస్తుంది. కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న చర్యలు నగరంలో నివసించే ప్రజల జీవితాల నాణ్యతను మెరుగుపరచదని నిపుణులు వాదిస్తున్నారు. ప్రజారవాణా కనెక్టివిటీ ద్వారా మాత్రమే అందరికీ ప్రాప్యత లభిస్తుందని వారు చెబుతున్నారు. ప్రాజెక్ట్ కోసం అన్ని వనరులను ప్రజా రవాణా వ్యవస్థలకు లాస్ట్ మైలు కనెక్టివిటీని అభివృద్ధి చేయడానికి ఉపయోగించాలి. ప్రైవేట్ ఆటగాళ్లను ఈ స్థలంలోకి అనుమతించడానికి ప్రభుత్వం స్టేజ్ క్యారేజ్ చట్టాన్ని సవరించాలని పబ్లిక్ మొబిలిటీ ప్రతిపాదకుడు సందీప్ అనిరుధన్ పేర్కొన్నారు. ప్రస్తుతం చాలా మంది తెలుగు ఐటీ ఉద్యోగులు ఇంటి అద్దెలు చెల్లించటం కంటే సొంతిల్లు కొనుక్కుని దానికి ఇఎంఐ చెల్లించటం ఉత్తమంగా బెంగళూరులో భావిస్తున్నారు. ఈ క్రమంలో సొంత ఇల్లు కొనుక్కునే ముందు ఆ ప్రాంతానికి రవాణా వ్యవస్థ కనెక్టివిటీ, ట్రాఫిక్ సమస్యలు వంటి వాటిని ముందుగా పరిగణలోకి తీసుకుని ప్రాపర్టీ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీనికి తోడు సదరు ప్రాంతంలో నీటి సమస్యలను సైతం ప్రజలు పరిగణలోకి తీసుకోవాలని రియల్టీ నిపుణులు సూచిస్తున్నారు. ఇవి భవిష్యత్తులో ఇల్లు అమ్మాలనుకున్నప్పుడు మంచి ధర రావటానికి కూడా సహాయంగా నిలుస్తాయని నిపుణులు సూచిస్తున్నారు.



# నేటి మార్కెట్‌కు నిపుణులు సూచన

**ముంబై, ఫిబ్రవరి 9:** గతవారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ ఒడుదొడుకులను చూశాయి. దీనికి ప్రధాన కారణాలను పరిశీలిస్తే,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై విధించిన టారిఫ్స్ ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్ల పనితీరును వాణిజ్య యుద్ధ భయాలు కమ్మేయటంతో తీవ్ర ఒడిదొడుకులకు లోనయ్యాయి. ఇవి పెట్టుబడిదారుల సెంటిమెంట్లను భారీగా దెబ్బతీశాయి. ఇదే క్రమంలో భారతీయ స్టాక్ మార్కెట్ల విషయానికి వస్తే, ట్రంప్ ట్రేడ్‌యుద్ధంతో పాటు డిపోర్టేషన్, రిజర్వు బ్యాంక్ మానిటరీ పాలసీ సమావేశం వంటి ఇతర అంశాలు మార్కెట్లను ప్రభావితం చేశాయి. రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గింపును ప్రకటించినప్పటికీ వరుసగా మూడోరోజు కూడా శుక్రవారం మార్కెట్లు నష్టాల్లోనే క్లోజ్ కావటం గమనార్హం. ఈవారం ట్రేడింగ్ సెషన్లను పరిశీలిస్తే ప్రధానంగా కీలక బెంచ్ మార్క్ సూచీలు భారీ ఒలటాలిటీని చూశాయి. ఇటీవలి బడ్జెట్లో ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటించిన ఆదాయపు పన్ను కోతలు, ఆర్బీఐ వడ్డీ రేట్ల తగ్గింపులు ఆర్థిక వృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తాయి. అయితే దాని విజయం పన్ను పొదుపులు అధిక వినియోగం, పెట్టుబడిగా ఎంత ప్రభావవంతంగా అనువదిస్తాయనే దానిపై ఆధారపడి ఉంటుందని కేపిటల్ మైండ్సెట్ ప్రతినిధి కృష్ణ అప్పల అభిప్రాయపడ్డారు. ద్రవ్యోల్బణం అదుపులో ఉంటే భారత ఆర్థిక వ్యవస్థ స్థిరమైన రికవరీని చూపిస్తుందని ఆయన పేర్కొన్నారు. వ్యాపారులు, ఇన్వెస్టర్లు కొత్తగా వచ్చే అవకాశాలను ఉపయోగించుకోవడానికి ఇది కీలకమైన కాలంగా మారుతుందని అన్నారు.

# చిన్న, మధ్యతరహా వ్యాపారుల కోసం ఎస్ఎంఎఫ్‌జి

**ముంబై, ఫిబ్రవరి 9:** ఎస్ఎంఎఫ్ జీ ఇండియా క్రెడిట్ బిజినెస్ లోన్ కొత్త బ్రాండ్ ఫిల్మ్ రిలీజ్ చేసింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వ్యాపారులకు ఆర్థిక సాయం అందించే థీమ్‌తో దీన్ని రూపొందించింది. వారిలో ఒక ఆశ నింపేందుకు, వారి జీవితాలను సమూలంగా మార్చేందుకు, వారి ముందున్న అనంతమైన అవకాశాలను తెలియజేస్తూ ఈ బ్రాండ్ ఫిల్మ్ రూపొందింది. చిన్న, మధ్య తరహా వ్యాపారుల కోసం ఎస్ఎంఎఫ్‌జీ ఎంత కమిట్‌మెంట్‌తో ఉందో ఈ ఫిల్మ్ తెలియజెప్తుంది. వారు మరింత పెద్ద కలలు కనేందుకు, మరింత ఎదిగేందుకు, అభివృద్ధి చెందేందుకు ఎస్ఎంఎఫ్ జీఇండియా క్రెడిట్ బిజినెస్ లోన్ ఎలా సహకరిస్తుందో కళ్లకు కట్టినట్టు ఉంది. వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు కష్టాలు పడుతున్న ఓ చిన్న రిటైలర్ జీవితంలో జరిగే సంఘటనలకు హాస్యాన్ని జోడించి, మ్యూజికల్ టచ్ ఇచ్చి మరింత హృద్యంగా ఈ ఫిల్మ్ చిత్రీకరించారు. ఎస్ఎంఎఫ్ జీ ఇండియా క్రెడిట్ బిజినెస్ లోన్ అనేది ఆ చిరు వ్యాపారి జీవితాన్ని ఎలా మలుపుతిప్పింది? ఆ తర్వాత అతని జీవితం ఎలా మారిపోయింది?, అతనికి కొత్త గుర్తింపును ఎలా తీసుకొచ్చింది? ఆతని ఆర్థిక పరిస్థితి ఎంత మెరుగుపడిందనే అంశాలను హృద్యంగా చిత్రీకరించారు. ఒక వ్యక్తి ఆశయం, అతని ఆర్థిక స్వావలంబన ఎంత పవర్ ఫుల్‌గా ఉంటుందో ఈ ఫిల్మ్‌లో అంతర్లీనంగా ఉంటుంది. ఈ ఫిల్మ్ గురించి ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ అజయ్ పరీక్ మాట్లాడుతూ 'భారతదేశ జీడీపీలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల వాటా 30శాతం ఉంది. ఉద్యోగాల కల్పనలో ఇవి కీలక భూమిక పోషిస్తాయి. కానీ, వారికి రుణాలు కావాల్సినప్పుడు మాత్రం కొన్ని సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. అలాంటి వారికి సరళమైన రేటుకే వడ్డీకి, తక్కువ డాక్యుమెంట్లు, సులభమైన చెల్లిపు పద్ధతుల్లో ఎస్ఎంఎఫ్ జీ ఇండియా క్రెడిట్ రుణాలు ఎలా కల్పిస్తుందో ఈ బ్రాండ్ ఫిల్మ్ తెలియజేస్తుంది. టార్గెట్ ఆడియన్స్‌ను చేరుకోవడానికి సరిపోయే భిన్నమైన కథనం, మ్యూజికల్ టచ్, సరదాగా ఉండే సన్నివేశాలు అన్నీ ఈ ఫిల్మ్‌లో ఉన్నాయి.' అని అన్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.